చదవండి... చదివించండి... 1952
విశాలాంధ్ర
జాతీయ తెలుగు దినపత్రిక

చందా వివరాలు

సంవత్సరం చందా	రూ. 1000/-లు
అర్థ సంవత్సరం చందా	రూ. 500/-లు
3 నెలల చందా	రూ. 250/-లు
నెల బిల్లు	రూ. 95/-లు
విడి పత్రిక	రూ. 3/-లు
ఆదివారం	రూ. 4/-లు

వివరములకు సంప్రదించండి 7995009615

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంబరాల జీవితం సౌభాగ్యాల సారథం
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
38
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

సంపుటి : 66 సంచిక : 220 | బుధవారం 31-01-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ



వినిమయ పన్నుతో సామాన్యులకు చేటు

- వారికి ఆదాయం పన్నే మేలు
- దానివల్ల ధనికులకే లాభం!
- వాస్తవ ఖర్చుపై విధించే ట్యాక్స్
- పేద, మధ్య తరగతిపై పెనుభారం
- తెర పైకి అర్థరహిత వాదన


న్యూఢిల్లీ : దేశంలో ఆదాయం పన్నును రద్దు చేయాలన్న డిమాండ్ రోజు రోజుకూ గట్టిగా వినిపిస్తున్నది. దీని స్థానంలో వినిమయ పన్నును ప్రవేశపెట్టాలని చాలా మంది వాదిస్తున్నారు. ఇలా చేయడం ద్వారా ఒకే దెబ్బతో ఇటు పన్నుల ఎగవేతను అరికట్టడంతో పాటు అటు నల్లధనాన్ని నిర్మూలించేందుకు వీలవుతుందని, అంతేకాకుండా పన్నుల పరిధిని విస్తరించడం ద్వారా ఆర్థిక ఇబ్బందుల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వెసులుబాటు కల్పించవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ అభిప్రాయాలు వాస్తవానికి చాలా దూరంగా ఉన్నాయని, వీరి డిమాండ్ల మేరకు ఆదాయం పన్నును రద్దుచేసి దానికి బదులుగా వినిమయ

- మిగతా 2 లో

బడుగుల ఉద్యోగాలపై

మోడీ వేటు..!

- ఐదేళ్లుగా భర్తీకాని పోస్టుల రద్దు
- మంత్రిత్వశాఖలను నివేదికలు కోరిన సర్కారు
- సుమారు లక్ష ఖాళీలకు ఎసరు



విశాలాంధ్ర - న్యూఢిల్లీ : తాజాగా దళితులు, గిరిజనులు, బలహీనవర్గాల వెన్నును కేంద్రంలో మోడీ సర్కారు వెన్ను విరిచేసింది. రాజ్యాంగం కల్పించిన ఉద్యోగ, ఉపాధి హక్కును చిదిమేసింది. ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తానని హామీతో అధికారంలోకి వచ్చిన బీజేపీ... ఏకంగా లక్షకు పైగా బ్లాక్‌లాగ్ ఉద్యోగాలను రద్దు చేయబోతోంది. గత ఐదేళ్లుగా ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను రద్దు చేయాలని యోచిస్తోంది. ఇందుకు సంబంధించి ఒక సమగ్ర నివేదిక సమర్పించాలని అన్ని మంత్రిత్వ శాఖలను ఆదేశించింది. ఉద్యోగాల రద్దుపై అన్ని మంత్రిత్వ శాఖలను, విభాగాలను యాక్షన్ రిపోర్టును కోరినట్టు ఆర్థిక మంత్రిత్వశాఖ తెలిపింది. దీంతో కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ అన్ని శాఖల అదనపు కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు, పారామిలిటరీ దళాల చీఫ్, ఇతర సంబంధిత సంస్థల అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు హోం మంత్రిత్వశాఖ అధికారి ఒకరు తెలిపారు. ఐదేళ్లుగా భర్తీకాని ఉద్యోగాలపై త్వరలోనే సమగ్ర నివేదిక సమర్పించాల్సిందిగా గతంలోనే అన్నిమంత్రిత్వశాఖ ఆర్థిక సలహాదారులు , ఉమ్మడి కార్యదర్శులు (అడ్మినిస్ట్రేషన్) / విభాగాలను కోరినట్టు వెల్లడించింది. కొన్ని మంత్రిత్వ శాఖలు, డిపార్ట్‌మెంట్‌లు స్పందించినప్పటికీ, మరికొన్ని నివేదికలు సమగ్రంగా లేవని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆదేశాలు జారీ చేసింది. జనవరి 16, 2018 తేదీన సంబంధిత మెమోరాండం జారీ చేసినట్టు మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కాగా ప్రాథమిక అంచనా ప్రకారం, ఐదు లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలుగా అనేక వేల కేంద్ర ప్రభుత్వం పోస్టులు ఖాళీగా ఉన్నాయని కూడా హోంశాఖ అధికారి తెలిపారు. ఇప్పటి వరకూ ఓపెన్ కాంపిటీషన్ పోస్టులను భర్తీ చేస్తున్న ప్రభుత్వం గత దశాబ్దాలుగా బ్లాక్‌లాగ్ పోస్టులను నిర్లక్ష్యం చేసింది. మరీ ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ పోస్టులను భర్తీ చేయటం లేదు. 2008 నాటికే 75,522 బ్లాక్‌లాగ్ పోస్టులు భర్తీ కాలేదు. ఎస్సీ,

- మిగతా 2 లో



నవయుగకు

పోల 'వరం'

- ఎట్టకేలకు నిర్ణయించిన కేంద్రం
- ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీకి ఝలక్
- పాతధరలకే పూర్తిచేస్తామన్న నవయుగ

న్యూఢిల్లీ- విశాలాంధ్ర బ్యూరో ఆంధ్రప్రదేశ్ వరప్రదాయినిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టర్‌ను మార్చే విషయంలో దేశ రాజధాని ఢిల్లీలో కీలక నిర్ణయం జరిగింది. ఏపీ సీఎం చంద్రబాబు కోరినట్టుగానే కాంట్రాక్టర్‌ను కేంద్రం మార్చివేస్తూ నిర్ణయం తీసుకుంది. ఎప్పటి నుంచో కాంట్రాక్టర్‌ను మార్చాలని చంద్రబాబు కోరుతున్నా, అంచనాలు భారీగా మారిపోయే అవకాశం ఉన్నందున గతంలో ఈ ప్రతిపాదనను వెనక్కి తీసుకుంది. అయితే పాత ధరలకే పోలవరం ప్రాజెక్టు పనులు చేసేందుకు నవయుగ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ముందుకు రాగా తాజా ప్రతిపాదనలపై ఇప్పుడు కేంద్రం నిర్ణయం తీసుకుంది. పోలవరం స్పిల్ వే, స్పిల్ ఛానెల్ పనులను ట్రాన్స్‌ట్రాయ్ నుంచి నవయుగ కంపెనీకి అప్పగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇది ట్రాన్స్‌ట్రాయ్‌కి పెద్ద షాక్‌గా చెప్పవచ్చు. మంగళవారం న్యూఢిల్లీలోని కేంద్ర జవనరుల శాఖ కార్యాలయంలో కేంద్ర జలవనరుల మంత్రి నితిన్ గడ్కరీ నేతృత్వంలో పోలవరంపై కాంట్రాక్టర్లతో అత్యవసర సమావేశం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సుమారు రెండు గంటల పాటు సుదీర్ఘ సమావేశం జరిగింది. పోలవరం స్పిల్‌వే, స్పిల్ ఛానల్‌కు సంబంధించిన కాంట్రాక్టు పనులపై స్పష్టత వచ్చింది. పోలవరం ప్రాజెక్టు పనులను మరో వారం రోజుల్లో నవయుగ ప్రారంభించనున్నది. పోలవరం కాంట్రాక్టర్‌ను

- మిగతా 2 లో

సత్యాగ్రహం సక్సెస్



విజయవాడలో ఓబులేసును అరెస్టు చేస్తున్న పోలీసులు



గుంటూరులో మాట్లాడుతున్న చలసాని రామారావు



ఒంగోలులో రవీంద్రనాథ్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

- రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు, ధర్నాలు
- ప్రధాన నగరాలు, పట్టణాల్లో నేతల అరెస్ట్
- వేలాదిగా తరలివచ్చిన కార్మికులు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : కేంద్ర ప్రభుత్వ కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పది కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సత్యాగ్రహం విజయవంతమైంది. అసంఘటిత రంగంలోని కార్మికులకు కనీస వేతనం రూ. 18వేలు ఇవ్వాలని, సామాజిక భద్రతకై సమగ్ర చట్టం చేయాలని, పీఎఫ్‌తోపాటు ఈఎస్ఐ, పెన్షన్లను హక్కుగా కల్పించాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలలో పనిచేసేవారిని కార్మికులుగా గుర్తించాలనే డిమాండ్లతో ఏఐటీయూసీతోపాటు ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్, టీయూసీసీ, ఏసీసీటీయూ, ఐఎఫ్‌టీయూ, వైఎస్సార్‌టీయూ తదితర

- మిగతా 11 లో

ఉమ్మడి కాష్టం

- కొలిక్కిరాని ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్
- కోర్టుల చుట్టూ తిరుగుతున్న విద్యాశాఖ ఉన్నతాధికారులు
- 9న హైకోర్టుకు హాజరుకానున్న కార్యదర్శి, సంచాలకులు
- తెలుగురాష్ట్రాల్లోని 3 లక్షల మంది ఉపాధ్యాయుల సమస్య ఇది



విశాలాంధ్ర -ఏలూరు : ఉభయ తెలుగు రాష్ట్రాలలో మూడు లక్షల మంది ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్య ఇది... రెండు దశాబ్దాలుగా న్యాయపరమైన చిక్కులు దీనికి ముడిపడి పోయాయి... న్యాయపోరాటాల కారణంగా విద్యావ్యవస్థ యావత్ సరైన దిశానిర్దేశం లేక ఉక్కిరిబిక్కిరి అవుతోంది... ఎంతోమంది ఉపాధ్యాయులు సర్వీసు మొత్తం మీద ఒక్క ప్రమోషన్ కూడా పొందకుండానే రిటైర్ అయిపోతున్నారు... మరో పక్క సమస్య ఎప్పుడు కొలిక్కి వస్తుందో తెలియక విద్యాశాఖ ఉన్నతాధికారులు కోర్టుల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు...ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ, పంచాయితీరాజ్ ఉపాధ్యాయుల ఉమ్మడి సీనియారిటి జీఓలు 534, 505లను రద్దు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు అమలు జరపనందుకు వచ్చే నెల 9 న స్వయంగా హాజరు కావాలని హైకోర్టు నుంచి పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి,

- మిగతా 11 లో

కొలిక్కిరాని కంప్యూటర్ల వివాదం

3లో

రేపటి నుంచి మద్యం సరఫరా బంద్?

వ్యాపారుల్లో టెన్షన్

ఇదీ లోకం!



ఇంకెంతకాలం ?

- ప్రభుత్వం పరువు తీస్తున్నారు
- మార్చి నాటికి రాకపోకలు పునరుద్ధరించకపోతే కఠిన చర్యలు
- దుర్గగుడి ఫ్లైఓవర్‌పై సీఎం సీరియస్
- బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్ .. నిడమానూరు వరకు పొడిగింపు
- నెల్లూరు-తడ ఆరు వరుసలుగా విస్తరణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : నిర్మాణ సంస్థ చేతకానితనం, అసమర్థత వల్ల దుర్గగుడి ఫ్లైఓవర్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యంతో రాష్ట్ర ప్రభుత్వం పరువు పోతోందని సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం రాత్రి సచివాలయంలో జరిగిన రహదారుల సమీక్షా సమావేశంలో ప్రస్తుతం

- మిగతా 2 లో

కబ్జాపై విద్యార్థి గర్జన



ధర్నా చేస్తున్న దోనేపూడి, విద్యార్థులు

విశాలాంధ్ర ప్రతినిధి-విజయవాడ : తమ కాలేజీ స్థలాన్ని రక్షించుకునేందుకు విజయవాడ మాచవరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల పూర్వ, ప్రస్తుత విద్యార్థులు నడుంబిగించారు. రూ.300 కోట్ల విలువైన 6.67 ఎకరాల భూమిని రక్షించుకునేందుకు ఆందోళనబాట పట్టారు. దాతల ఆశయ సాధన కోసం, విద్యాబుద్ధులు నేర్పిన సరస్వతీ నిలయాన్ని పదికాలాలపాటు కాపాడుకునేందుకు పార్టీలకు అతీతంగా పూర్వవిద్యార్థులు కలిసి వచ్చారు. ప్రస్తుత విద్యార్థులతో కలిసి మాచవరంలోని కళాశాల ఆవరణ నుంచి మంగళవారం ఉదయం భారీ ర్యాలీగా ఆక్రమణకు గురైన స్థలం వద్దకు చేరుకున్నారు. తమ కాలేజీ స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మించిన ఇళ్ల ఎదుట ధర్నా నిర్వహించారు. కొత్తగా నిర్మిస్తున్న ఇంటి గోడలను జేసీబీతో కూల్చి వేశారు. ఖాళీ ప్రదేశంలో ఉన్న చెట్లను తొలగించారు. ఆ స్థలం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలకు చెందినదని, ఎవరైనా ఆక్రమించుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కబ్జాకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని, ఖాళీ స్థలాన్ని మైదానంగా అభివృద్ధి చేయాలని విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ

- విజయవాడ ఎస్ఆర్ఆర్ కాలేజీ స్థలం ఆక్రమణ
- రక్షించుకునేందుకు కదిలొచ్చిన పూర్వ, ప్రస్తుత విద్యార్థులు
- భారీ ర్యాలీ... అక్రమ నిర్మాణాల వద్ద ధర్నా
- ఆక్రమిత స్థలంలో నిర్మించిన గోడల కూల్చివేత
- అండగా నిలిచిన అఖిలపక్ష నేతలు

ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఇదీ స్థల వివాదం...

విజయవాడలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం శ్రీరాజా రంగయ్య అప్పరావు, చుండూరు వెంకటరెడ్డి స్థలాన్ని దానం ఇచ్చారు. వారి దాతృత్వానికి గుర్తుగా ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలగా పేరు పెట్టారు. ప్రస్తుతం నగరంలో ఉన్న ఏకైక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇదే. దాతలు ఇచ్చిన

- మిగతా 2 లో

రూ.25 కోట్లకు

అమ్మేశారు

- బొండా ఉమా భూ వివాదం కొత్త మలుపు
- హైదరాబాద్ వ్యక్తితో అగ్రిమెంట్
- బయటకు పొక్కకుండా జాగ్రత్తలు
- వాసన పట్టిన పోలీసు, నిఘా విభాగాలు
- కూపీ లాగేందుకు రంగంలోని అధికారులు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రంలో సంచలనం సృష్టించిన భూ వివాదం కొత్త మలుపు తిరుగుతోంది. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, అతని అనుచరులు దొంగ పత్రాలు సృష్టించి కొనుగోలు చేసినట్లుగా చూపిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుడు కేసిరెడ్డి సూర్యనారాయణ కుటుంబానికి చెందిన 5.57 ఎకరాల భూమిని అమ్మేసినట్లు విశ్వసీయంగా తెలిసింది. హైదరబాద్‌కు చెందిన ఒక వ్యక్తికి రూ.25 కోట్లకు వివాదస్పద భూమిని విక్రయించినట్లు తెలిసింది. అయితే విక్రయ వ్యవహారం గుట్టుగా ఉంచారని సమాచారం. ఈ విషయం బయటకు పొక్కకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోటంతో వ్యవహారానికి సంబంధించిన

- మిగతా 2 లో



ఐర్లాండులో అబార్షన్‌పై రిఫరెండం

డబ్లిన్ : అబార్షన్‌ను అనుమతించాలా లేదా అన్న అంశంపై ఐర్లాండులో ఈ ఏడాది మేనెల చివరిలో రిఫరెండం జరపాలని ప్రభుత్వం లాంఛనప్రాయంగా అంగీకరించింది. గత 35 సంవత్సరాలుగా అబార్షన్‌పైన దేశంలో నిషేధం ఉంది. అయితే ఈ నిషేధాన్ని ఎత్తివేసి అబార్షన్‌కు అనుమతించాలన్న డిమాండ్ ఇటీవలకాలంలో పెరిగింది. అబార్షన్‌కు రోమన్ క్యాథలిక్ మితవాద శక్తులు వ్యతిరేకిస్తున్నాయి. ప్రధానమంత్రి లియోవరడ్గర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గర్భం దాల్చిన తరువాత 12వ వారంవరకు అబార్షన్‌ను అనుమతించేందుకు ఆరోగ్య మంత్రిత్వశాఖ చట్టాన్ని రూపొందిస్తున్నదని చెప్పారు. లైంగికదాడి మూలంగా గర్భం దాల్చినప్పుడు కూడా ఈ చట్టం వర్తింపచేసేందుకు అవకాశాన్ని పరిశీలిస్తున్నారు.ఆరోగ్యశాఖ సిఫారసులను పార్లమెంటులో అఖిలపక్ష కమిటీకి గత నెలలో సమర్పించినట్టుగా చెప్పారు. ఇంతవరకు అమలుజరుగుతున్న నిషేధాన్ని తొలగించేందుకు అందరూ అంగీకరిస్తే పార్లమెంటుకు బిల్లును ప్రతిపాదిస్తామని అన్నారు. దేశంలో 2వేలమందికి పైగా మహిళలు, యువతులు సరైన వైద్య పరిశీలన లేకుండా అబార్షన్ మాత్రలను వినియోగిస్తున్నారని, అందువల్ల ఆరోగ్యపరమైన విషాదాలు తప్పడంలేదని ప్రధాని అన్నారు. అటార్నీ జనరల్ అభిప్రాయాన్ని కూడా తీసుకున్న తరువాత రాజ్యాంగంలోని ఆర్టికల్ 40.3.3ను రద్దు చేయాలని మంత్రివర్గం సిఫారసు చేసినట్టు చెప్పారు. ఇందుకోసం రిఫరెండం జరపాలని మంత్రివర్గం ఏకగ్రీవంగా అంగీకరించిందని ఆయన చెప్పారు.

విశాలాంధ్ర ప్రపంచం

రొమేనియాలో వామపక్ష ప్రభుత్వం ప్రమాణం

బుఖారెస్ట్ : రొమేనియాలో ప్రధానమంత్రి వియోరికా దాన్సిలా నాయకత్వంలోని మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేసింది. అధ్యక్షుడు క్లౌస్‌ఐఒహన్నిస్ మంత్రివర్గంలో ప్రమాణస్వీకారం చేయించారు. దాన్సిలా మంత్రివర్గం గత 13 నెలలకాలంలో ఏర్పడిన మూడవది. సోషల్ డెమొక్రటిక్ పార్టీకి చెందిన దాన్సిలా ప్రభుత్వానికి ముందు రెండు ప్రభుత్వాలు పనిచేశాయి. పార్లమెంటులో దాన్సిలాకు అనుకూలంగా మెజారిటీ సభ్యులు ఓటు చేశారు. 282 మంది అనుకూలంగా, 136మంది వ్యతిరేకంగా ఓటు చేయగా ఒకరు హాజరుకాలేదు. ప్రభుత్వ ఏర్పాటుకు 233 ఓట్లు వస్తే సరిపోతుంది. అంతకుమించి అదనంగానే దాన్సిలాకు ఓటు చేశారు. అధ్యక్షుడు ఐఒ హన్నిస్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యాఖ్యానించడంలేదు. అత్యధిక



సభ్యులు ఎన్నుకున్న ఈ ప్రభుత్వం ఎక్కువకాలం మనగలదన్న ఆశాభావాన్ని అధ్యక్షుడు వ్యక్తం చేశాడు. గత ప్రభుత్వాలలో సామాజిక వాతావరణం దిగజారిపోయిందని, ఇది ఎంతమాత్రం సమాజ అభివృద్ధికి ప్రయోజనం కలిగించదని ఆయన అన్నారు. ప్రమాణ స్వీకారానికి ముందు ప్రధానమంత్రి దాన్సిలా మాట్లాడుతూ తాను అన్ని రాజకీయ పార్టీలతోను, అధ్యక్షుడుతోను అరమరికలు లేకుండా సంప్రదింపులు జరుపుతానని అన్నారు. జాతీయ ప్రయోజనాల విషయంలో ఏకాభిప్రాయానికి రావడం కోసం ఈ చర్చలు ఉంటాయని ఆమె చెప్పారు. 2020 నాటికి యూరోపియన్ యూనియన్‌లో రొమేనియా బలమైన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా రూపొందించాలన్నదే తన లక్ష్యమని అన్నారు. తమమీద విశ్వాసంవుంచి పాలనను అప్పగించినందుకు మంత్రులందరితోను మంచి సహకారాన్ని తీసుకునేందుకు కృషి చేస్తానని దాన్సిలా చెప్పారు. దాన్సిలా మంత్రివర్గంలో 27 మంది సభ్యులున్నారు. వీరిలో నలుగురు ఉప ప్రధానమంత్రులు. 25 మంది మంత్రులు.

సూడాన్ ప్రజలకు కమ్యూనిస్టుల సంఘీభావం



ఖర్టూం : సూడాన్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ ఆందోళనకు పూనుకున్న ప్రజలను వేధించడంపై అనేక కమ్యూనిస్టు వర్కర్స్ పార్టీలు ఒక సంయుక్త ప్రకటనలో తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశాయి. నిరసన ప్రదర్శనలలో పాల్గొన్న కమ్యూనిస్టు పార్టీ నేతలు, ఇతర ప్రతిపక్ష రాజకీయ నాయకులను జైళ్లలో ఉంచారు. వారిని తక్షణం విడుదల చేయవలసిందిగా కమ్యూనిస్టు పార్టీల ప్రకటన డిమాండ్ చేసింది. సూడాన్ కమ్యూనిస్టు పార్టీ రాజకీయ కార్యదర్శి మొహమ్మద్ ముక్తార్ అల్‌ఖటియబ్, పలువురు సెంట్రల్ కమిటీ సభ్యులను సూడాన్ ప్రభుత్వం అరెస్టుచేసి జైలులో ఉంచింది. దేశ రాజధాని ఖర్టూంలో ఈనెల 16వ తేదీన భారీ ప్రదర్శన నిర్వహించినందుకుగాను అరెస్టు చేశారు. ఆహార వస్తువుల ధరలను పెంచడంపై వ్యతిరేకిస్తూ ప్రదర్శన జరిపారు. జైలులో వున్న వారి ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయని తక్షణం వారిని విడుదల చేయాలని ఆ ప్రకటన డిమాండ్ చేసింది. శాంతియుత ప్రదర్శనలను నిరోధిస్తూ ప్రభుత్వం తన నిరంకుశ పాలనను నిరూపించుకుంటున్నదని ప్రకటన విమర్శించింది. శాంతియుత ప్రదర్శనలు జరపడం భావప్రకటనా స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులయినప్పటికీ వాటిని ప్రభుత్వం కాలరాస్తున్నదని ఆ ప్రకటన పేర్కొంది.

గాజాలో ఐరాస ఉద్యోగుల నిరసన



రమల్లా : పాలస్తీనా ప్రజలకు అందించే సహాయంలో కోత విధిస్తూ అమెరికా తీసుకున్న నిర్ణయంపై గాజాస్ట్రిప్‌లో ఉన్న ఐక్యరాజ్యసమితి కార్యాలయాల సిబ్బంది ఒక రోజు సమ్మె చేశారు. ఫలితంగా ఆరోగ్యకేంద్రాలు, పాఠశాలలు, ఆహార పదార్థాల పంపిణీ కేంద్రాలు మూతపడ్డాయి. అమెరికా తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవలసిందిగా వత్తిడి చేసేందుకే తాము ఒకరోజు సమ్మెను నిర్వహించామని ఐరాస ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి యూసఫ్ హమ్దునా తెలిపారు. తమ ఆందోళనలో ఇది మొదటి భాగమేనని ఆయన చెప్పారు. గాజాస్ట్రిప్‌లో నివసిస్తున్న 20 లక్షలమంది ప్రజలలో సగానికిపైగా అమెరికా తదితర దేశాలు అందిస్తున్న ఆర్థిక సహాయంపై ఆధారపడి ఉన్నారు. అయినప్పటికీ ఈ ప్రాంతంలో నిరుద్యోగం 46 శాతం ఉంది. పాలస్తీనా ప్రాంతాలు, జోర్డాన్, లెబనాన్, సిరియా ప్రాంతాలలో పాలస్తీనా శరణార్థుల శిబిరాలలో దాదాపు 60 లక్షలమంది ఉన్నారని వారికి అందించే సహాయంలో కోత విధిస్తే తీవ్రమైన ఆహారకొరత ఎదురౌతుందని పేర్కొన్నారు.

ఈజిప్టు అధ్యక్ష పదవికి మళ్లీ శిశి పోటీ

కైరో : ఈజిప్టు అధ్యక్ష పదవికి ప్రస్తుత అధ్యక్షుడు అబ్దల్-పతాహ్‌అల్-శిశి మళ్లీ పోటీ చేయనున్నారు. ఆయనపైన మౌసాఉస్మాన్‌మౌసా ప్రత్యర్థిగా పోటీచేసేందుకు అవసరమైన పత్రాలను ఎన్నికల కమిషన్‌కి సమర్పించారు. ఈ ఏడాది మార్చి 26,28 తేదీల మధ్య అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతాయి. శిశికి వ్యతిరేకంగా పోటీకి ముందుకు వచ్చిన అనేకమంది అరెస్టయ్యారు. దీంతో కొందరు పోటీనుంచి తప్పుకున్నారు. అంతిమంగా దేశంలో చాలాకాలంగా పనిచేస్తున్న రాజకీయ పార్టీ ఒఘద్‌నేత మౌసాను అభ్యర్థిగా నిర్ణయించారు. రెండు రోజులపాటు చర్చలు జరిగిన తరువాత ఆయన పేరును ఖరారు చేశారు. మౌసా తరుపున ఆయన సహాయకులు వెళ్లి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. శిశి రెండవసారి కూడా గెలిచే అవకాశాలే ఉన్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. అధ్యక్ష పదవీకాలం నాలుగేళ్లుంటుంది. మాజీ ప్రధానమంత్రితో పాటు పలువురు శిశిపై పోటీ చేసేందుకు ముందుకు వచ్చినప్పటికీ ఆ తర్వాత విరమించుకున్నారు. దేశంలో పొదుపు చర్యలను పాటిస్తున్న శిశికి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఆయన అనుసరించే ఆర్థిక సంస్కరణలపైన కూడా వ్యతిరేకత వస్తున్నది. 2013లో ఆయన అధ్యక్ష పదవికి ఎన్నికయ్యారు. దేశంలో ప్రత్యర్థి మోర్సీ అనుకూలురైన వేలాదిమందిని జైళ్లలో పెట్టడం ద్వారా విచ్ఛిన్నకరమైన అధ్యక్షుడుగా పేరుపొందారు. తనకు వ్యతిరేకత వ్యక్తం చేసే అన్నిపక్షాలపైన ఆయన తీవ్రమైన దాడులను చేయించడం మూలంగా మీడియా అలాగే మానవ హక్కుల గ్రూపులు కూడా ధైర్యంగా ఎదిరించి పోరాటం చేసే పరిస్థితి కనిపించలేదు. విమర్శలను ఆయన తట్టుకునే పరిస్థితిలో లేదు. అందువల్లనే అనేక డజన్ల ఆన్‌లైన్ వార్తాసైట్లు నిలిచిపోయాయి. 2012లో అధ్యక్ష పదవికి పోటీచేసిన సమీఅన్నంను అరెస్టు చేయించారు. ఎన్నికల్లో పాల్గొనవద్దని ప్రజలకు పిలుపునిచ్చినందుకు అన్నంను అరెస్టుచేసి జైలులో ఉంచారు.

వాణిజ్య యుద్ధానికి ఈయూ రెడీ

ట్రంప్ బెదిరింపులపై సవాలు

బ్రసెల్స్ : తమ యూనియన్‌లోని 28 దేశాలకు వ్యతిరేకంగా అవాంఛనీయమైన వాణిజ్య చర్యలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేపట్టినట్లయితే వాటిని వేగంగా తగినవిధంగా తిప్పికొట్టేందుకు తాము రెడీగా ఉన్నామని యూరో పియన్ యూనియన్ హెచ్చరించింది. ఈయూ అనుసరిస్తున్న వాణిజ్యవిధానాన్ని ట్రంప్ తీవ్రంగా విమర్శించిన 24 గంటల్లోనే తీవ్రమైన ప్రతిస్పందన వచ్చింది. తమ సమాధానం అత్యంత భారీగా ఉంటుందని ఈయూ తెలిపింది. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా పాలనాకాలంలో తమ రెండు బ్లాకుల మధ్య అనేక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలకోసం కృషి చేశామని ఫలితంగా ఏడాదికి వంద బిలియన్ డాలర్లకుపైగా లాభాలు పొందుతున్నామని ఈయూ పేర్కొంది. 2016 నవంబర్‌లో ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత ఆయన స్వీయరక్షణ వాదాన్ని ప్రతిపాదించడం ద్వారా రెండు గ్రూపుల మధ్య సంబంధాలపై నీళ్లు చల్లారు. అమెరికా అభ్యర్థులకే ఉద్యోగాలిస్తామని బహుళ వాణిజ్య ఒప్పందాలకు తాము వ్యతిరేకమని ట్రంప్ మాట్లాడారు. అయితే ట్రంప్ విధానాలను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ఈయూ పేర్కొంది. బ్రిటన్ టెలివిజన్‌కిచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ తమ దేశంపట్ల ఈయూ చాలా అన్యాయంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. సౌర విద్యుత్తుతో పనిచేసే పరికరాల ప్రత్యేకించి వాషింగ్‌మిషన్లపై సుంకాలను పెంచుతూ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంపై చైనా, దక్షిణకొరియా ఆగ్రహం ప్రకటించాయి. తమ ఎగుమతులపైన అమెరికా ఆంక్షలను విధించినట్లయితే తక్షణం తగిన సమాధానం చెప్పేందుకు తాము సిద్ధంగావున్నామని ఈయూ ప్రధాన ప్రతినిధి మార్గరిట్స్ సిచినాస్ అన్నారు.



బ్రిటన్ కమ్యూనిస్టు నేత సాదిక్ మృతి



లండన్ : బ్రిటన్‌లో ఇండియన్ వర్కర్స్ అసోసియేషన్ నేత, కమ్యూనిస్టు పార్టీ నాయకుడు అవతార్‌సింగ్ సాదిక్ మృతిచెందారు. సాదిక్ మృతి ఇక్కడ భారతీయ సంతతికి చెందిన పౌరులకు తీవ్రనష్టాన్ని, ఆవేదనను కలిగించిందని పలువురు అన్నారు. వర్కర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడుగా ఆయన పనిచేశారు. స్నేహితులు అనేకమంది కమ్యూనిస్టు కార్యకర్తలు ఆయనకు అంతిమ వీడ్కోలు పలికి నివాళి అర్పించారు. కమ్యూనిస్టు పార్టీల అంతర్జాతీయ సదస్సులలో సాదిక్ నృత్యకళాకారులతో వివిధరకాల కార్యక్రమాలను నిర్వహించేవారు. వర్కర్స్ అసోసియేషన్ ప్రస్తుత అధ్యక్షుడు హర్సేవ్‌బెయిన్స్ మాట్లాడుతూ ఆయన లేనిలోటు పార్టీకి, తమ కుటుంబానికి తీరనిదని అన్నారు. ఆయన నిజమైన కామ్రేడ్‌గా జీవించారని ఆయనకు రెడ్‌సెల్యూట్ సమర్పిస్తున్నామని అన్నారు.

మోడీ వేటు..!

(మొదటిపేజీ తరువాయి)

ఎస్టీల్లో అర్హులు లేరని, ఉన్నా నైపుణ్యం లేదని, ఇంగ్లీష్ రాదంటూ ఆయా పోస్టులను భర్తీ చేయలేదు. 2012 నాటికి కనీసం 74 శాతం ఉద్యోగాలను భర్తీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ఎలాంటి అతిగతీ లేదు. దాదాను 64 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్టు సమాచారం. దీనికి తోడు పదోన్నతులతో భర్తీ చేయాల్సిన పోస్టులను ఓపెన్ కాంపిటేషన్‌కు బదిలీ చేశారు. ఈ స్థితిలో ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో ఉన్నత చదువులు చదివినా...ఉద్యోగాలు లేక నిరుద్యోగులు అల్లాడిపోతున్నారు. ఇక ఓబీసీలకూ అన్యాయం జరుగుతోంది. వీరికి 27 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి. కానీ బీసీల కోటాను భర్తీ చేయటం లేదు. ఇటీవల ప్రభుత్వానికి అందిన నివేదిక ప్రకారం, 11,797 పోస్టులు భర్తీ కాలేదు. హోం మంత్రిత్వశాఖలో 3,393 పోస్టులు, రెవెన్యూశాఖలో 2,988 పోస్టులు, ఆర్థికశాఖలో 1,425 పోస్టులు, రక్షణశాఖలో 1,268 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తాజా నిర్ణయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీలే తీవ్రంగా నష్టపోతారు. లెక్కతేలని బ్లాక్‌లాగ్ పోస్టులు కనీసం లక్షపైనే ఉంటాయని అంచనా. ఈ స్థితిలో... రాజ్యాంగం కల్పించిన హక్కును ఎస్సీ, ఎస్టీ, బీసీలు కాపాడుకోవాల్సిన తరుణం ఆసన్నమైందంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు.

కబ్జాపై విద్యార్థి గర్జన

(మొదటిపేజీ తరువాయి)

స్థలంలో కొంత భాగం మాచవరంలో ఉండగా అక్కడ కాలేజీ నిర్మించారు. కాలేజీ వెనుక రైవస్ కాలువకు అవతలివైపున గులాబీతోట ప్రాంతంలో మరో 6.67 ఎకరాలు ఉన్నాయి. ఈ స్థలాన్ని 1954లో పెదర్ల నరసింహారావు అనే వ్యక్తి కౌలుకు తీసుకున్నారు. కొంతకాలం కౌలు సొమ్ము చెల్లించిన నరసింహారావు ఆ తర్వాత ఈ భూమి తనదేనని ప్రకటించుకున్నాడు. ఈ మేరకు కొన్ని ధ్రువీకరణ పత్రాలు సృష్టించారని కాలేజీ నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో కాలేజీ నిర్వాహకులు హైకోర్టును ఆశ్రయించారు. ఇరువర్గాలు కోర్టులో తమ వాదనలు వినిపించాయి. ఈ భూమి వ్యవహారాన్ని ల్యాండ్ సెటిల్‌మెంట్ అథారిటీ వద్ద సెటిల్ చేసుకోవాలని కొన్నేళ్ల కిందట హైకోర్టు ఆదేశించింది. అయితే, ల్యాండ్ సెటిల్‌మెంట్ అథారిటీ ఈ భూమి వ్యవహారంలో జోక్యం చేసుకోకుండా పెదర్ల నరసింహారావు కుమారుడు శివరాంప్రసాద్ కోర్టు నుంచి స్టే ఉత్తర్వులు తెచ్చుకున్నాడు. అప్పటి నుంచి మళ్లీ వివాదం మొదటికి వచ్చింది. ఈ క్రమంలో ఆక్రమిత స్థలంలో రోడ్లు వేసి మూడు ఇళ్లు నిర్మించారు. ప్రస్తుతం మరో రెండు ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. ఈ స్థలం తమ కళాశాలకు చెందినదని, నిర్మాణాలు చేపట్టవద్దని కాలేజీ ప్రిన్సిపాల్ వారిని కోరినా పట్టించుకోలేదు. తప్పుడు ధ్రువీకరణపత్రాలు చూపించి ఆ భూమి తమ దేనని చెబుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంక్రాంతి సెలవుల సమయంలో వివాదంలో ఉన్న స్థలంలో ఇంటి నిర్మాణం ప్రారంభించారు. వెంటనే ఆ పనులు నిలిపివేయాలని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. అయినా ఇంటి నిర్మాణం కొనసాగుతుండటంతో పూర్వవిద్యార్థులు రంగంలోకి దిగారు. తమ కళాశాల స్థలాన్ని రక్షించుకునేందుకు కోర్ కమిటీగా ఏర్పడి ప్రస్తుత విద్యార్థులతో కలిసి మంగళవారం ఆందోళన చేశారు. భవిష్యత్‌లో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేసి కాలేజీ స్థలాన్ని పరిరక్షించుకుంటామని ప్రకటించారు.

చట్టపరమైన చర్యలు తీసుకోవాలి : దోనేపూడి

ఈ సందర్భంగా ఎస్ఆర్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థి, కాలేజీ కోర్ కమిటీ సభ్యుడు, సీపీఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ మీడియాతో మాట్లాడుతూ ఎందరో మహానుభావులను, మేధావులను అందించిన కళాశాల వెనుక భాగంలో ఉన్న స్థలంపై కన్నేసిన కొందరు రాజకీయ ముసుగులో అధికారాన్ని అడ్డంపెట్టుకుని రెండు ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారని చెప్పారు.

కబ్జా చేసిన స్థలంలో మూడు ఇళ్లు కూడా నిర్మించారని తెలిపారు. వివాదాస్పద స్థలంలో ఇళ్ల నిర్మాణాలకు నగరపాలక సంస్థ అధికారులు ఎలా అనుమతులు మంజూరు చేశారని ఆయన ప్రశ్నించారు. కళాశాల పరిరక్షణకు పూర్వ విద్యార్థులందరం రాజకీయాలకతీతంగా ఉమ్మడిగా పోరాటం చేయడం ద్వారా కబ్జాకు గురైన స్థలాన్ని కళాశాలలో విలీనం చేస్తామని స్పష్టంచేశారు. కళాశాల పవిత్రతను మంటకలుపుతూ యథేచ్ఛగా కబ్జాకు పాల్పడిన వారితోపాటు వారి వెనుక ఉన్న అదృశ్య శక్తులను బయటపెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర ఇన్‌చార్జి దోనేపూడి కాశీనాథ్, టీడీపీ నాయకులు గన్నే నారాయణప్రసాద్(అన్న), కాట్రగడ్డ బాబు, చెరుకూరి కృష్ణకుమార్, ఇస్కఫ్ నాయకుడు మహబూబ్ ఆజం, లంక జానయ్య, రాచాకుల శ్రీనివాస్, ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ మొయినుద్దీన్, బొక్కా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు చేటు

(మొదటిపేజీ తరువాయి)

పన్నును ప్రవేశపెడితే దేశంలోని సంపన్నులకే ఎక్కువ లబ్ధి చేకూరుతుందని, అటు ప్రభుత్వంతో పాటు ఇటు పేదలు, సామన్య మధ్య తరగతి ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లడం ఖాయమని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ ప్రొఫెసర్లు అంటున్నారు. ఆదాయం పన్ను (ఐటీ)లా కాకుండా వినిమయ పన్ను (సీటీ) తిరోగమన ప్రభావాన్ని చూపుతుంది. వస్తు, సేవల కొనుగోలు కోసం ప్రజలు చేసే వాస్తవ ఖర్చుపై విధించే పన్నునే వినిమయ పన్ను అంటారు. వస్తు, సేవల కోసం సాధారణంగా పేదలు, మధ్య తరగతి ప్రజలు తమ ఆదాయాన్నంతా ఖర్చు చేస్తారు. కనుక వినిమయ పన్నును ప్రవేశపెట్టడం జరిగితే వీరి ఆదాయమంతటిపై పన్ను పడుతుంది. ఆదాయంలో సింహ భాగాన్ని దాచుకునే ధనికులపై మాత్రం వినిమయ పన్ను ప్రభావం చాలా తక్కువగా ఉంటుంది. 40 శాతం ఫ్లాట్ వినిమయ పన్ను భారం.. పూర్తి ఆదాయాన్ని ఖర్చుచేసే పేదవాడి మొత్తం ఆదాయంలో 40 శాతంతో సమానం. అయితే మొత్తం ఆదాయంలో మూడింట ఒక వంతు కూడా ఖర్చు చేయని ధనికుడి ఆదాయంలో ఇది కేవలం 13 శాతం మాత్రమే. కనుక వినిమయ పన్నుతో పోలిస్తే ధనికుడు తన ఆదాయంలో ఎక్కువ మొత్తాన్ని పన్నుగా చెల్లించే మంచి ఆదాయం పన్ను చట్టమే ప్రగతిశీలకమైనది. అంతేకాకుండా వినిమయ పన్ను అనేక ప్రతికూల ప్రభావాలను చూపుతుంది. దేశంలో ప్రస్తుతం ఆదాయం పన్ను వసూళ్ల ద్వారా ప్రభుత్వానికి రూ.4.5 లక్షల కోట్లకు పైగా రాబడి వస్తున్నది. ఈ ఆదాయాన్ని ఇలాగే నిలబెట్టుకోవాలన్నా లేక మరింత పెంచుకోవాలన్నా వినిమయ పన్నును మరింత పెంచాల్సి ఉంటుంది. వస్తు, సేవల పన్ను రేట్లను మరింత పెంచకపోతే ప్రభుత్వానికి ఇది సాధ్యం కాదు. ఒకవేళ అలా చేస్తే.. మార్కెట్లో వస్తు, సేవలకు డిమాండ్ పడిపోయి పన్ను ఆదాయం గణనీయంగా తగ్గుతుంది. లేకపోతే వస్తు, సేవల కోసం ఆదాయంలో ఎక్కువ మొత్తాన్ని ఖర్చుచేసే సామాన్య మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలపై విపరీతమైన భారం పడుతుంది. దేశ ఆదాయంలో సగానికిపైగా మొత్తం సంపన్నులైన 10 శాతం మంది భారతీయులు చెల్లించే పన్నుల ద్వారానే వస్తున్నట్లు వివిధ సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. కనుక వినిమయ పన్నును ప్రవేశపెట్టడం ద్వారా సంపన్నులకు మరింత పొదుపు చేసుకునే అవకాశాన్ని కల్పించడమంటే వారి ఆదాయంలో అత్యధిక మొత్తానికి పన్ను విధించకుండా దేశ ఆదాయాన్ని భారీగా తగ్గించుకోవడమే అవుతుంది. దీనికి భిన్నంగా ప్రస్తుతం ఆదాయం పన్ను రూపేణా సంపన్నుల ఆదాయంలో చాలా మొత్తానికి ప్రభుత్వం పన్ను విధిస్తున్న సంగతి తెలిసిందే. కనుక ఒకే కలం పోటుతో ఆదాయం పన్నును పూర్తిగా రద్దుచేస్తే దేశంలో ఇప్పటికే ఆందోళనకరంగా ఉన్న ఆర్థిక అసమానతలు మరింత తారాస్థాయికి చేరడం ఖాయమని రామ్ సింగ్ హెచ్చరిస్తున్నారు.

అమ్మేశారు

(మొదటిపేజీ తరువాయి)

పూర్తి వివరాలు తెలియలేదు. ఇప్పటికే దొంగ పత్రాలు సృష్టించి దొంగ రిజిస్ట్రేషన్ చేయటం వల్ల మరోసారి రిజిస్ట్రేషన్ చేస్తే వ్యవహారం బయటపడుతుందనే ఉద్దేశంతో రిజిస్ట్రేషన్ చేయలేదు. అయితే ఈ వ్యవహారాన్ని వాసన పట్టిన పోలీసు, నిఘా విభాగం అధికారులు రంగంలోకి దిగారు. వివాదస్పద భూ విక్రయానికి సంబంధించి లోపాయికారిగా ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. విజయవాడ మొగల్‌రాజపురానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు కేసిరెడ్డి సూర్యనారాయణ వారసుడు కేసిరెడ్డి సురేష్‌బాబు ఆధీనంలో అజిత్‌సింగ్‌నగర్‌లో 5.57 ఎకరాల (ఆర్ఎస్ నంబర్ 6/1లో 1.50 ఎకరాలు, ఆర్ఎస్ నంబర్ 7/2లో ఒక ఎకరం, ఆర్ఎస్ నంబర్ 32/1లో 1.50 ఎకరాలు, ఆర్ఎస్ నంబర్ 40లో 1.57 ఎకరాలు) భూమి ఉంది. తాజాగా ఆ భూమిని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, కార్పొరేటర్ గండూరి మహేష్, ఎమ్మెల్యే భార్య సుజాత నిర్వహిస్తున్న కంపెనీకి ఎండీగా ఉన్న మాగంటి బాబు తదితరులు డెవలప్‌మెంట్ కోసం కొనుగోలు చేసినట్లు దొంగ పత్రాలు సృష్టించటం, ఆ భూమి తమదని అడిగినందుకు స్వాతంత్ర్య సమరయోధుని వారసులను బెదిరించిన వ్యవహారం రాజకీయంగా పెద్ద చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే, అతని అనుచరులు నకిలీ పత్రాలు సృష్టించి భూమిని కబ్జా చేశారని సీఐడీ స్పష్టం చేసేసింది. దీంతో సీఎం చంద్రబాబు బొండా ఉమా భూ వివాదంపై సీరియసయ్యారు. అంతేగాకుండా సమగ్ర విచారణకు కూడా ఆదేశించారు. ఈ నేపథ్యంలో రంగంలోని దిగిన పోలీసు, నిఘా వర్గాలకు కొత్త విషయాలు తెలయటం విశేషం. అబ్దుల్ మస్తాన్, రామిరెడ్డి వెంకటేశ్వరరావు నుంచి కొనుగోలు చేసినట్లు చెబుతున్న భూమిని డెవలప్‌మెంట్ పేరుతో అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. బాధితుడు సురేష్‌బాబు సీఐడీకి ఫిర్యాదు చేయటం, యజమానులుగా చెబుతున్న వారిలో ఒకరైన వెంకటేశ్వరరావు అప్రూవర్‌గా మారటంతో ఎమ్మెల్యే బొండా ఉమా ప్లేట్ ఫిరాయించారు. డెవలప్‌మెంట్ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు ప్రకటించారు. అయితే వాస్తవానికి అంతకంటే ముందే హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యక్తికి 5.57 ఎకరాల భూమిని రూ.25 కోట్లకే బొండా ఉమా అండ్ కో విక్రయించేసినట్లు పోలీసు అధికారులకు సమాచారం అందింది. సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు వివాదస్పద భూమికి సంబంధించిన అన్ని వివరాలను రాబట్టే ప్రయత్నంలో ఉన్నారు. ఉమా బ్యాచ్ నుంచి భూమిని కొనుగోలు చేసింది ఎవరు, రిజిస్ట్రేషన్ జరిగిందా, లేక ఒప్పందం కుదుర్చుకున్నారా అనే కోణంలో లోతుగా విచారణ చేస్తున్నారు. అయితే అధికారులు ఈ విషయాన్ని ధృవీకరించటంలేదు.

రిజిస్ట్రేషన్ ఎలా చేశారో...

రెవెన్యూ రికార్డుల ప్రకారం వివాదస్పద భూమి స్వాతంత్ర్య సమరయోధుడు కేసిరెడ్డి సూర్యనారాయణ పేరుతోనే ఉంది. కాని దొంగ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ ఎలా చేశారనే కోణంలో సీఐడీ, పోలీసులు విచారణ చేస్తున్నారు. మీ ఇంటికి మీ భూమి రికార్డులలో 1-బీలో 238 ఖాతాలోని 4.59 ఎకరాలను స్వాతంత్ర్య సమరయోధుని వారసులే విక్రయించుకున్నారు. కాగా మిగిలిన భూమిలో 2.50 ఎకరాలు సూర్యనారాయణ పేరుతో ఉండగా, మిగిలన భూమి అబ్దుల్ మస్తాన్ పేరుతో ఉన్నట్లు కనిపిస్తోంది. అంటే ఈ మొత్తం వ్యవహారంలో ఎమ్మెల్యే బొండా ఉమాతోపాటు కార్పొరేటర్ మహేష్, ఎమ్మెల్యే భార్య సుజాత నిర్వహిస్తున్న కంపెనీ ఎండీ మాగంటి బాబు తదితరులు చక్రం తిప్పి రికార్డులను ట్యాంపరింగ్ చేసినట్లు అధికారికంగానే రూఢీ అయింది. దీంతో పోలీసు, సీఐడీ అధికారులు రంగంలోకి దిగి, ట్యాంపరింగ్, నకిలీ రిజిస్ట్రేషన్ చేసిన రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌శాఖల అధికారుల వివరాలు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. సీఎం ఆదేశాలతో ఇప్పటికే రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌శాఖల ఉన్నతాధికారులు కూడా గాంధీనగర్, నున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో విచారణ చేపట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

భూ వివాదాల్లో ఎమ్మెల్యే జోక్యంపై నివేదిక

విజయవాడ నగరంలోని పలు భూ వివాదాల్లో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో జోక్యం చేసుకుంటున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు సీఎం చంద్రబాబుకు ప్రత్యేక నివేదికను అందజేశారు. గతంలో అతని సోదరుడు ప్రభుత్వ భూమిని కబ్జా చేయటం వెనుక కూడా ఉమా హస్తం ఉన్నట్లు రిపోర్టులో పేర్కొన్నట్లు తెలిసింది. స్వాతంత్ర్య సమరయోధుని భూమిని కబ్జా చేయటంలో ఎమ్మెల్యే పాత్ర నూటికి నూరుశ్శాతం ఉన్నట్లు సాక్ష్యాలతో రుజువు అయినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవటంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి.

పోల'వరం'

(మొదటిపేజీ తరువాయి)

మార్చాలని బీజేపీ, టీడీపీ నాయకులు కూడా కేంద్రంపై వత్తిడి తీసుకువచ్చారు. పోలవరం ప్రాజెక్టు పనులు దోలాయమానంగా మారిన పరిస్థితిలో బీజేపీ నేతలు కూడా కేంద్రంతో చర్చలు జరిపి ప్రాజెక్టును కేంద్రమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీలు కూడా పోలవరం రూపంలో భారీగా దోచుకునేందుకు ఏపీ సర్కారు ప్రయత్నం చేస్తుందని కేంద్రానికి ఫిర్యాదు చేశారు. టీడీపీకి చెందిన ఎంపీ రాయపాటి సాంబశివరావు చెందిన ట్రాన్స్ ట్రాయ్ కంపెనీ ఇటు కేంద్రాన్ని, అటు రాష్ట్రాన్ని కూడా పోలవరం ప్రాజెక్టు విషయంలో అనేక ఇబ్బందులు పెట్టిందని వార్తలు వచ్చాయి. దీంతో ఒకానొక దశలో ప్రాజెక్టును కేంద్రం చేపడతానంటే తాము తప్పుకుంటామని కూడా అసెంబ్లీలో సీఎం చంద్రబాబు పేర్కొన్న విషయ విదితమే. సుమారు 16వేల కోట్ల అంచనాలతో ప్రాజెక్టును చేపట్టిన ట్రాన్స్ ట్రాయ్ పనులు సరిగా చేయకుండా కాలయాపన చేసి అడ్వాన్సులను సొంతానికి వాడేసుకోవటంతో బ్యాంకులు కూడా పోలవరం ప్రాజెక్టులో ట్రాన్స్‌ట్రాయ్ యంత్రాలను సీజ్ చేశాయి. ట్రాన్స్‌ట్రాయ్ అప్పులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్యారంటీ ఇస్తూ క్యాబినెట్‌లో కూడా తీర్మానం చేసింది. పోలవరం అథారిటీకీ, కేంద్ర జలవనరుల మంత్రి నితిన్ గడ్కరీకి ఇచ్చిన భారీ అంచనాలు చూసి కేంద్రం కూడా షాక్ అయ్యిందని తెలిసింది. పోలవరంపై చంద్రబాబు ఇచ్చిన అంచనాలపై కేంద్ర ఆర్థిక శాఖతో కూడా నితిన్ గడ్కరీ చర్చలు జరిపారు.

ఇంకెంతకాలం ?

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా జరిగే రోడ్లు, వంతెనల అభివృద్ధి పనులు వరుసగా సమీక్షించారు. వీటిలో అత్యంత కీలకమైన దుర్గగుడి ఫ్లైఓవర్ అంశంపై జరుగుతున్న జాప్యం పట్ల సీఎం అధికారులు, కాంట్రాక్టు సంస్థపై సీరియస్ అయ్యారు. ఇంకెంతకాలం కడతారు? ప్రజలు ఎంతకాలం ఇబ్బందిపడాలి ? రెండు జాతీయ రహదారులను కలపడమేగాక, రాజధానిలో ఇది అత్యంత కీలకమైన ఫ్లైఓవర్ అన్న విషయం మీకు తెలియదా ? ఎన్నిసార్లు గడువు పెంచాలి ? అంటూ ఆయన అధికారులు, కాంట్రాక్టు ప్రతినిధులను నిలదీశారు. వంతెన పైభాగాన్ని 13వ పిల్లర్ వరకు పూర్తిచేసి మార్చి నాటికి ప్రధాన రహదారిపై రాకపోకలు పునరుద్ధరించకపోతే కఠిన చర్యలు తీసుకోవాల్సివస్తుందని హెచ్చరించారు. నిర్మాణ సంస్థ కోరినట్టుగా రూ.10 కోట్లు ఇవ్వడానికి ముఖ్యమంత్రి అంగీకరించారు. ఫ్లైఓవర్ పనులకు అంతరాయం ఏర్పడకుండా కాలువ ప్రవాహాన్ని ఆపడానికి జల వనరుల శాఖతో మాట్లాడామని, రేపటి నుంచి సంబంధిత పనులను ఆరంభిస్తామని అధికారులు చెప్పారు. అలాగే బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్‌ను నిడమానూరు వరకు పొడిగించే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రమేష్ హాస్పిటల్స్ వరకు జరుగుతున్న బెంజ్ సర్కిల్ ఫ్లయ్‌వోవర్ నిర్మాణం నవంబర్ నాటికి పూర్తవుతుందన్నారు. విజయవాడ నగర అవసరాల దృష్ట్యా ప్రస్తుత ప్రతిపాదిత మార్గాన్ని మరికొంత దూరం పొడిగించాలని ముఖ్యమంత్రి వారికి చెప్పారు. హైదరాబాద్ పీవీ ఎక్స్‌ప్రెస్ ఫ్లైఓవర్ తరహాలో విజయవాడ నగరంలో కీలకమైన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సి వుందన్నారు. చెన్నయ్-కోల్‌కత్తా ఐదవ నెంబర్ జాతీయ రహదారి మార్గంలోని 1025 కిలోమీటర్ల మేర జరుగుతున్న రహదారి అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులు వివరాలు అందించారు రాజమహేంద్రవరం-విజయవాడ మధ్య దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు వెంటనే చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. విజయవాడ-గుండుగొలను, గుండుగొలను-రాజమహేంద్రవరం రెండు దశలలో పూర్తిచేయాలని స్పష్టంచేశారు.

నెల్లూరు-తడ మార్గాన్ని 6 వరుసలుగా మార్చాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మార్గంలో కృష్ణపట్నం ఓడరేవు, శ్రీసిటీ, స్పెషల్ ఎంప్లాయిమెంట్ జోన్ ఇతర పెరిగిన అవసరాల దృష్ట్యా 6 వరుసల విస్తరణ అవసరమన్నారు. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి మార్గం 38 శాతం పూర్తయ్యిందని, నిర్దేశించిన సమయానికి పూర్తిచేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. నందిగామ-కంచికచర్ల బైపాస్ రహదారి పనులను ఫిబ్రవరిలో ప్రారంభిస్తామని చెప్పారు. తిరుపతి-చిత్తూరు రహదారి పనులను ఫిబ్రవరిలో ప్రారంభిస్తామన్నారు. అలాగే, ఇచ్ఛాపురం నుంచి నరసన్నపేట నుంచి 6 వరుసలు చేయాలని ముఖ్యమంత్రి సూచించగా, ఆ మార్గంలో రాకపోకలు పెద్దగా లేకపోవడం వల్ల ప్రస్తుతం దాన్ని 4 వరుసలకే పరిమితం చేశామని జాతీయ రహదారుల శాఖ అధికారులు వివరించారు. వైకుంఠమాల రహదారిని నాయుడుపేట, చిత్తూరు, మదనపల్లి తదితర ప్రాంతాలకు అనుసంధానం అయ్యేలా చూడాలన్నారు. విశాఖపట్నం-రాయపూర్ రహదారి నిర్మాణానికి సంబంధించి అక్టోబరు నాటికి డీపీఆర్ సిద్ధం చేస్తామని అధికారులు చెప్పారు.

అమరావతి-అనంతపురము ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి సంబంధించి పనులలో వేగం పుంజుకోవాలని, జూన్ నాటికి భూ సేకరణ ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. సవరించిన అలైన్‌మెంట్ ప్రకారం 189 కిలోమీటర్ల మేర అమరావతి బాహ్యవలయ రహదారిని రూ.17,762 కోట్ల అంచనాతో నిర్మాణాన్ని చేపడుతున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనికోసం 3,404 హెక్టార్ల మేర భూమి అవసరం వుంటుందని చెప్పగా, సాధ్యమైన మేరకు భూ సమీకరణ విధానంలోనే భూములను తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

Downloaded From Telugu e News App play.google.com/store/apps/details?id=com.roshan.enews

6న డిగ్రీ లెక్చరర్ల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్ల పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఫిబ్రవరి 6వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ ఏపీపీఎస్సీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఏపీపీఎస్సీ ఆధ్వర్యాన (నోటిఫికేషన్ 4 నవంబరు, 2017) వివిధ సబ్జెక్టులో భర్తీ కోసం రాత పరీక్షను నిర్వహించారు. ఇందులో హిస్టరీ, హిందీ సబ్జెక్టులలో అర్హత సాధించిన ఇద్దరు అభ్యర్థుల్ని ఇంటర్వ్యూకు హాజరు కావాలని కమిషన్ కార్యాలయం నుంచి కాల్ లెటర్లు పంపారు.

శ్రీచైతన్య విద్యాసంస్థలకు ఏషియాస్ గ్రేటెస్ట్ బ్రాండ్-2017 అవార్డు



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: శ్రీచైతన్య విద్యాసంస్థ మరో ప్రతిష్టాత్మకమైన అవార్డును కైవసం చేసుకొంది. విద్యా రంగంలో అత్యుత్తమ సేవలకుగాను, సంస్థ నిర్వహణలో విశేష ప్రతిభ చూపినందుకుగాను శ్రీచైతన్యకు 'ఏషియాస్ గ్రేటెస్ట్ బ్రాండ్-2017 అవార్డు'ను సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ డా.బిఎస్.రావు తరపున అకడమిక్ డైరెక్టర్ సుష్మ స్వీకరించారు. ఈ సందర్భంగా బిఎస్.రావు మాట్లాడుతూ ఈ అవార్డు తమ విద్యాసంస్థ అత్యుత్తమ ప్రతిభకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. తాము నెలకొల్పిన విలువలను, క్రమ శిక్షణను తమ పిల్లలు కొనసాగిస్తూ ప్రతిక్షణం ఎంతో అప్రమత్తతతో శిక్షణను అందించటం వల్లే శ్రీచైతన్య ఇంతటి ఘన విజయాలు సాధిస్తూ సర్వోన్నత స్థాయికి దూసుకెళ్లిందని వివరించారు. ఎంతో స్ఫూర్తిమంతంగా విద్యారంగానికి సేవలందిస్తున్నందుకు గర్వకారణంగా ఉందని కొనియాడారు. ఇందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ, విద్యార్థుల తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలో నిరుద్యోగం తగ్గింది :కంభంపాటి

విశాలాంధ్ర అమరావతి : రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య తగ్గిందని, దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పర్యాటక రంగంలో మూడో స్థానంలో ఉందని టీడీపీ అధికార ప్రతినిధి కంభం పాటి రామోహనరావు చెప్పారు. మంగళవారం అసెంబ్లీలోని టీడీఎల్పీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఏపీకి పర్యాటకులు రావాలంటే భయపడేవారన్నారు. అమెరికా లాంటి దేశాలు ఏపీకి వెళ్లవద్దని హెచ్చరించాయన్నారు. నేడు తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్నాటక వరుసగా అయిదు స్థానాలలో నిలిచాయన్నారు. ఎకనామిక్ సర్వే 2018 ఏయే రంగాలపై శ్రద్ధ పెట్టాలో, ఎక్కడ వృద్ధి సాధించామో, ఎక్కడ వెనుక పడ్డామో స్పష్టంగా తెలియజేసిందన్నారు. 2014 -15లో 8.5 శాతం ఉంటే 2015 -16లో 10.9 శాతం పెరిగిందని సర్వే తెలిపిందన్నారు. ఈ సర్వే ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టిందన్నారు.తలసరి ఆదాయం రూ.1,22,376 ఉందని, దక్షిణాదిలోనే దిగువన ఉన్నామన్నారు. తయారీ రంగంలో 8 శాతం వృద్ధి, టెక్స్‌టైల్ రంగంలో రెడీమేడ్ ఎగుమతులు 16 శాతం పెరిగాయన్నారు. రాష్ట్రంలో శిశు మరణాలు తగ్గాయన్నారు. ఏపీలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడిన్నట్లు ఈ సర్వే స్పష్టం చేసిందని చెప్పారు. గ్రామాలలో 3.3 శాతం, పట్టణాలలో 4.3 శాతంగా ఉందన్నారు. సగటున నిరుద్యోగుల శాతం 3.5 శాతం ఉన్నట్లు పేర్కొన్నారు. నికర సాగు నీటి సౌకర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు ఏడవ స్థానం వచ్చిందని సర్వే తెలిపిందని చెప్పారు.

పని చేయండి.. ప్రజామోదం పొందండి

175 నియోజకవర్గాల్లో సమీక్షలు నిర్వహిస్తా
సమన్వయ కమిటీ సమావేశంలో – చంద్రబాబు

విశాలాంధ్ర అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎలక్షన్ మూడ్‌లోకి వచ్చేశారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా గెలవాలన్న లక్ష్యంతో ఇప్పటి నుండే ఆ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేయటం ప్రారంభించారు. మంగళవారం జరిగిన టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన పార్టీ నాయకులకు చేసిన సూచనల వివరాలు ఇలా ఉన్నాయి. మీరు మారాలి.. మీలో వచ్చిన మార్పును ప్రజలు గుర్తించాలి.. అని టీడీపీ శ్రేణుల నుద్దేశించి ఆపార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పారు. నాయకులు ఇక నుండి మారాల్సిందేనంటూ హెచ్చరించారు. నెలరోజులు టైం ఇస్తున్నా, పార్లమెంట్, అసెంబ్లీ వారిగా పార్టీ యాక్టివిటీస్‌ను బిల్డప్ చేసే పనిలో నిమగ్నం కావాలి. ఇకపై తాను పార్టీ పటిష్టతపైనే దృష్టి పెడతానన్నారు. ప్రతి



నియోజకవర్గంలో గెలుపు మనదే కావాలి. ప్రతి సీటు మనమే గెలవాలి. ఇప్పటి నుండే సీరియస్‌గా పనిచేయండి, ప్రజామోదం పొందండి అంటూ నాయకులకు పిలుపు నిచ్చారు. ప్రతి సీటు తెలుగుదేశం గెలుస్తుందన్న విశ్వాసం ప్రజల్లో కలిగించేలా సీరియస్‌గా పనిచేయండి. త్వరలో 175 నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై సమీక్షిస్తానని, నియోజకవర్గాలకు ఏ, బీ, సీ, డీ కేటగిరీలు ఇచ్చామని సి,డి కేటగిరి నియోజకవర్గాలపై ఎక్కువ దృష్టి పెడతానని చంద్రబాబు స్పష్టం చేశారు. మండల స్థాయి నేతలను నియోజకవర్గ సమావేశాలకు ఆహ్వానిస్తామని, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయ కమిటీలు ఈ సమావేశాలకు హాజరు కావాల్సిందేనన్నారు.

ఆ సమయంలో నియోజక వర్గాల వారీగా పార్లమెంట్ ఇన్‌ఛార్జిలు, ఫోర్ మెంబర్ టీమ్‌లతో భేటీ అవుతానని చంద్రబాబు చెప్పారు. ఎన్నికల ఏడాదిలో ఉన్నాం.. ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని, జన్మభూమి కమిటీలను పునఃనిర్మించాలని, ఫిబ్రవరి 2న జరిగే పార్టీ సమన్వయ కమిటీలో రాజకీయాలపై చర్చిద్దామని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వంపై ప్రజలకు సానుకూలత ఉందని, దానిని పార్టీపట్ల సానుకూలతగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని బాబు చెప్పారు. ప్రజల్లో సంతృప్తి డిసెంబర్‌లో 57శాతం ఉందని, జనవరిలో 62శాతానికి పెరిగిందన్నారు. రాష్ట్రస్థాయి దళితనాడు ఆడంబరంగా చేయాలి. దళితతేజం తరహాలో బిసి,ఎస్టి, మైనారిటీ వర్గాలతో కూడా కార్యక్రమాలు నిర్వహించాలి. అంబేద్కర్ స్మృతివనం, జగజ్జీవన్ రామ్ మెమోరియల్ తరహాలోనే జ్యోతిరావ్ పూలే మెమోరియల్ ఏర్పాటుచేస్తాం. ఆదరణ-2 అన్ని నియోజకవర్గాలలో విజయవంతం చేయాలి. ఏయే వర్గాలకు ఏమేం చేశామో ఆయా వర్గాలను జాగృతం చేయాలి, వారిలో అవగాహన పెంచడం ద్వారా పార్టీకి, ప్రభుత్వానికి చేరువ చేయాలన్నారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కె.ఈ.కృష్ణమూర్తి, మంత్రులు యనమల రామకృష్ణుడు, నారాయణ, పుల్లారావు, దేవినేని ఉమా మహేశ్వరరావు, పరిటాల సునీత, కాల్వ శ్రీనివాసులు ఇతర మంత్రులు, పార్టీ బాధ్యులు వర్ల రామయ్య, సుబ్బారాయుడు, ఆనం రామనారాయణ రెడ్డి, టిడి జనార్దన్, వివివి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ కంట్రోల్‌లో ప్రత్యేకంగా పోలీస్ వింగ్

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : డ్రగ్స్ కంట్రోల్ విభాగంలో పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్స్ (ఎన్‌బీడబ్ల్యు)పై ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. అందులో భాగంగా డ్రగ్స్ కంట్రోల్ విభాగంలో ప్రత్యేకంగా ఒక పోలీసు విభాగాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే ఒక సబ్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు 26 మంది కానిస్టేబుళ్లను డిప్యుటేషన్‌పై నియమించనున్నారు. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి జిల్లా నుంచి ఇద్దరు కానిస్టేబుళ్లను ఈ విభాగానికి డిప్యుటేషన్‌పై తీసుకుంటారు. డ్రగ్స్ కంట్రోల్ విభాగంలో పెండింగ్‌లో ఉన్న ఎన్‌బీడబ్ల్యులపై దృష్టి సారించటంతోపాటు సమ్మన్స్ జారీ చేసేందుకు వీరి సేవలను ఉపయోగించుకోనున్నారు.



సమయం ఎక్కువలేదు - నిధులు ఖర్చు చేయండి : మంత్రి ఆనందబాబు

విశాలాంధ్ర-అమరావతి : ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం చివరి దశకు వచ్చేశామని, ఇంకా రెండు నెలలు మాత్రమే సమయం ఉన్నందున పనుల వేగం పెంచి ఎస్సీ, ఎస్టీ నిధులు ఖర్చు చేయాలని సాంఘీక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం జరిగిన ఎస్సీ, ఎస్టీ 19వ నోడల్ ఏజన్సీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంతో పోల్చితే నిధుల వినియోగంలో కొంత మెరుగు కనిపిస్తోందన్నారు. ఎస్టీ, ఎస్సీ నిధులు 70 నుంచి 75 శాతం మాత్రమే ఖర్చు చేశారని, మిగిలిన వాటిని కూడా చివరి త్రైమాసికంలో ఖర్చు చేయాలని చెప్పారు. గేదెలు కొనుగోలుకు సంబంధించి అధికారులు చెప్పే ధరలకు, రైతులు మార్కెట్ లో కొనుగోలు చేసే ధరలకు వ్యత్యాసం ఉందన్నారు. వచ్చే బడ్జెట్ లో ఎస్టీ, ఎస్సీలకు ఉపయోగపడే, ఆర్థికంగా భరించగలిగే పథకాలు రూపొందించమన్నారు. ట్రాక్టర్లు కొనుగోలు వంటి పథకాలలో లబ్ధిదారుల భాగం ఎక్కువగా ఉన్నందున కొన్ని మండలాల్లో వారు ముందుకు రావడంలేదన్నారు. ఇతరులకు ఇచ్చేవిధంగా గిరిజన రైతులకు కూడా సబ్సిడీ ఇస్తున్నారని, అలా కాకుండా వారికి సబ్ ప్లాన్ నుంచి అదనంగా సబ్సిడీ ఇవ్వాలన్నారు. అటువంటి పథకాలకు ఎక్కువ సబ్సిడీ ఇచ్చేవిధంగా ప్రణాళికలు రూపొందించమని మంత్రి ఆదేశించారు. ఎస్సీ కాంపొనెంట్ కింద ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.9,847.13 కోట్లు కేటాయించగా, నోడల్ ఏజన్సీలకు చెందిన 44 ప్రభుత్వ శాఖలు జనవరి 25 వరకు రూ.7,469.36 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ ప్రకారం రూ.10,916.34 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఎస్టీ కాంపొనెంట్ కింద ఈ ఏడాది రూ.3,528.78 కోట్లు కేటాయించగా, నోడల్ ఏజన్సీకి చెందిన 45 శాఖలు జనవరి 25 వరకు రూ.2,610.37 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. సవరించిన బడ్జెట్ ప్రకారం రూ. 4,025.97 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ నిధుల వినియోగానికి సంబంధించి అన్ని శాఖల పనితీరుని సమీక్షించారు. గిరిజన ప్రాంతాల్లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలలో ఉపాధికి అవకాశం ఉన్న కోర్సులు ప్రవేశపెట్టడానికి తగిన ప్రణాళికలు రూపొందించమని ఆదేశించారు. చేపల చెరువులు, ట్రాక్టర్లు కొనుగోలు వంటి పథకాలలో లబ్ధిదారులకు బీనామీలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వచ్చే ఏడాది నుంచి ఆధార్ నెంబర్‌తో సహా లబ్ధిదారుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సివిల్ సప్లైస్, యూత్ సర్వీసెస్, ఎనర్జీ, ఆర్ అండ్ బీ, గృహ నిర్మాణం, వైద్య ఆరోగ్య శాఖ, సెర్ప్, సర్వశిక్ష అభియాన్, హార్టీ కల్చర్, మన బడి, అంగన్ వాడీ భవనాలు, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు తదితర అన్ని విభాగాల్లో నిధుల వినియోగాన్ని సమీక్షించారు. మిగిలిన నిధులను వచ్చే రెండు నెలల్లో ఖర్చు చేయాలన్నారు. గిరిజనులకు ప్రయోజనం కలిగిలా, వారికి ఏవి అవసరమో వాటికి సంబంధించిన కొత్త పథకాలు ప్రవేశపెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో, కళాశాల విద్య ప్రత్యేక కమిషనర్ సుజాతాశర్మ, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి కె.సునీత, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ గందం చంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల కమిటీలా? రాజకీయ పునరావాస కేంద్రాలా?

నియామకాల్లో ప్రాథమిక నిబంధనలకు తిలోదకాలు

విశాలాంధ్ర-విశాఖపట్నం: జిల్లా స్థాయిలో బాలల సంరక్షణకు రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన బాలల న్యాయ చట్టం 2015 ప్రకారం జిల్లా స్థాయి బాలల సంరక్షణ కమిటీలు పనిచేస్తాయి. అయితే సోమవారం అర్ధరాత్రి ఆదరా బాదరాగా ప్రకటించిన ఈ కమిటీ బాలల కోసం దశాబ్దాలుగా పనిచేస్తోన్న స్వచ్ఛంద సంస్థలను, బాలల హక్కుల కార్యకర్తలను నిర్వీర్యపరిచింది. బాలలతో సంబంధం లేని, వారి హక్కులు, చట్టాలపై అవగాహన లేని వారికి, రాజకీయ ప్రమేయం ఉన్న వ్యక్తులకు ఇందులో అవకాశం కల్పించారనే తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బాలల సంరక్షణ కమిటీ పరిధి

బాలలపై రోజురోజుకూ జరుగుతున్న హింస, నిరాదరణకు గురవుతోన్న పిల్లల సంఖ్య పెరుగు తోంది. అలాగే ఇంటి నుంచి పారిపోతున్న పిల్లలు కూడా రోజురోజుకూ పెరుగుతున్నారు. ఎంతో బాధ్యతాయుతంగా పనిచేసే ఈ కమిటీ లోని వ్యక్తులు ముఖ్యంగా బాలలతో స్నేహ పూర్వకంగా మసలడం అనేది చాలా ముఖ్యం. బాలల సంరక్షణ కమిటీ 24 గంటలూ నిరంతర జాగురూకతతో పిల్లల కోసం పనిచేయవలసిన అవసరం ఉంది. 2017 మే నెలలో ఈ కమిటీల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసారు. బాలల న్యాయచట్టం 2015 జీ.ఓ.ఎం.ఎస్. నెంబర్ 2 ప్రకారం బాలలతో కనీసం ఏడు సంవత్సరాలు పనిచేసిన అనుభవం, డిగ్రీ, పీజీ సామాజిక శాస్త్రాలు, లేదా సైకాలజీ, లా అంశాలుగా పనిచేసి ఉండటం, నేరప్రవృత్తి లేదా నేరారోపణకు గురైన వారు అనర్హులుగా పేర్కొన్నారు. ఇదికాక పిల్లల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తులు కూడా అనర్హులు. ఈ కమిటీల నియామకానికి గత జులైలో మౌఖిక పరీక్షలు విజయవాడలో నిర్వహిం చారు. ఇందులో అర్హత పొందిన వారికి పోలీస్, నిఘావిభాగాలు విచారణ చేసి నివేదికను సెప్టెంబర్ లో పంపించాయి. అయితే ఇప్పుడు అనూహ్యంగా ఇంటర్వ్యూలో అర్హత పొందిన వారు కాక కొత్త వ్యక్తులు బాలల సంరక్షణ కమిటీలో చోటు దక్కించు కోవడం స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలను విస్మయానికి గురి చేసింది.

రాజకీయ ఒత్తిడిలు

రాజకీయ వత్తిడిలు కారణంగా ఈ రంగంతో సంబంధం లేని వారిని, రాజకీయ పలుకుబడిగల వారిని నియమించడం వలన బాలల సంరక్షణ గాలిలో దీపంగా మిగులుతోంది. ఈ రంగంపై ఆసక్తి, బాలల పట్ల కనీస ఆదరణ లేక పోవడంతో బాలల సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోతు న్నాయి. మొదట ఇది నామినేటెడ్ పోస్టుగా భావించి ఆ తరువాత పిల్లల సమస్యల పరిష్కారం పట్ల విముఖత చూపడం వలన బాలల సంరక్షణ కమిటీ సమావేశాలు 'కోరం' లేక ఆగిపోయే అవకాశం ఉంది.

ఆరోపణలు

బాలలపై అనుచితంగా ప్రవర్తించి సస్పెన్షన్‌కు గురైన వ్యక్తిని నియమించారని, అదేవిధంగా ఎన్నడూ బాలల కోసం పనిచేయని మరో ముగ్గురిని నియమించారని బాలల హక్కుల కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు ఆరోపిస్తున్నాయి. ఈ వరవడి వలన జిల్లాస్థాయిలో బాలలకు తీవ్రస్థాయిలో అన్యాయం జరుగుతుందని అభిప్రాయపడు తున్నారు. వాస్తవానికి నోటిఫికేషన్ వెలువడిన 90 రోజులలో నియామకప్రక్రియ చేపట్టాలి. ఇప్పటికి 240 రోజులు గడిచిపోవడం వలన న్యాయపరంగా ఈ నియామకం చెల్లదనే వాదన కూడా వినిపిస్తోంది. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సంప్రదింపులు చేయకుండా ఏకపక్షంగా నియామ కాలు చేపట్టిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన బాలల హక్కుల కార్యకర్తలు బాలల కమిటీలతో పాటు బాలలతో కల్సి రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌కు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు ఫిర్యాదు చేయడానికి సన్నద్ధమవుతున్నారు.

రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ఆరంభమై 21 వరకూ కొనసాగుతాయి. ఈ దఫా ఇన్విజిలేటర్లనూ జంబ్లింగ్ విధానంలో నియమిస్తారు. ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాల దగ్గర ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు రెండు విడతలుగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ జంబ్లింగ్ విధానంలో పరీక్షలను నిర్వహిస్తారు. సీసీ కేమేరాల నిఘా నడుమ పరీక్షల్ని నిర్వహిస్తారు. ఈ నెల 25వ తేదీ నుంచి హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో ఏపీ ఇంటర్మీడియట్ కమిషన్ కార్యాలయంలో అందుబాటులో ఉంచారు. రాష్ట్ర వ్యాప్తంగా 3లక్షల 25వేల మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారు. జంబ్లింగ్ విధానంలో ఇంటర్ ప్రాక్టికల్ నిర్వహించడాన్ని నిరసిస్తూ ఇటీవల ప్రైవేటు కళాశాలల యాజమాన్యం ఆందోళనకు దిగిన విషయం విదితమే. ఫిబ్రవరి 28 నుంచి మార్చి17వరకూ ప్రథమ, మార్చి 1నుంచి 19వరకూ ద్వితీయ ఇంటర్ పరీక్షలను నిర్వహిస్తారు.

సాగునీటి ప్రాజెక్టులకు రూ. 2వేల కోట్ల రుణం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ. 2వేల కోట్లను రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈమేరకు జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మంగళవారం జీవో జారీ చేశారు. రాష్ట్రంలో వివిధ దశల్లో పనులు జరుగుతున్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయా లంటే రూ. 10,796.53 కోట్లు అవసరమవుతాయని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర జల వనరుల అభివృద్ధి సంస్థ (ఏపీడబ్ల్యూఆర్‌డీసీ) ప్రభుత్వాన్ని కోరింది. ఇందులో రూ. 2వేల కోట్లను జాతీయ బ్యాంకు నుంచి రుణంగా పొందేందుకు జలవనరులశాఖ ఆమోదం తెలిపింది.



టీడీపీ భూ దోపిడీపై ప్రధానికి లేఖ

- బోండా ఉమా భూకబ్జాల వెనుక చంద్రబాబు హస్తం
- వైసీపీ రాష్ట్ర నాయకులు బొత్సా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం విచ్చలవిడిగా కొనసాగిస్తున్న భూ దోపిడీపై ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాయనున్నామని వైసీపీ రాష్ట్ర నాయకులు బొత్సా సత్యనారాయణ వెల్లడించారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో విజయనగరం జిల్లా భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు క్యాబినెట్ సమావేశాన్ని నిర్వహించి భోగాపురం ఎయిర్‌పోర్టు టెండర్లు రద్దు చేశారని, దీన్ని వైసీపీ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. చంద్రబాబు తరహా వ్యక్తిని తన రాజకీయ జీవితంలో చూడలేదని విమర్శించారు. కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు హయాంలో పెద్దఎత్తున దోపిడీ కొనసాగుతోందని, దీనికి భోగాపురం ఎయిర్‌పోర్టు వ్యవహారమే నిదర్శనమని స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి జరిగిన టెండరులో ప్రభుత్వ దోపిడీకి అవకాశం లేనందునే టెండర్లను రద్దు చేశారన్నారు. చంద్రబాబు, అశోక్ గజపతిరాజు స్వప్రయోజనాల కోసమే భోగాపురం ఎయిర్‌పోర్టు టెండర్లను రద్దు చేశారని దుయ్యబట్టారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు పాల్పడుతున్న భూకబ్జాల వెనుక సీఎం చంద్రబాబు హస్తముందని ఆయన విమర్శించారు.

గాంధీజీ బాటలో నడుద్దాం: బొత్సా

జాతిపిత మహాత్మాగాంధీ బాటలో నడుద్దామని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేద్దామని వైసీపీ రాష్ట్ర నాయకులు బొత్సా సత్యనారాయణ పేర్కొన్నారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం మహాత్మాగాంధీ 70వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి వైసీపీ నాయకులతో కలిసి ఆయన పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పైలా సోమినాయుడు, వైసీపీ విజయవాడ నగర అధ్యక్షులు వెలంపల్లి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లాది విష్ణు, పార్టీ నాయకులు బొప్పన భవకుమార్ పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొలిక్కిరాని కంప్యూటర్ల వివాదం

రేపటి నుంచి మద్యం సరఫరా బంద్
వ్యాపారుల్లో టెన్షన్

విశాలాంధ్ర అమరావతి : ఎక్సైజ్ శాఖలో ట్రాక్ అండ్ ట్రేస్ మిషన్ల ఏర్పాటు వివాదం ఓ కొలిక్కి రాలేదు. మిషన్ల ఏర్పాటుకు మంగళవారం చివరిరోజు. రాష్ట్రంలోని వైన్స్‌లు, బార్‌షాపుల్లో ట్రాక్ అండ్ ట్రేస్ మిషన్లు ఈ నెల 30 కల్లా ఏర్పాటు చేయని షాపులకు మద్యం సరఫరా నిలిపివేయాలని ఎక్సైజ్ కమిషనర్ ఎక్సైజ్ డిపోలకు ఆదేశాలు జారీ చేశారు. అయితే సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ చేయాల్సిన సీటెల్ కంపెనీ తమ రేటును పెంచటంతో సమస్య కొలిక్కి రాలేదు. దీంతో చాలా షాపుల్లో మిషన్లు ఏర్పాటు కాలేదు. బుధవారం నుండి తమకు డిపోల నుండి మద్యం సరఫరా చేస్తారో లేదోనని వైన్ బార్ షాపుల యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఈ వివాదానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్యం అమ్మకాల్లో పారదర్శకత కోసం ప్రభుత్వం అన్ని మద్యం షాపుల్లో హెచ్‌పిఎఫ్‌ఎస్ (హెడోనిక్ పాత్ ఫౌండ్ సిస్టమ్) ప్రవేశపెట్టింది. దీనివల్ల అధిక ధరల నియంత్రణ, బెల్ట్‌షాపుల నిరోధం, బిల్లింగ్, కల్తీ, నకిలీ మద్యాన్ని అరికట్టవచ్చు. దీనికి తోడు ఆన్‌లైన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా మద్యం అమ్మకాల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసు కోవచ్చు. ఇందుకు సీటెల్ కంపెనీ సాఫ్ట్‌వేర్‌ను అందించాలి. అప్పట్లో కొందరు అధికారులు కార్వే కన్సల్టెన్సీ ద్వారానే కంప్యూటర్ల కొనాలని ఒత్తిడి తెచ్చారు. బయట మార్కెట్‌లో పేరున్న కంపెనీల కంప్యూటర్లు దొరుకుతుంటే కార్వే కంపెనీ తనకున్న పలుకుబడితో నెలకు 5వేలు అద్దె చెల్లించేలా మద్యం షాపుల్లో కంప్యూటర్లు అమర్చారు. రాష్ట్రం మొత్తం 4380 వైన్ షాపులు, 800 బార్ షాపులు ఉన్నాయి. కార్వే సమకూర్చిన కంప్యూటర్లు పనిచేసిన చేయకపోయినా అద్దెలు భారీగా చెల్లించారు. ఇది 2017 జూన్ 30 వరకు జరిగిన వ్యవహారం. గతేడాది జులై 1 నుంచి కొత్త షాపులు ఆరంభమయ్యాయి. పాత వ్యాపారుల వద్ద కార్వే కంప్యూటర్లు ఉండగా కొత్తగా లైసెన్స్ పొందిన వ్యాపారులు మాత్రం కార్వే కంప్యూటర్లను అమర్చు కోలేదు. ఆరు నెలలు గడిచినా ట్రాక్ అండ్ ట్రేస్ మిషన్లు ఏర్పాటు కాని షాపులకు ఈ నెల 2 నుండి మద్యం సరఫరా నిలిపివేయాలని ఎక్సైజ్ కమిషనర్ డిపోలకు ఆదేశాలు ఇచ్చారు. దీనివల్ల 50కోట్ల మద్యం అమ్మకాలు కూడా నిలిచిపోయాయి. దీంతో వ్యాపారులు మంత్రి జవహర్‌కు విన్నవించుకోగా ఆయన కమిషనర్‌తో మాట్లాడి మిషన్లు అమర్చుకొనేందుకు ఈ నెల 30 వరకు గడువు ఇప్పించారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం 4380 షాపుల్లో 4100 షాపుల్లో మిషన్లు ఏర్పాటు చేశామని, అందులో 1100 మిషన్లు పనిచేయటం లేదని సంస్థ ప్రతినిధులు చెప్తున్నారు. ఆ మిషన్లు పనిచేయటం లేదని ఫిర్యాదులు అందటంతో సాఫ్ట్‌వేర్ రూపొందించిన సీటెల్ సంస్థ తామే మిషన్లు ఏర్పాటు చేస్తామని చెప్పి, ఒకవేళ బయట కంప్యూటర్లు కొనుగోలు చేసినా సాఫ్ట్‌వేర్ అందించేందుకు అంగీకరించింది. అయితే 10వేలకు సాఫ్ట్‌వేర్ అందించాలని కోర్టు ఆదేశాల మేరకు వ్యాపారులు కోరుతుంటే 25వేలు చెల్లించాలంటూ సాఫ్ట్‌వేర్ అందించాల్సిన సంస్థ ప్రతినిధులు వ్యాపారులను కోరుతున్నట్లు తెలుస్తోంది. అన్ని డబ్బులు చెల్లించేందుకు ఇష్టపడలేదు. దీంతో మిషన్ల ఏర్పాటు వివాదం కొనసాగుతూనే ఉంది. ఈ వివాదం సమసిపోక పోవటంతో ఫిబ్రవరి 1 నుండి మద్యం పంపిణీ నిలిపివేయాలని కమిషనర్ ఇచ్చిన ఆదేశాల మేరకు మద్యం సరఫరా చేయలేకపోతే భారీగా నష్టపోవాల్సి వస్తుందని వ్యాపారులు ఆందోళన చెందు తున్నారు. సాఫ్ట్‌వేర్, మిషన్ల వివాదం కూడా ప్రభుత్వమే పరిష్కరించాలని కోరుతున్నారు. అప్పటివరకు డిపోల నుండి యధావిధిగా షాపులకు మద్యం సరఫరా చేయాలం టున్నారు. ఈ వ్యవహారంపై కమిషనర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాల్సి ఉంది. అయితే గతంలోనే గడువు పెంచాని కమిషనర్ వ్యాపారులకు చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని మద్యం వ్యాపారుల్లో ఉత్కంఠ నెలకొంది.

ఉత్తర అమెరికాలో ఏపీ ప్రతినిధిగా కోమటికి ఎక్స్‌టెన్షన్


విశాలాంధ్రబ్యూరో - అమరావతి : ఉత్తర అమెరికాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధిగా ఉన్న కోమటి జయరామ్ పదవిని ప్రభుత్వం మరో రెండేళ్లపాటు పొడిగించింది. ఉత్తర అమెరికా నుంచి రాష్ట్రానికి పెట్టుబడులను రాబట్టేందుకు ప్రభుత్వం ఆయన్ని నియమించింది. ఈయన పదవీకాలం ఇటీవలే ముగియగా, మరో రెండేళ్లకు పొడిగిస్తూ సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శి (పొలిటికల్) ఎన్ శ్రీకాంత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 18వ తేదీ నుంచి 2020 జనవరి 17వ తేదీ వరకు జయరామ్ ఏపీ ప్రభుత్వ ప్రతినిధిగా కొనసాగనున్నారు.

సామాన్యుల భూములపై టీడీపీ గద్దలు: వైసీపీ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలుగుదేశం పార్టీ భూ కబ్జాలకు అంతుల లేకుండా పోయిందని, విజయవాడ భూ కబ్జాలకు అడ్డాగా మారిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ ఆరోపించారు. విజయవాడలో ఎస్ఆర్ఎస్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల కబ్జాపై ఆ కాలేజీ పూర్వ విద్యార్థులు సమరశంఖం పూరించి వీధుల్లోకి వచ్చి పోరాటం చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శమన్నారు. మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం లోటస్‌పాండ్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. రైతులు, సామాన్యుల భూములను దౌర్జన్యంగా లాక్కున్న చంద్రబాబు సర్కార్ చివరికి స్వాతంత్ర్య సమరయోధుడి భూమిని కూడా వదల్లేదన్నారు. టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమా స్వాతంత్ర్య సమరయోధుడి వారసులకు తెలియకుండా ఆ భూమిని బోండా భార్య సుజాత, అనుచరుల పేరుతో కొన్నట్లుగా తప్పుడు పత్రాలను సృష్టించారని, ఆ భూములకు నకిలీ పత్రాలు సృష్టించిన ఎమ్మెల్యేపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఏపీ రాజధానిలో ఎక్కడ భూమి కనిపించినా టీడీపీ నేతలు గద్దల్లా వాలిపోయి భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే బోండా ఉమా భూకబ్జాల వెనుక చంద్రబాబు హస్తం, భాగస్వామ్యం ఉందన్నారు. రాజధానిలో బోండా లాంటి నాయకులు చెలరేగిపోతున్నా చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. గతంలో భూకబ్జా అంటే పెద్ద నేరంగా ఉండేదని, ఇప్పుడు చంద్రబాబు నాలుగేళ్ళ పాలనలో భూకబ్జాలు ఫ్యాషన్‌గా మారాయని వాసిరెడ్డి పద్మ పేర్కొన్నారు. కబ్జాల కోసమే చంద్రబాబు క్యాబినెట్ సమావేశాలు నిర్వహిస్తున్నారని, క్యాబినెట్ సమావేశాలు జరుగు తున్నాయంటే రైతుల గుండెల్లో దడవుడుతోందన్నారు.

గాజువాక స్థలాల విక్రయానికి రెండేళ్ల కాలపరిమితి

విశాలాంధ్ర-అమరావతి : విశాఖపట్నం జిల్లాలోని గాజువాక పరిధిలోని స్థలాలను క్రయవిక్రయాలు చేసేం దుకు కాలపరిమితిని 2 సంవత్సరాలకు తగ్గించాలన్న స్థానిక ప్రజల విజ్ఞప్తికి మంత్రివర్గ ఉపసంఘం సానుకూలంగా స్పందించి క్రయవిక్రయాల కాలపరిమితిని తగ్గిస్తూ ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని అధికారులను ఆదేశించింది. సచివాలయంలో మంగళవారం జరిగిన మంత్రి వర్గ ఉపసంఘం సమావేశంలో ఉపముఖ్యమంత్రి కెఈ కృష్ణమూర్తితో పాటు ఆర్థికశాఖా మంత్రి యనమల రామకృష్ణుడు, రవాణాశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, మున్సిపల్ శాఖా మంత్రి నారాయణలు పాల్గొన్నారు. గాజువాక పరిధిలో ప్రభుత్వం జారీ చేసిన జీవో 301 ప్రకారం స్థలాల క్రమబద్ధీకరణకు ధరఖాస్తు చేసుకున్న అర్జీలలో, ఇప్పటి వరకు మొత్తం 7,407 ధరఖాస్తులను ఆమోదించారు. అయితే సదరు ఉత్తర్వులలో క్రమబద్ధీ కరించిన స్థలాలను క్రయవిక్రయాల జరపడానికి 5 సంవత్సరాల కాలపరిమితిని విధించారు. రాష్ట్ర వ్యాప్తంగా అభ్యంతరంలేని ఆక్రమణలో గల ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం జీవో 388 జారీ చేసింది. ఈ జీవో మేరకు క్రమబద్ధీకరించిన స్థలాలను క్రయ విక్రయాలు జరిపేందుకు 2 సంవత్సరాల కాలపరిమితిని విధించారు. ఈ జీవోలో పొందుపర్చిన విధంగా గాజువాక స్థలాల విషయంలో క్రయవిక్రయాలు చేసేందుకు ప్రస్తుతం ఉన్న 5 సంవత్సరాల కాలపరిమితిని 2 సంవత్సరాలకు తగ్గించాలన్న స్థానిక ప్రజాప్రతినిధులు మరియు సామాన్య ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకొని, మంత్రివర్గ ఉపసంఘం ఈ అంశాన్ని చర్చించి, జీవో 301కి సవరణ చేయడానికి ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. అంతేకాక క్రమబద్దీకరణ చేయబడిన స్థలాలను తనఖా పెట్టుకొనుటకు అనుమతించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న 388 జీవోకు కూడా క్రమబద్దీకరణ చేయబడిన స్థలాలను తనఖా పెట్టుకొనుటకు అనుమతించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా అభ్యంతరంలేని ఆక్రమణలో గల ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం జీవో 388 మేరకు రాష్ట్ర



వ్యాప్తంగా ఇప్పటివరకు ఎన్ని అర్జీలు వచ్చాయి, ఎన్ని పరిష్కరించారు. ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి అనే విషయంపై సమగ్ర సమాచారం అందించాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. సమావేశంలో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి మన్మోహన్ సింగ్, రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

Downloaded From Telugu e News App play.google.com/store/apps/details?id=com.roshan.enews

సంపాదకీయం

బురేదిన్‌కు దిక్సూచి

మోడీ సర్కారు ప్రవేశపెట్టబోయే చిట్టచివరి పూర్తి స్థాయి బడ్జెట్ ఊహల పందిరనే సంకేతాలను 2017-18 ఆర్థిక సర్వే అందించింది. దేశ పరిస్థితిపై ఆశాజనక దృశ్యాన్ని ఆవిష్కరించినా సర్వేలో అంతర్లీనంగా ఉన్న అనేక అంశాలు ,కలవరం కలిగించేవనే వాస్తవం స్పష్టమవుతున్నది. సర్వే ఆశాజనకమైన అంచనాలు అత్యంత బలహీనమైన ప్రాతిపదికలపై సాగాయి. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థ కుప్ప కూలిపోయిందనే వాదనను తిప్పికొట్టేందుకు, పాలక పార్టీలో సరికొత్త ఉల్లాసాన్ని నింపేందుకు ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ ఈ సర్వే నివేదిక తయారీలో గిమ్మిక్కులు ప్రదర్శించారు.

పరోక్ష పన్ను చెల్లింపుదారుల సంఖ్య రెట్టింపైందనీ, స్థూల దేశీయాభివృద్ధి అంచనాను మించిందనీ, ద్రవ్యోల్బణం అదుపులో ఉందని నమ్మించేందుకు ఈ సర్వే శతసహస్ర విన్యాసాలు చేసింది. పైపై మెరుగులు ఎలా ఉన్నా.. సర్వే మొత్తం ప్రైవేటు పెట్టుబడులు, సంస్కరణలు, భారాల చుట్టూనే తిరిగింది. జీడీపీ వృద్ధిరేటుపై వరసగా తమ అతి అంచనాలు తలకిందులైనా ఈసారి కూడా అదే మూసధోరణి కనబర్చింది. నిరుటి సర్వేలో 2017-18లో జీడీపీ వృద్ధిరేటు 6.75 నుంచి 7.25శాతమని అంచనా వేసి ప్రస్తుతం 6.75గా ఖాయం చేశారు. అయితే అది ఎంత సమోదవుతుందో తెలియని పరిస్థితి. దీనినుంచి గుణపాఠం నేర్వకుండానే వచ్చే ఏడాది వృద్ధిరేటును 7-7.5శాతం సాధిస్తామని చెప్పడం జనాన్ని మోసగించడానికి తప్ప ఎందుకూ పనికిరాదు. అంతేకాదు, ఈ వృద్ధిరేటు సాధనకు ప్రైవేటు పెట్టుబడులు ముఖ్యంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐ) కీలకమని కూడా పేర్కొన్నారు. ప్రభుత్వం ఎంత చెప్పుకున్నా జీఎస్టీ విధానం ఇంకా కుదురుకోలేదనేది వాస్తవం. అంతర్జాతీయ పరిస్థితి ఆశాజనకంగా లేదు. పెట్రోలు ధరలకు సంబంధించి ఇంతకాలం లభించిన వెసులుబాటు ఇక ముందు సాధ్యపడక పోవచ్చు. అంతర్జాతీయ రంగంలో, ఆంతరంగికంగా ఆటుపోట్లు అనివార్య మనిపిస్తున్నది. ఈ విపరీత పరిణామాల నేపథ్యంలో విదేశాల నుంచి పెట్టుబడులు తరలివస్తాయని ఆశించడం ఊహల పల్లకిలో ఊరేగటమే అవుతుంది. గత మూడేళ్లలో మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్‌లు, స్టాండప్‌లంటూ ఎంత హడావుడి చేసినా వచ్చిన పెట్టుబడులు నామమాత్రమే. కాబట్టి ఈ ఏడాదిలోనే విదేశీ పెట్టుబడులు వచ్చి పడిపోతాయనడం అర్థరహితం.

విద్య, ఉపాధి, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆర్థిక సర్వే సూచించింది. వాస్తవానికి ఈ మూడేళ్లలో ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఈ

> **ఆర్థిక వేత్తలు చెబుతున్న ప్రకారం- వ్యక్తుల స్వల్ప ఆదాయ పెరుగుదల జాతీయోత్పత్తి పెరగడానికి దోహదపడదు. వ్యక్తులు కూడబెట్టుకొని ఖర్చు చేసే స్థితికి వచ్చినప్పుడు ఆ ఆదాయం ఆర్థికాభివృద్ధికి దారితీస్తుంది. అందువల్ల గ్రామీణ ఆర్థిక రంగంలో మౌలిక మార్పులు తేవడం, గ్రామీణ మహిళల సాధికారతకు మార్గాలు ఏర్పరచడం తక్షణ అవసరం.**

లక్ష్యాలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ.. ఈ రెండు చర్యలు కోట్లాది మంది ఉపాధిని దెబ్బతీశాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం చూపాయి. ఇప్పటికీ ఉపాధి కల్పనలో వృద్ధిలేదు. నిరుద్యోగ సమస్య తీవ్రరూపం దాల్చింది. విద్యపై కొన్నేళ్లుగా ప్రభుత్వ వ్యయం తగ్గిపోయింది. అదే విధంగా వైద్యంపై కూడా వ్యయాన్ని తగ్గించింది. సామాజిక రంగాలపై ప్రభుత్వ వ్యయం తగ్గడం వల్ల స్థూల ఆర్థిక రంగంపై పడుతున్న ప్రభావాన్ని ఈ సర్వే విశ్లేషించలేదు. మానవ వనరుల ప్రాధాన్యాన్ని ప్రస్తావించిన సర్వే ఆ వనరులను సద్వినియోగం ఎలా చేసుకోవాలనే అంశాన్ని విస్మరించింది. వ్యవసాయరంగంలో ఉత్పాదకత పెరుగుదల స్థూల ఆర్థిక రంగం వృద్ధికి కీలకమని చెప్పిన సర్వే ఆ రంగం ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలను చర్చించకుండా పక్కనబెట్టింది. అలా చర్చిస్తే అసలు లోటుపాట్లు బయటపడే ప్రమాదం ఉండడమే దానికి కారణం. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామంటూ ప్రధాని హామీలు గుప్పిస్తున్నా.. వారి రాబడుల్లో పైస కూడా పెరగకపోగా మరింత నష్టాలు, అప్పుల్లోకి కూరుకుపోయి బలవన్మ రణాలకు గురవుతున్నారు. ఈ సీజన్‌లో రైతులు దేశవ్యాప్తంగా రోడ్డెక్కిన విషయం అందరికీ తెలిసిందే. ఇంత ఉధృతంగా రైతులు ఆందోళనకు దిగడం బహుశా ఇదే మొదటిసారి కావచ్చు. వాతావరణ మార్పుల కారణంగా పంటల ఉత్పాదకత తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేసిన సర్వే వ్యవసాయాభివృద్ధికి ప్రైవేటు పెట్టుబడులే కీలకమని తేల్చింది. ఇది వ్యవసాయ సంక్షోభాన్ని మరింత పెంచుతుందే తప్ప పరిష్కరించదు. వాతావరణం, మార్కెట్ హెచ్చుతగ్గులు, దిగుబడిలో నిర్దిష్టత తదితర ప్రతికూల అంశాలను ఎదుర్కొంటూ వ్యవసాయ నష్టాలను నివారించి, లాభసాటిగా మార్చడం ఓ సవాల్. వ్యవసాయ అనుబంధ రంగాలను కూడా ప్రోత్సహించాలి. మహిళ కేంద్రంగా గ్రామీణ పరివర్తన అనే అంశాన్ని ఈ సర్వే పేర్కొంది. గ్రామీణ, వ్యవసాయ రంగాల్లో పెరుగుతున్న మహిళల పాత్రకు అనుగుణంగా తగిన పరిస్థితులు కల్పించకుండా, ఆర్థికాభివృద్ధిలో వారికి భాగస్వామ్యం కల్పించ కుండా అది ఎలా సాధ్యమవుతుంది. భూమి, నీరు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వారికి అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఇటీవల కాలంలో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగాయి. ఇవి మరింత పెరిగితే మన విదేశీ నిల్వలు తరిగిపోయి ఆర్థిక సర్వే అంచనాలు తలకిందుల వుతాయి. నిజానికి మోడీ ప్రభుత్వ తొలి మూడేళ్ల పాలనలోని వెసులుబాటు అంతా కారు చౌక ముడి చమురు ధరల నుంచి కలిగిన లబ్ధి ఫలితమే. ఇప్పుడా సౌకర్యం పోతే, దానిప్రభావం కరెంట్ ఖాతాలోటుపై, ద్రవ్యోల్బణంపై ఉంటుంది. పంచాయతీలను పటిష్ఠం చేయడంపై సర్వే చర్చించింది. రాష్ట్రాలు, స్థానిక సంస్థల పన్నుల వసూళ్లలో ప్రత్యక్ష పన్నుల వాటా గణనీయంగా తగ్గిపోతున్నదని సర్వే పేర్కొంది. టెలికం రంగంలో జియో రాకతో ఇబ్బందులొచ్చాయన్న ఆర్థిక సర్వే అందుకు స్పెక్ట్రం ఛార్జీలు తగ్గించాలని పరోక్షంగా సూచించడం కార్పొరేట్లకు లాభాల పంట పండించేందుకే దోహదం చేస్తుంది. మార్కెట్లు కుప్పకూలితే ఆర్థిక వృద్ధికి అవరోధమని సర్వే హెచ్చరించింది. స్టాక్‌మార్కెట్లు పెరగడం వృద్ధికి చిహ్నంకాదనే వాస్తవాన్ని పాలకులు గుర్తించాలి. ప్రమాదకరమైన బుడగ రూపాన్ని సంతరించుకున్న స్టాక్ మార్కెట్లు.. ఎప్పుడైనా పేలిపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే వృద్ధిరేటుతోపాటు లక్షలాదిమంది జీవితాలు ఛిన్నాభిన్న మవుతాయి. ఆర్థిక రంగంపై ఆ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ప్రపంచానికి ఈ అనుభవం ఉందని ఆర్థిక శాఖ ప్రధాన సలహాదారు, సర్వే రూపకర్త అరవింద్ సుబ్రమణియన్‌నే అభిప్రాయపడుతున్నారు. కాబట్టి సర్వే కలిగిస్తున్న ఆశలు కొత్తవేమీ కాదు, మోడీ ప్రవచించిన అచ్ఛేదిన్‌కు కొనసాగింపులాంటివే. ఈ నాలుగేళ్లలో సామాన్యులకు అచ్ఛేదిన్ ఆనవాలు కనిపించలేదు. నయా ఉదారవాద విధానాల దూకుడు అమలు చేయడం వల్ల అచ్ఛేదిన్ రావడం అటుంచి సామాన్యులకు మిగిలేది బురేదిన్ మాత్రమే!

చురక

పెద్దనోట్ల రద్దు ప్రజల
బతుకు మోడు పథం నేడు
భవిష్యత్తులో వృద్ధిరేటు
బాగుచేసే రథం చూడు

విత్తమంత్రి మాటలల్లో
విహరించే భ్రమల ఇల్లు
ఆర్థిక అభివృద్ధి పుల్లు
ఆకాశం హరివిల్లు

- వేల్పుల నారాయణ

అంతర్జాతీయం

విప్లవ క్యూబా ఆశాకిరణం డియాజ్ కనెల్


బుడ్డిగ జమిందార్

ప్రస్తుత క్యూబా అధ్యక్షుడు రాల్‌కాస్ట్రో పదవీకాలం ఏప్రిల్ నెలలో ముగియనుంది. 1959 క్యూబా విప్లవానంతరం అధ్యక్షు నిగా ఎన్నికైన ఫిడెల్ కాస్ట్రో 2008లో తన బాధ్యతలను సోద రుడైన తనతో విప్లవంలో పాల్గొన్న రాల్‌కాస్ట్రోకు అప్పజెప్పగా, ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో రెండు పర్యాయాలు అధ్యక్షపగ్గాలు స్వీకరించిన రాల్‌కాస్ట్రో రాజీనామా చేయనున్నారు. క్యూబా విప్లవానంతరం జన్మించిన మైగ్యూల్ డియాజ్-కనెల్ బెర్ముడెజ్ నూతన అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు చేపడతారని ప్రపంచ మీడియా అంతా రాస్తున్నది. 2013 సంవత్సరంలో మొదటి దేశ ఉపాధ్యక్షుడిగా డియాజ్-కనెల్ ఎన్నికైనారు. విద్యా వంతుడు, యూనివర్శిటీ ప్రొఫెసరుగా ఉంటూ క్యూబన్ కమ్యూనిస్టు ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న డియాజ్-కనెల్ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యునిగా ఉంటూ దేశంలోని కీలక నిర్ణయాల అమలులో విశేష కృషి చేస్తున్న వ్యక్తిగా పేరొందిన మనిషి. సోషలిజానికి ప్రత్యామ్నాయమంటూ లేదని ఎన్ని అడ్డంకులెదురైనా సోషలిస్టు బాటను క్యూబా వీడేదిలేదని నిర్మొహమాటంగా ఘంటాపథంగా సామ్రాజ్యవాదానికి వ్యతి రేకంగా చెబుతున్నారు. ఒక సాదాసీదా ఉపాధ్యాయ కుటుంబంలో పుట్టిన డియాజ్-కనెల్ క్యూబాదీవిలోని సెంట్రల్ ప్రోవిన్స్‌కు చెందినవారు.

ఎలక్ట్రానిక్స్ ఇంజనీరుగా విద్యనభ్యసించిన పిమ్మట క్యూబన్ రివల్యూషనరీ ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌లో సేవలనందించాడు. అటుపిమ్మట సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ మార్తా అబ్రేయ్‌లో ప్రొఫెసరుగా పనిచేసి యూనియన్ ఆఫ్ యంగ్ కమ్యూనిస్టులో నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. మధ్య క్యూబా ప్రోవిన్స్ సెంట్రల్ కమిటీ మొదటి కార్యదర్శిగా నియమితులయ్యారు. విల్లా క్లారా ప్రోవిన్స్ మొదటి కార్యదర్శిగా ఉంటూ అనేక నూతన సాంస్కృతిక కార్యకలాపాలుచేస్తూ, సాంస్కృతిక రంగంలో కొత్త ఆలోచనల్ని ప్రవేశపెట్టి ప్రజల మనసులను ముఖ్యంగా యువత హృదయాలను దోచుకొన్నాడితను. క్యూబన్ రాక్ సంగీతానికి బలమైన పునాదిని ఈయన వేయగలిగారు. 2009లో హవానాకు తన పరిధిని విస్తరించుకో గలిగారు, ఉన్నత విద్యాశాఖమంత్రిగా తన బాధ్యతల్ని సక్రమంగా అమలుపర్చుకోగలిగారు. 2012లో కౌన్సిల్ ఆఫ్ మినిస్టర్స్‌కు ఎన్నికైనారు. రాల్‌కాస్ట్రో 2013లో స్టేట్ కౌన్సిల్‌కు మొదటి ఉపాధ్యక్షునిగా డియాజ్ కనెల్‌ను నియమించుకొని కీలకమైన బాధ్యతల్ని అప్పజెప్పారు. అప్పటివరకూ ఈ పదవిలో మాచాడో నెంచ్యూరా ఉన్నారు. ఈయన క్యూబన్ విప్లవంలో ఫిడెల్ కాస్ట్రోతో పాల్గొన్న ఆదర్శవంత నాయకుడిగా పేరొందారు. 57 సంవత్సరాల వయస్సు గల డియాజ్-కనెల్ క్యూబా యువతకు ప్రీతిపాత్రుడు. యువతకు కావల్సిన సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి అవిరళ కృషి చేస్తుం టారు. కాలాన్నిబట్టి ఊసరవల్లెవలే రంగులు మార్చుతున్న సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కోవటానికి సామ్యవాద శిబిరం సాంకేతిక ఆర్థిక రంగాలతో పాటుగా సాంస్కృతికరంగంలో కూడా అభ్యుదయపథంలో ఒక అడుగుముందంజలో ఉండాలని విశ్వసించే యువ కమ్యూనిస్టు నాయకుడిగా డియాజ్-కనెల్ పేరుతెచ్చుకొన్నారు.

నిరాడంబరుడు

సోవియట్ యూనియన్ పతనానంతరం క్యూబా స్వావలం బనను ఆర్థికపరంగా నిలబెట్టుకోవటమనేది ఆనాటి అతి పెద్ద సవాలు. ఆ సమయంలో క్యూబా సెంట్రల్ ప్రోవిన్స్ నగరమైన సాంతాక్లారాలో మొదటి పార్టీ సెక్రెటరీగా ఉంటూ సైకిల్‌పై ప్రయాణం చేస్తూ అతి నిరాడంబర జీవితాన్ని సాగించేవారు. 'తను ఏమాత్రం ప్రచారం కోసంగాని, సానుభూతి కోసంగాని అలా జీవించలేదని తన తత్వమే అతి సామాన్యమానవుని నడవడికా భావమని' సీనియర్ జర్నలిస్టు జోస్ ఆంతోనియో అన్నారు. సైకిల్‌పైనే వెళ్లి ప్రభుత్వరంగ పరిశ్రమలను


రాల్‌కాస్ట్రోతో కనెల్

ఆకస్మికంగా తనిఖీ చేసేవారు. అవినీతి వ్యతిరేక మనస్తత్వం కలిగిన డియాజ్-కనేల్‌ను తన సైకిల్ ప్రయాణమే ఉన్నత శిఖరాలకు చేర్చుతుందని క్యూబన్లు అంటుంటారు.

వాక్‌స్వాతంత్రం - స్వేచ్ఛాయుత మీడియా కోసం పరితపిస్తూ, స్టేట్ మీడియాపై కట్టుదిట్టాలుండకూడదని కోరుకొనేవాడు. అతి కొద్దిమందికే ఇంటర్‌నెట్ అందుబాటులో ఉండే క్యూబాలో ఇంటర్‌నెట్ అందరికీ అందుబాటులోకి రావటానికి కృషిచేసి, ఇంటర్‌నెట్ ద్వారా కూడా సోషలిజాన్ని పటిష్టపర్చుకోవచ్చని నిరూపించాడని క్యూబన్ ప్రజలు అంటుంటారు. కమ్యూనిస్టు పార్టీలు నిర్మాణాత్మక విమర్శలు ఎప్పుడూ ఆహ్వానిస్తుండాలని డియాజ్-కనేల్ అంటారు. విషయాల్ని దాచటం ఉద్యమానికి మంచిది కాదని బహిరంగ చర్చ, తర్కం, వైవిధ్యం ద్వారా మాత్రమే సోషలిస్టు సమాజం ప్రగతిపథంలో ముందుకు సాగుతుందంటారు.

సామ్రాజ్యవాదుల పక్కలో బల్లెం

ఇటీవలికాలంలో వెనుజులా ప్రభుత్వంపై అమెరికా సామ్రాజ్యవాదం ఆంక్షలు విధించి ఒత్తిడి తీసుకొస్తూ, మరొకవైపు క్యూబన్ టూరిస్టు పరిశ్రమను నీరుగార్చేందుకు ట్రంప్ ప్రయత్నించిన సందర్భంలో "ఈ మధ్య జరుగుతున్న ప్రపంచవ్యాప్త ఘటనలు సామ్రాజ్యవాదాన్ని విశ్వసించలేమని ధృవపరుస్తున్నాయి. సామ్రాజ్యవాదాన్ని ఎప్పుడూ విశ్వసించ లేము. అణువంత కూడా ఎప్పుడూ నమ్మలేం" అని డియాజ్ - కనేల్ తన వైఖరిని స్పష్టపరిచారు.

క్యూబా విప్లవానంతరం బొలీవియాలో విప్లవ సాధనకు ప్రాణాలొడ్డిన ఎర్నెస్టో చే-గువేరా 50వ వర్థంతి సందర్భంగా మాట్లాడిన డియాజ్-కనేల్ అమెరికా-క్యూబా సంబంధాలపై నిర్మొహమాటంగా మాట్లాడి "క్యూబా తన సార్వభౌమాధికార విషయంలోనూ - స్వావలంభన విషయంలోనూ రాజీపడే ప్రసక్తేలేదనీ, షరతులతో కూడిన చర్చలపై అమెరికాతో చర్చించే అంశమే ఎదురుకాదని" స్పష్టపర్చారు. ఐక్యరాజ్య సమితిలో క్యూబాను ఉద్దేశించి డోనాల్డ్ ట్రంప్ ప్రసంగిస్తూ క్యూబాలో పెట్టుబడిదారీ విధానం, ప్రజాస్వామ్యం (పెట్టుబడిదారీ) వచ్చేంతవరకూ క్యూబాపై ఆంక్షలు ఎత్తివేయ బోమని అన్న సందర్భంగా పై అభిప్రాయాలను డియాజ్-కనెల్ వ్యక్తపరిచారు. అంతేగాక "క్యూబన్ పరిస్థితులకు అనుకూలమైన, ప్రజలకు అవసరమైన మార్పులను మా క్యూబా ప్రజలు మాత్రమే తీసుకొస్తారని" డియాజ్-కనెల్ స్పష్టపరిచారు.

క్యూబన్ విప్లవం తర్వాత 56 సంవత్సరాలకు 2016లో ఒబామా ప్రభుత్వం క్యూబాతో దౌత్య సంబంధాలను నెలకొల్పింది. ఆర్థిక ఆంక్షలను ఎత్తివేస్తానంది. కానీ ట్రంప్ ఇరుదేశాల మధ్యవున్న సంబంధాలను మొదటికే తీసుకొచ్చి ఆంక్షలను తొలగించటం లేదు. సామ్రాజ్యవాద కార్పోరేట్ల లాబీయింగ్ ఒత్తిడి తెస్తుంది. అమెరికా ముఖద్వారంలో వున్న సోషలిస్టు క్యూబాను అవస్థపాలు చేయటానికి అనేక విధాలుగా అమెరికా తంటాలు పడుతోంది. వీటన్నిటిని లెక్కచేయక మొక్కవోని దీక్షతో సోషలిస్టు సమాజ పటిష్టతకు క్యూబా మడం తిప్పని పోరాటం చేస్తోంది. ఈ నేపథ్యంలో డియాజ్ కనెల్ అనుభవాలు, పోరాట పటిమ క్యూబా సమసమాజానికి, ప్రపంచ సోషలిస్టు ప్రవాహానికి ఆశా కిరణాలై విరాజిల్లుతాయని కోరుకుందాం.

వ్యాస రచయిత : ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యవర్గ సభ్యులు. సెల్ : 9849491969

వి-మెయిల్

కొంత భరోసా -కొంత నిరాశ ఆర్థిక సర్వే ఫలితాలు

ఈ యేడు ఆర్థిక సర్వే ఫలితాలు చూస్తే రోగితో వైద్యుడు 'ఏం ఫర్వాలేదు. అంతా సర్దుకుంటుంది' అన్న తరహాలో ఉన్నాయి. వైద్యుడి మాటలతో భరోసా కలిగినా,ఇదంతా తనకి ధైర్యం చెప్పడంలో భాగమే కదా అన్న అనుమానమూ వదలదు. ఆర్థిక సర్వే ఈ సంవత్సరం స్థూల జాతీయోత్పత్తి 6.5 శాతం గా ప్రకటించి,వచ్చే యేడు 7నుండి 7.5శాతంగా ఉండొచ్చని,తద్వారా ప్రపంచంలో త్వరితంగా ఆర్థికాభివ ృద్ధి సాధిస్తున్న దేశంగా తిరిగి కొనసాగగలదని ఆశాభావం వెలిబుచ్చింది.

పెరిగిన పరోక్ష పన్నులు చెల్లించేవారి సంఖ్య, ఎగుమతులు, విదేశీ పెట్టుబడులను ఆర్థిక పుష్టికి కారణంగా చూపింది.అయితే వ్యవసాయ రంగానికి,విద్య,ఉపాధి రంగాలకు చెయ్యాల్సిన మేలు ని కూడా గుర్తుచేసింది. ఈ మధ్యనే విడుదలైన ఆక్స్ ఫామ్ సంస్థ నివేదిక ప్రకారం గత సంవత్సరం సంపదలో 73 శాతం ఒక్కరి పద్దే పోగు పడగా దేశ జనాభాలో సగం మంది కేవలం ఒక్క శాతం ఆదాయాభివ ృద్ధి చూడగలిగారు.లెక్కలు ఖచ్చితంగా ఇవే కాకపోవచ్చు కానీ ఆదాయం పంపిణీ సరళి ఎలా వుందో తెలియజేస్తోంది.కోట్లాది పేదల జీవనాన్ని ఏమాత్రం మెరుగుపర్చలేని అభివ ృద్ధి ఆరోగ్యకరం కాదు.అసమానతల్ని తగ్గించేలా ప్రభుత్వం ఆలోచించాలి.అధిక జనాభా ఆధారపడిన వ్యవసాయ రంగం వివిధ కారణాలతో కుదేలై ఉండడం సర్వే గుర్తించింది కావున ఆ రంగం మెరుగుపడి,తద్వారా దేశ ఆర్థిక పుష్టికి ఊతమిచ్చేలా చర్యలుండాలి. యువశక్తి అధికంగా ఉన్న దేశంలో విద్య,కౌశలాలు,ఉద్యోగాల స ృష్టి లో ముందుండడం ద్వారానే ఫలితముంటుంది.ఈ విషయాల్లో ఎంత వెనకబడి ఉన్నామో వివిధ సర్వేలు పట్టి చూపిస్తున్నాయి.విదేశీ పెట్టుబడులు,ఎగుమతుల్లో వ ృద్ధి సాధించడం అన్నది మన దేశం చేసే ప్రయత్నంతో పాటు పై దేశాల విధానాలపై ఆధారపడి ఉంటాయి.కాబట్టి వాటిపై ద ృష్టి పెడుతూనే అధికంగా ఆధారపడడం మానేయాలి.అలాగే మన చేతిలో లేని అంతర్జాతీయ పరిణామాలూ, ఆయిల్ ధరలూ.వాటిపై అప్పటికప్పుడు స్పందించడం తప్ప చేసేదేమీ లేదు.ఒక ఆశావహ ద ృక్పథంతో స్థిరమైన,సమగ్రమైన ఆర్థికాభివ ృద్ధి సాధించడానికి వెసులుబాటు ఉంది అన్న నమ్మకంతో ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోడానికి ఈ సర్వే దారి చూపుతుంది.అవకాశం సద్వినియోగ పర్చడం ప్రభుత్వం చేతిలో ఉంది.

- డా.డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీ పురం.

తెలంగాణ కుంభమేళా - మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర

కామిడి సతీష్‌రెడ్డి

"పచ్చని అడవిలో ఇసుకవేస్తే రాలనంత జనం. కంకవనం తోడుగా కుంకుమ భరిణెలో గద్దెలకు పయనం. కోయ పూజారులతో కొలువైన చిలుకల గుట్ట దేవగణం. తడిబట్టల స్నానాలతో పూనకాల ప్రభంజనం. నిలువెత్తు బెల్లాలు తల్లులకు మొక్కులుగా సమర్పణం. సంప్రదాయ వేషధారణల నృత్యాల సమ్మేళనం. కోరిన కోర్కెలు తీర్చే తెలంగాణ రాష్ట్ర ప్రజల కొంగు బంగారం, మేడారంలోని సమ్మక్క-సారలమ్మల ప్రాంగణం. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అటవీ ప్రాంతంలో గల తాడ్వాయి మండలంలోని మేడారం గ్రామంలో కొలువైన సమ్మక్క-సారలమ్మల జాతర తెలంగాణ కుంభమేళా. జనవరి 31 నుండి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరుగనుంది. జాతరకు సుమారు కోటిన్నరకు పైగా భక్తులు తరలివచ్చి సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుంటారు. ప్రభుత్వం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించింది. భక్తులను వివిధ ప్రాంతాల నుండి తరలించడానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సుమారు 4,200 బస్సులను తిప్పనుంది. దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి పొందిన సమ్మక్క- సారలమ్మ ఆదివాసీల జాతరకు మన తెలంగాణ నుండే గాక ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుండి భక్తులు భారీగా తరలివచ్చి వీరవనితలకు మొక్కులు చెల్లించుకుంటారు. దేవతల దర్శనానికి ముందు జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసేందుకు తగిన నీరు లేనందున స్నానఘట్టాల వద్ద ఏర్పాటు చేసిన బ్యాటరీ ఆఫ్ ట్యాప్‌ల వద్ద స్నానాలు చేసేందుకు పోటీపడతారు. అమ్మవార్లకు భక్తులు మొక్కులు సమర్పించేందుకు ఎత్తు బంగారం (బెల్లం), పసుపు, కుంకుమలతో పాటు తల్లుల గద్దెల వద్దకు వచ్చి కానుకలు అప్పగించడం మేడారం సాంప్రదాయం. అధికశాతం భక్తులు 'కోళ్లు, మేకలు, గొర్రెలను' బలి ఇచ్చి మొక్కు చెల్లించుకుంటారు. కుటుంబాలతో సహా వచ్చి తలనీలాలు సమర్పించుకుంటారు. దర్శనానికి వచ్చే భక్తుల మొక్కులు చెల్లించుకున్న అనంతరం జాతర పరిసరాలలోని చిలుకలగుట్ట, జంపన్నవాగు, శివరాంసాగర్ వంటి ప్రాంతాలలోని చెట్లనీడన సేద తీరుతారు. అటు కాళేశ్వరం, ఇటు ముల్లెకట్ట వద్ద గోదావరిపై వంతెనలు ఏర్పడడం వల్ల మహారాష్ట్ర ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం వుంది. ఈ సంవత్సరం సుమారు కోటిన్నరకు పైగా భక్తులు అమ్మవార్లను (వీరవనితలను) దర్శించుకోవచ్చని అంచనా. తెలంగాణ సీఎం కేసీఆర్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్‌లు నరసింహన్, విద్యాసాగర్‌రావు ఫిబ్రవరి 2వ తేదీన వీరవనితలను దర్శించుకోనున్నారు.

ఎవరీ సమ్మక్క-సారక్క

గిరిజనులు దేవతామూర్తులుగా కొలిచే, ఆరాధించే సమ్మక్క-సారలమ్మలు ఇద్దరు తల్లీకూతుళ్లు. గిరిజనుల హక్కుల కోసం ఎదురుతిరిగి పోరాడిన వీరవనితలు. 12వ శతాబ్దంలో కరీంనగర్ జిల్లా పొలవాస ప్రాంతాన్ని గిరిజన దొర మేడరాజు పాలిస్తుండేవాడు. అతనికి సంతానం లేదు. ఒకనాడు వేటకు వెళ్లి అడవిలో పులుల మధ్య ఆడుకుంటున్న చిన్నపిల్లను చూశాడు. దేవుడిచ్చిన వరంగా భావించి ఆ పాపను తన ఇంటికి తెచ్చి సాకుకున్నాడు. సమ్మక్క అని పేరు పెట్టాడు. సమ్మక్క చిన్నప్పటి నుండి చెట్ల వైద్యం చేస్తూ తోటి గిరిజనులను రక్షిం చేది. ఆమెకు మహిమలు వున్నా యని, దేవతామూర్తి అని గిరిజ నులు భావించేవారు. ఆమెకు పెళ్లి వయస్సు వచ్చింది. మేడ రాజు మేనల్లుడు పగిడిద్ద రాజు. ఇతను కాకతీయులకు సామంత రాజుగా వుండి మేడారంను పాలిస్తుండేవారు. పగిడిద్దరాజుకు సమ్మక్కను ఇచ్చి వివాహం





చేశారు. సమ్మక్క మేడారం రాజ్యంలోకి అడుగుపెట్టింది. వీరికి నాగులమ్మ, సారలమ్మ అనే ఇద్దరు బిడ్డలు, జంపన్న అనే కుమారుడు పుట్టారు. సమ్మక్క ప్రజల కోసం ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టింది. కాకతీయ రాజులతో వీరు పోరాటం చేశారు. అతిపెద్ద సామ్రాజ్యమైన కాకతీయరాజు సైన్యం ముందు పగిడిద్దరాజు సైన్యం నిలబడలేకపోయింది.

ఒక్కొక్కరు చొప్పున అందరూ వీరమరణం పొందారు. వీరోచితంగా పోరాడుతూ గాయపడిన జంపన్న పక్కన వున్న సంపెంగ వాగులోకి దూకి వీరమరణం పొందాడు. పగిడిద్దరాజు కూడా శత్రువుల చేతిలో హతం అయ్యాడు. చివరకు ఒక్క సమ్మక్క మాత్రమే మిగిలింది. కత్తిపట్టి వీరోచితంగా పోరాడుతూ శత్రుసైన్యాలను ఎదుర్కొంది. యుద్ధంలో ముందుండి పోరాడినారు. ఆమె పోరాటాన్ని చూసి శత్రుసైన్యం వెనుక నుండి వచ్చి దెబ్బకొట్టారు. ఒక సైనికుడు దొంగచాటుగా వెనుక నుండి వెళ్లి బల్లెంతో సమ్మక్క వీపులో పొడిచాడు. గాయపడిన సమ్మక్క గుర్రం మీద ఈశాన్య దిక్కున వున్న చిలుకల గుట్టమీదికి వెళ్లింది. ఎంత వెదికినా ఎవరికీ కనిపించలేదు. ఆమె కోసం వెతుకుతున్న గిరిజనులకు ఓ నెమలి, నారచెట్టు, దానికింద ఓ పుట్ట, పుట్టమీద కుంకుమ భరిణె కనిపించింది. ఆ భరిణెలో పసుపు, కుంకుమ, చెట్ల మూలికలు కనిపించాయి. సమ్మక్క తల్లి దేవతా రూపం పొందిందని గిరిజనులు నమ్మారు. ప్రతీ రెండు సంవత్సరాలకోసారి ఈ జాతర మూడు నుండి నాలుగురోజులపాటు జరుగుతుంది.

"జయశంకర్ భూపాలపల్లి జిల్లాగా ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొదటి జాతర. గత రెండునెలల నుండి వివిధ ప్రాంతాల నుండి సుమారు 30 లక్షలకు పైగా భక్తులు సమ్మక్క - సారలమ్మలకు తమ మొక్కులు చెల్లించారు. జాతరను విజయవంతం చేయడానికి మంత్రులు వరుస సమీక్షలు నిర్వహించారు. జిల్లా ఇంఛార్జ్ కలెక్టర్ కర్ణన్, సబ్ కలెక్టర్ జాతమ్ మేడారంలోనే ఉంటూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పనులను పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేడారం జాతరకుగాను రూ.85 కోట్లను కేటాయించింది. ఆలస్యమైనా అన్ని అభివృద్ధి పనులు చకచకా సాగాయి. మరుగుదొడ్లు మంచినీటి సౌకర్యం, బస్సుల రాకపోకలకు వన్‌వేను ఏర్పాటుచేశారు. సుమారు 10 వేలమంది పోలీసులు జాతర బందోబస్తులో నిమగ్నమైనారు. జిల్లా ఎస్పీ భాస్కరన్ మేడారంలోనే తిష్టవేసి, బందోబస్తును పర్యవేక్షిస్తు న్నారు. ప్లాస్టిక్ వస్తువులు వాడొద్దని ప్రచారం చేశారు. వివిధ సెక్టోరియల్ అధికారులు తమకు కేటాయించిన మార్గాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం మేడారం జాతరకు జాతీయహోదా కల్పిం చడంలో తాత్సర్యం చేస్తోంది. తెలంగాణా కుంభమేళాగా కీర్తి గడించిన సమ్మక్క - సారలమ్మ జాతరకు ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు మూడు రోజులు సెలవులు ప్రకటించాలి. సెలవులు ప్రకటిస్తే విద్యార్థులు కూడా వారి కుటుంబ సభ్యులతో మేడారం జాతరకు వెళ్ళే అవకాశం వుంటుంది. అధికారులందరూ సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలి. పోలీసుశాఖ ట్రాఫిక్ జాం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

వ్యాస రచయిత సెల్ : 9848445134

Downloaded From Telugu e News App play.google.com/store/apps/details?id=com.roshan.enews

విశాలాంధ్ర
బతుకు
The Life
బుధవారం
31 జనవరి 2018

వంటింటి చిట్కాలు





- క్యాబేజి ఉడికించేటపుడు వాసన రాకుండా ఉండాలంటే చిన్న అల్లం ముక్క వెయ్యాలి.
- కత్తిపీటకు ఉప్పురాయడం వల్ల పదునుగా తయారవుతుంది.
- దుస్తులపై ఇంకు మరకలు పోవాలంటే నిమ్మరసంగానీ, టూత్ పేస్ట్ గానీ వేసి రుద్దాలి.
- ఎండు కొబ్బరిచిప్పను కందిపప్పుడబ్బాలో వేసి నిల్వ ఉంచితే పప్పు పాడవదు.
- కాకరకాయ ముక్కలకు కొంచెం ఉప్పురాసి, నీరు చల్లి గంట సేపు ఉంచితే చేదు పోతుంది.
- వెల్లుల్లిపాయను మెత్తగా దంచి కొంచెం నీటితో కలిపి బొద్దింకలు వచ్చేచోట ఉంచితే అవి ఆ ప్రాంతానికి రావు.



నివాళి !

సోమవారం (జనవరి 29) గౌరీలంకేష్ జయంతి సందర్భంగా బెంగళూరులో ఆమె సోదరుడు ఇంద్రజిత్ లంకేష్ ఆమె ఫొటో ఎదుట కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పిస్తున్న దృశ్యం. కన్నడ వారపత్రిక 'లంకేష్ పత్రికే'కు సంపాదకురాలిగా ఉన్న గౌరీ లంకేష్‌ను కొంతమంది దుండగులు సెప్టెంబరులో కాల్చి చంపిన విషయం విదితమే. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలూ వెల్లువెత్తాయి. గౌరీ లంకేష్ హత్య జరిగి ఐదు నెలలు గడిచినా ఇంతవరకూ హంతకులు ఎవరనేది తేల్చలేదు. ఏ ఒక్కరిని అరెస్టు చేయలేదు.



పోరాడితే... పోయేదేముంది..

ప్రవీణ్ బాగా చదువుకున్న వ్యక్తి. ఒక ప్రయివేట్ సంస్థలో ఉన్నత ఉద్యోగంలో ఉన్నాడు. భార్య ఆశ కూడా ఉన్నత విద్యావంతురాలే. ఆమె కూడా ఉద్యోగం చేస్తోంది. అయినా ప్రవీణ్ ఎప్పుడూ ఆశను మనశ్శాంతిగా ఉండనిచ్చేవాడు కాదు. ఆమె ఒంటి రంగు నలుపు అనీ, తనకు సరిపడా ఎత్తులేదని సూటిపోటి మాటలతో వేధించేవాడు. వాళ్ళకు పుట్టిన ఇద్దరు పిల్లలు కూడా ఆమె రంగే రావటం అతని అసహనం మరింత పెరిగింది. అయినా ఆమె పల్లెత్తు మాట అనేది కాదు. అతని మాటలన్నీ భరించేది. ఎప్పుడూ మౌనంగా తన పని తాను చేసుకుపోతూనే ఉండేది. కనీసం తన కన్నవారికి కూడా ఏ విషయాలూ తెలియనిచ్చేది కాదు. ఆయనే మారతాడులే అని ఊరుకునేది. జీవితం మీద ఆశతో ఎదురుచూసేది. కాలక్రమంలో ప్రవీణ్‌లో మార్పు రాకపోగా గొడవలు మరింత ఎక్కువయ్యాయి. భార్యను ఏమిచేసినా అడిగేవారు లేరని, ఆమె పుట్టింటి వాళ్ళు కూడా తనను ఏమీ చేయలేరనే ధీమాకు వచ్చాడు. వారు పరువుకు ప్రాధాన్యం ఇచ్చే మనుషులని, తానేం చేసినా పర్వాలేదని అనుకున్నాడు. దీంతో ప్రవీణ్ పైశాచికత్వం బాగా పెరిగిపోయింది. ఎంతలా పెరిగిందంటే తన అసహనాన్ని మాటల నుంచి చేతలదాకా తీసుకువెళ్ళాడు. భార్య అతను పెట్టే హింసను భరించలేనిదిగా ఉన్నా బయటికి వస్తే నలుగురిముందు పరువుపోతుందని, పిల్లలు అన్యాయం అవుతారని, ఈ వయసులో భర్తను వదిలేసి బయట బతకలేననే భయంతో అన్నీ భరిస్తూ జీవితాన్ని కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఒకరోజు ప్రవీణ్ కొట్టిన దెబ్బలు తగలరానిచోట తగిలి ఆశ ప్రాణం పోయింది. అయినా ఏ మాత్రం భయపడకుండా తన తప్పును కప్పిపుచ్చుకుని అందరినీ లేనిపోని మాటలతో నమ్మించాడు ప్రవీణ్. ఆశను తాను ఎంతో ప్రాణంగా చూసుకున్నానని, తనను ఒంటరివాడిని చేసి వెళ్ళిపోయిందని కల్లబొల్లి ఏడుపులతో ఆమె పుట్టింటివారినీ నమ్మించాడు. అందరూ అదే నిజమనుకున్నారు. నిజం గడపదాటదు కానీ, అబద్ధం సెకనులో అరవై ఊళ్ళు వెళ్ళిపోతుంది అంటారు. కొన్నాళ్ళ తరువాత, పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకున్నాక పిల్లలను ఆశ పుట్టింటివారి దగ్గరే వదిలేసి మరో అమ్మాయిని వివాహం చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. ఇది ఒక్క ఆశ జీవితం మాత్రమే కాదు. ఆశలాంటి ఎందరో మహిళల జీవితాలు ఇలాగే ఉన్నాయి. ఎంతోమంది ఇలాంటి గృహహింస బాధితులుగా ఉన్నారు. బయట ప్రపంచానికి తెలిసినవి కొన్నే....వెలుగులోకి రానివి ఇంకెన్నో ఉన్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది గృహిణులు, మహిళలు శారీరక, మానసిక, లైంగిక, ఆర్థిక హింసలకు బలవుతున్నారు. తల్లి కడుపును చీల్చుకొని బయటపడక ముందు నుంచే బంగారు తల్లికి లెక్కలేనన్ని కష్టాలు మొదలవుతున్నాయి. కడుపులో నలుసుగా ఉన్నప్పటి నుంచే, పిండ దశ నుంచే ఒక్కోదశలో ఒక్కోరకం హింసను అనుభవిస్తోంది. వివాహానంతరం చెప్పుకోలేని హింస. అదే గృహహింస.

చాలామంది పురుషులు నా విజయానికి కారణం నా భార్యే అంటూ ఉపన్యాసాలు దంచేస్తూ ఉంటారు. వాళ్ళ అసలు రూపం మాత్రం వేరుగా ఉంటుంది. సమానత్వం అంటూ బయట ఉపన్యాసాలు చెప్పే పురుషులు ఇంట్లో మాత్రం అవి పాటించరు. ఇలాంటివాళ్ళు బయట ప్రపంచానికి తెలీకుండా భార్యపై గృహహింసకు పాల్పడుతూ ఉంటారు. ఇది అందరి విషయంలో కాదుగానీ కొంతమంది విషయంలో నూటికి నూరుపాళ్ళూ నమ్మాల్సిన నిజం. "అతని మాటలు వేదిక మీద ఉపన్యాసాల వరకే, వేదిక దిగిన తరువాత అతనూ మామూలు పురుషుడిలానే ప్రవర్తిస్తాడు" అని ఆవేదన చెందే గృహిణులు ఎంతోమంది ఉన్నారన్నది పచ్చి వాస్తవం.

గృహహింస బాధితులకు రక్షణనిచ్చే చట్టాలూ ఉన్నాయనే విషయమే చాలామందికి ఇప్పటికీ తెలియదు. ఇదే విచారించాల్సిన విషయం. దీనిమీద మరింత విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. బాధితులకు అడుగడుగునా అండగా నిలబడాల్సిన ఆవశ్యకతా ఉంది. మనదేశంలో గృహహింసను ప్రత్యేక నేరంగా మొదటిసారి పరిగణించింది 1983లో. ఆ ఏడాదే దీనిని చట్టాల్లోకి తీసుకొచ్చారు. ఇండియన్ పీనల్‌కోడ్‌లో సెక్షన్ 498-ఎ చేర్చారు. దీని ద్వారా భర్త లేదా అతని



కుటుంబం భార్య మీద చేసే క్రూరత్వం ఒక ప్రత్యేకమైన నేరంగా పరిగణనలోకి తెచ్చారు. అయితే ఈ చట్టం కొంత నిరుపయోగం అవుతుందని, కొంతమంది అమాయకులు కూడా బలవుతున్నారని ఒక సర్వే తేల్చింది. గృహహింసను కొలవడానికి నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ఒక పరిమాణాన్ని నిర్ణయించింది. ఆ పరిమాణం పేరు కాన్‌ఫ్లిక్ట్ టాక్టిక్ స్కేల్‌గా చెబుతారు. ఈ పరిమాణాన్ని ఉపయోగించి హింసకు గురవుతున్న వారి బాధలను గుర్తిస్తారు.

గృహహింసను భరిస్తున్న మహిళల్లో నిరక్షరాస్యులతోపాటు విద్యావంతులు, ఉన్నతోద్యోగాలు చేసేవారు కూడా ఉన్నారంటే ఆశ్చర్యంలేదు. నిరక్షరాస్యులతో పోల్చుకుంటే విద్యావంతులు, ఉద్యోగస్తుల పరిస్థితి కొంత మెరుగని చెప్పుకోవచ్చు. ఎందుకంటే కొంతలోకొంత వీరికి చేస్తున్న ఉద్యోగం, సాటి ఉద్యోగులు, స్నేహితులు, పరిసరాలు కొంత ఓదార్పునిస్తాయనటంలో ఎటువంటి సందేహంలేదు.

తను ఉద్యోగం చేసుకుంటున్నా ఆర్థిక అవసరాలకు అన్ని రకాలుగా భర్తమీదే ఆధారపడుతున్న మహిళలు ఎంతోమంది. ఎన్నేళ్ళు గడిచినా ఈ పరిస్థితుల్లో మార్పు రాకపోవడం శోచనీయం. మరో రకమైన ప్రాణాంతక గృహహింస తాగుబోతు భర్త పెట్టే హింస. తాగుబోతు భర్త కారణంగా 40 శాతంమంది స్త్రీలు మానసిక, శారీరక హింసకు గురవుతున్నారు. ఆ...తాగినపుడే కదా! మామూలుగా ఉంటే బాగానే ఉంటున్నాడుగా అంటారు కొంతమంది. మద్యపానం చేసినపుడు వారువాడే పదజాలం ఎంత భరించరానిదిగా ఉంటుందంటే సున్నిత హృదయులను ఆత్మహత్యలకు పురికొల్పేంతగా. ఈ పరిస్థితుల కారణంగానే చాలామంది మానసికంగా కుంగిపోతుంటారు. చెప్పేవారికేం తెలుసు భరించేవారి బాధ అన్నట్లుగా కొంతమంది ఎటు చెప్పుకోలేక లోపల్లోపల కుమిలిపోతుంటారు. ప్రతి స్త్రీకి ఓర్పు, సహనం ఉంటుంది. అందుకే స్త్రీని క్షమయాధరిత్రీ అన్నారు. కానీ ఎంతవరకు..భరిస్తుంది. దేనికైనా ఒక హద్దు ఉంటుంది.

భూమిలో కూడా ఒత్తిడి ఎక్కువైతే భూకంపాలు, సునామీలు వస్తాయి. అలాగే స్త్రీకి సహనం, ఓర్పు నశిస్తే ఆ ప్రళయం మరోవిధంగా ఉంటుంది. మౌనంగా భరిస్తున్నారు కదాని మరింత హింసకు గురిచేయడం తగదు. సమాజం స్త్రీ చుట్టూ అల్లిపెట్టిన సంప్రదాయాల వల చాలా గట్టిది. స్త్రీలు ఈ వలను ఛేదించుకొని బయటకు రాలేకపోవడమే ఇక్కడున్న అసలు సమస్య. సమాజం, సంప్రదాయాలు, పిల్లలు, పరువు ప్రతిష్ఠ అంటూ స్త్రీలు హింసను భరిస్తూ బతికేస్తున్నారు. కన్నవారు, తోబుట్టువులు కూడా తమ ఇంటి ఆడపిల్లలకు ఆపద వచ్చినపుడు కొండంత అండగా మేము ఉన్నాము అనే భరోసాను అందించాలి. పటిష్టమైన భద్రతను కల్పించాలి. ఇలాంటి భరోసా, భద్రతను ప్రతి ఆడపిల్లా తన తోబుట్టువుల నుంచి ఆశిస్తుంది.

సంప్రదాయాలు, పద్దతుల పేరు చెప్పి ఎలాంటి బాధలనైనా భరించాలని చెప్పడం సబబు కాదు. భర్తను కాదని మహిళలు ఒంటరి జీవితం గడిపేందుకు సిద్ధపడితే వారికి కావలసిన అండదండలు అందించేంతగా మన సమాజం ఎదగాలి, మారాలి. అన్యాయాన్ని, హింసను ప్రతిఘటించేందుకు మహిళలు ముందుకు రావాలి. అన్ని రంగాలలో మహిళలు ముందంజలో ఉంటున్నారని కీర్తిస్తున్నారు. ఏవైనా కీలక బాధ్యతలు అప్పగిస్తే మహిళలే సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. నిజమే! అన్నింటిలో ముందు ఉండే మహిళలు ఇంటి బాధలను భరించటంలోనూ ముందే ఉంటోంది. అత్యాధునిక యుగంగా చెప్పుకుంటున్న ఈ కాలంలోనూ ఇంటా, బయటా హింస తప్పటం లేదు. నాలుగ్గోడల మధ్య, అంధకారంలో బందీగా కూర్చుని న్యాయం కోసం అరిస్తే ఆడవాళ్ల బతుకుల్లో వెలుగురాదు. అందుకే చీకటిలోంచి వెలుగులోకి వెళ్ళాలి. ఆ వెలుగే స్త్రీల నరాల్లో నెత్తురై ప్రవహించాలి. చేతుల్లో దివిటీల్లా మారాలి. ఇంటా, బయటా ఆ వెలుగు ప్రజ్వరిల్లాలి. మరెంతోమంది స్త్రీలకు స్ఫూర్తినిచ్చేంతగా ప్రతి మహిళ ఆలోచనల్లో మార్పు రావాలి. సమస్యలను ఎదిరించి నిలబడేందుకు సిద్ధం కావాలి. అంతవరకూ మహిళల జీవితాల్లో మార్పు రాదు. గృహహింస నుంచి విముక్తి ఉండదు.

- టి.యోగిత



దోమలకాయిన్‌తో అన్నీ నష్టాలే!

ఇప్పుడు ఎక్కడ చూసినా దోమలే. గ్రామాలు, పట్టణాలు, నగరాలు ...ఇలా ఎక్కడ చూసినా దోమల బెడదే. వీటి బారినుంచి తప్పించుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. ఇందులో భాగంగా వచ్చిన మార్కెట్ పోకడలు, వ్యాపార తంత్రాలు ఎన్నో. ఇందులో భాగమే ఆల్‌అవుట్, గుడ్‌నైట్ మందులు, మస్కిటో కాయిల్స్. చాలామంది రోజూ ఇళ్ళల్లో నుంచి దోమలు పోయేందుకు ఈ మస్కిటో కాయిల్స్ వెలిగిస్తూ ఉంటారు. వీటితో దోమలు పోవడం మాటేమోగానీ వచ్చే అనారోగ్యాలు మాత్రం చాలానే ఉన్నాయి. వీటి గురించిన అవగాహన చాలా అవసరం

ఇవి ముఖ్యంగా కంటిచూపును దెబ్బతీస్తాయి. ఊపిరితిత్తులను నాశనం చేస్తాయి. ధూమపానం శ్వాస సంబంధిత సమస్యలకు మూలం అంటారు కానీ. ఈ దోమల కాయిల్స్ ధూమపానాన్ని మించిన నష్టాన్ని తీసుకొస్తాయని ఆరోగ్య నిపుణులే చెబుతున్నారు. సిగరెట్లు కాల్చడం కన్నా ఒక్క దోమ కాయిన్ వెలిగిస్తే జరిగే నష్టం తీవ్రతే ఎక్కువట. దీనినుంచి వచ్చే పొగ ఊపిరితిత్తుల్లోకి చొరబడి శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు దారితీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఈ విషయం వైద్య పరిశోధనల్లో వెల్లడైంది కూడా. ఈ పొగ వల్ల శ్వాసకోశ వ్యాధులే కాదు నాడీవ్యవస్థ దెబ్బతింటుంది. దీనివల్ల చివరకు కంటిచూపును కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఇన్ని నష్టాలు, ఇన్ని రకాల అనారోగ్యాలు కలిగించే ఈ దోమల కాయిల్స్‌ను వాడడం అవసరమా? ఆలోచించుకోండి. దీనిని వెలిగించడం కంటే ఫ్యాన్లు వేసుకోవడమే ఉత్తమమని విశ్లేషకులు సలహానిస్తున్నారు. పెద్దలకే ఇన్ని నష్టాలు కలిగించే ఈ మస్కిటో కాయిల్స్ పిల్లలపై ఇంకెంత ప్రభావం చూపిస్తాయో కదా! ఇది ఆరోగ్యానికి ముఖ్యంగా పిల్లలకు ఎంతమాత్రం మంచిది కాదని వైద్యులే హెచ్చరిస్తున్నారు.

Downloaded From Telugu e News App play.google.com/store/apps/details?id=com.roshan.enews





డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

ఒకరినొకరం ప్రేమించి, మోహించి పెళ్ళి చేసుకున్నాం. ఇద్దరమూ...కొద్దో గొప్పో చదువు కొన్నవాళ్ళం. ధర్మేచ - అర్థేచ - కామేచ - కలిసే సంసారం ఈడ్చుకుపోతున్నాం. మొదట్లో కలతలూ, గిల్లికజ్జాలు వచ్చేవి. ఆ ప్రణయ కలహాలూ, సరిపెట్టు కోవడమే ఒక పరమానందంగా వుండేది. సరిపెట్టు కుని ఆనం దించేవాళ్ళం. తరువాత - అభిప్రాయ భేదాలు-తర్జన భర్జనలు వచ్చినా - అప్పుడూ సర్దుకునే వాళ్ళం. ఆ సర్దుకుపోవడమే ఒక సంతోషంగా వుండేది. ఖద్దరూ - సత్యాగ్రహం - అందులో కూడా ఏదో వొకమోస్తరు సంసార పక్షంగానూ సరదా గానూ రాజీపడ్డామూ అనుకునేసరికి - మళ్ళీ నేనే యీ ఎన్నికలలో నిలబడడం వొకటి లేవదీశాను.

(నిన్నటి సంచిక తరువాయి)

ఇప్పుడు నీతి - సత్యం - ధర్మం - లక్ష్యం - సాధనం - అని ఇవన్నీ తీసింది శాంతం! నాదే పొరపాటు. నేనిప్పుడీ చట్ట సభలో కూర్చోకపోతే నాకొచ్చిన లోటేమిటి? బ్యాంక్‌లో పది లక్షలున్నాయి కదా - తండియార్పేటలో కొబ్బరి తోట - తేనాం పేటలో బంగళా - ఎంత చచ్చు ధరలు కట్టినా - రెండు లక్షలకి తక్కువ చేయవు కదా! భీమా లక్ష రూపాయలూ పాపాయి పేర వ్రాసేశాను. ఇకపోతే - ఆరంబాక్కం దగ్గర అగ్రహారం మొన్న శాంతం పేర కొన్నాను - సాలుకి పదిహేను వేలు వస్తుంది. ఇక నాకెందుకు లేనిపోని తాపత్రయం?

నే నా మైదవోలు కేసు పట్టకపోతే తీరిపొయ్యేను. నాకీ జాగీరుదారులంటే అసలు అసహ్యం పుట్టుతూంది! మొన్న పెరియానాన్నూరు రాజు పదివేలిస్తానని ఐదువేలెగనామం పెట్టాడు. ఇక - తెల్లవాడు ఎంత న్యాయంగా మనవి పరిపాలి స్తున్నా - మనదేశంలో భాషా భేదం, కులగోత్రాభిమానం వున్నంత కాలం - నాలాంటి వాడికి ఉద్యోగాలూ పదవులు దక్క విన్వరన్నది శిలాక్షరం.

ఇక బాచిగాడి మాటా దేముడిమీద భారం వేసి - మనస్సులోనే - సుపుత్ర వరంకోసం - తపస్సు చేసు కోవాలి. కర్మఫలం దైవాధీనం!

...చిన్న విస్కీసోడా పుచ్చుకుని బర్మా చెరూటు కాలుస్తూ పొగచక్రాలు వూదుతూ వసారాలో కూర్చున్నాను.

ఇంతలో - ఫోర్డు మెర్క్యురీ - టూ సీటరు - అందులో ఊర్వశి మిత్రా ప్రత్యక్షం. ఈమధ్య ఊర్వశి రెండు మూడుసార్లు నా వెంట పడుతూ వచ్చింది. బారు రూములో అందరూ "ఊర్వశీ నిత్య యవ్వనం!" అంటారు.

"శాంతం రాజమండ్రీ వెళ్ళిందటగా? ఎవరో నిన్న టెన్నీసు క్లబ్బులో అంటూంటే విన్నా. నేను వచ్చినపనా? అబ్బే, పనియేమీ లేదు లెండి. మొన్న ఊటీలో, దేవయాని భోజనానికి పిలిచింది. ఆవిడ పెనిమిటి-కున్ని కణ్ణన్ - యేదో మాటలో అన్నాడు: "శాస్త్రి ఎన్నికలలో ఎందుకు నిలబడకూడదు? నిల బడ్డాడా - గెలుపు తప్పదు - ఇప్పుడున్న వాళ్ళందరి లోనూ నిజంగా ముందుకు రావలసినవాడు!" - అన్నాడు. సిమ్లా, ఢిల్లీలోనూ, వైట్‌హాలులోనూ అతని కెంత పలుకు బడుందో మీకు తెలుసుగదా! ఆ మాట మీ చెవిని పడేద్దాం అని వచ్చా" అంది.

"కున్ని కణ్ణన్‌కి నామీద అంత అభిమానంవుంటే మొన్న బిరుదుల జాబితాలో రావుబహద్దూరో - అదీ కాకపోతే - మొన్న రాజద్రోహం కేసులో స్పెషల్ ప్రాసిక్యూటరీవో - యిప్పించలేక పోయాడా? ఉత్తదండీ - వీళ్లు! ఇంతకీ నన్ను ఏపక్షంవాళ్లు నిలబెడతారండీ?" అన్నా.

ఆవిడందీ: "సరి - శాంతం తల్చుకుంటే అదెంత పనండీ శాస్త్రిగారూ? వాళ్ళతో కొంచెం సూచన చేస్తేచాలు. "నే నెప్పుడు అధికారం చేతిలో వుండేదారి పక్షంగదా - శాంతాన్ని సిఫార్సు చెయ్యమనడం ధర్మమా-నీతి విరుద్ధంకాదా - శాంతం సిఫార్సు చేస్తుందా?-సిఫార్సు చేస్తే మాత్రం ఫలితం వుంటుందా?"- అని



మీరు అనబోతున్నారు-నేనప్పుడే గ్రహించా."

ఆపాళంగా నాచేతిమీద చెయ్యివేసి, "మీరింత సత్యకాలపు వాళ్ళేమిటండీ? మీ రిద్దరూ భార్యాభర్తలు. ఇది రాజకీయం - అన్ని అస్త్రాలు ప్రయోగించాలె! ఇంతకీ తన్నుమాలిన ధర్మం ఎక్కడుంది? వాళ్ళసలు - శాంతం అడగడం తరువాయిగా - వున్నారు - సరే అనడానికి! నాకెప్పటి సంగతులప్పటికి తెలుస్తూనే వున్నాయిగా!" అంది.

నేనన్నా: "నా కేమిటో ధర్మం అని తోచడంలేదు సుమండీ! నాకేం పెద్ద ఆశలు లేవు. చిన్న లక్ష్యం ఒకటి పెట్టుకున్నా - అది నాయ్యంగా సాధించడానికి ప్రయత్నిస్తున్నా. ఇంతకీ ఏ పక్షం వాళ్ళేనా నన్ను ముఖస్థంగా వచ్చి కోరితే అప్పుడు చూద్దాం."

ఊర్వశి అందీ "లక్ష్యం - సాధనం - అంటారేమిటండీ? ఏది ఏదో ఎవరండీ నిర్ణయించేది? ఈవేళ లక్ష్యం రేపు సాధనం. ఎక్కడికక్కడికే. తిలక్కు "గీతారహస్యం" చదవండి. జాన్ మార్లే "కాంప్రొమైజు" చదవండి. హిట్లర్ "మైన్‌కాంఫ్" చదవండి. ఈ విషమ సమస్యలు పెట్టుకొని వుండకపోతే - మీ రీపాటికి - యే గవర్నరో అయి వుందురు! నేనే కాదు - అందరూ అలాగే అనుకుంటున్నారు!"

నా మనసులో వున్న ఉద్దేశాలే! శాంతం తెచ్చిన అద్దు సవాళ్ళన్నింటికి - నేను చెప్పినట్టే జవాబు చెప్పింది. పాపం! ఊర్వశిని అందరూ అన్యాయంగా అంటారు. మంచిమనిషి!

ఆమె అంది: "ఒక చిన్న విషయం. శాస్త్రిగారూ! ఆవేళ మనం ఇద్దరం కాళికామ్మవారి గుడినుంచి నా కారులో వస్తూంటే - "బంగాళీ సాహిత్యం అన్నా, బంగాళీ సంగీతం అన్నా, బంగాళీవాళ్ళన్నా నేను చెవి కోసుకుంటాను - నాకు బంగాళీ భాష నేర్పరా?" - అని అడిగేరు మీరు. మీకోర్కె చెల్లించడానికి వచ్చాను" అంది... ఆవేళ మందిరానికి వెళ్ళే ముందు క్లబ్బులో 'డాన్సుపార్టీ' వుండెను. ఆ సోమర సావేశంలో ఊర్వశితో కారులో ఏమన్నానో జ్ఞాపకం లేదు. ఆ గాజుబొమ్మని ముట్టుకుంటే యెక్కడ చితికిపోతుందో అన్నట్టుమాత్రం వుండెను- అదొక్కటే జ్ఞాపకం.

"గురువు ప్రత్యక్షం అయి ప్రసాదాన్ని అందిస్తూంటే శిష్యుడు తిరస్కరించడమే!" అన్నాను నేను. "ప్రసాదం సేవించేముందు శుశ్రూష చేసి గురుదక్షిణ సమర్పించండి" అంది. "శుశ్రూష చేస్తూనే పాఠం నేర్చు కోవడం. తరువాతే దక్షిణ!" అన్నానేను. "సరే! ఇదివరకే మీరు ఇష్టదేవతా ప్రార్థన-గురుస్తుతి చేశారు కాబట్టి - ఇక ఓనమాలు మొదలెడుదాం! ఇదిగో మొదటిపాఠం!" అంటూ ఒక గీతం పాడింది... శాంతం గానం చేస్తూంటే - చల్లని దక్షిణపుగాలి వీస్తూన్నట్టు - బొగడ పువ్వుల తేనెతో - మందారపువ్వుల పుప్పొడితో - వసంతపుగాలి హృదయంలో ప్రవేశించినట్టు ఉంటుంది. ఊర్వశి పాడితే - కార్చిచ్చులమంటలు నన్ను మింగేస్తున్నట్టు - ఎడారి సుడిగాలి నా ఉడుకురక్తాన్ని పీల్చేస్తున్నట్టు వుంటుంది...తను పాడిన గీతానికి - అభినయం చేస్తూ అర్థం చెప్పింది. ఊర్వశి కొంటెపిల్ల - నెరజాణ:

అ - అనగా అనగా - 'అనురాగం' -
మన పెదవుల - పూర్ణానుస్వారం!
ఆ - ఆదిగ - 'ఆకారం' -
ప్రేమావేశము కొల్పును - నీ రూపం!
ఇ - అ - ఆ - ఇ - 'ఇచ్ఛ' -
అంజలి నర్పించెద - నా స్వేచ్ఛ!
ఈ - ఈ జగతికి ఆధారం - 'ఈశ్వర్' -
నీవె కావా - నా హృదయేశ్వర్!
ఉ - ఉచ్చరించుము - 'ఉపయోగం' -
లచ్చవరాలైన వద్దు - ఈ ప్రేమవియోగం!
ఊ - అ - ఆ - ఇ - ఈ - ఉ - ఊ - 'ఊర్వశి'
ప్రియతమా! తాళజాలదింక - నీ ప్రేయసి!

....ఎంత శ్రావ్యమైన గొంతుక! ఎంత కోమలమైన శరీరం! మీనుల్లాంటి కళ్ళనుండి ఆమె వేడిచూపులు హృదయంలో చిచ్చుపెట్టి - రరేకెత్తిస్తున్నాయి. ఊర్వశిదగ్గర పాఠాలు నేర్చుకోవాలనే వుంది!

"వచ్చే నెల - నారీరక్షణనిధి కోసం - టాగూరు నాటకం 'చిత్ర' వేస్తున్నాం. మీవంతు నూరు రూపాయలు సాయం చెయ్యాలి" అంది...చెక్కు తనపేరే వ్రాయించుకొంది. లక్ష్యం సాధనం బాగా జోడించి - నన్ను పొగిడి - నూరు రూపాయలు వసూలు చేసింది! చమత్కారమయిన మనిషి - నిజంగా ఊర్వశే!

ఊర్వశి వెళ్ళిపోయాక - శాంతం జ్ఞాపకం వచ్చింది. ఎక్కడో వుందో? కలకత్తా చేరినట్టు టెలిగ్రాం వచ్చి ఈవేళకి నాలుగురోజులయింది. ఎందుకు తెచ్చిపెట్టుకున్నాను ఈ యెన్నికల చిత్తక్షోభ? గొప్పలూ గోట్లు - పదవులూ హోదాలు నాకు వద్దు. మనశ్శాంతి వుంటే చాలు. శాంతం చెప్పినట్టే నడుచుకుంటాను...

77 ఆమె

కాశీస్టేషనులో రైలు ఆగింది.

నేను ఢిల్లీకి టిక్కెట్టు తీసుకున్నా కాని "కాశీ" అన్నమాట చెవిని పడగానే దిగాలని మనసులో కోరిక పుట్టింది. అపాళంగా దిగిపోయాను. ఎక్కడ బస చెయ్యడం? హోటేళ్ళు ఎక్కడున్నాయో నాకు తెలియదే? ముందు ఏర్పాటు చేసుకోకుండా దిగిపోయానే అని గాభరాపడ్డాను.

కాని - ఇంతమంది స్త్రీలు - వృద్ధులు, ముగ్ధలు, పసి పిల్లలు, పడుచులు - ఇక్కడ నిర్భయంగా యాత్ర చేసుకోడానికి దిగారే - నేనెందుకు భయపడాలి అనిపించింది. సాక్షాత్తు కాశీ అన్నపూర్ణ క్షేత్రం - మున్నూట అరవై ఐదు అన్నసత్రాలు వుండే మహా పుణ్యస్థలంలో బసకి భోజనానికి నాకేం భయం అను కున్నా. దశాశ్వమేధ ఘట్టం దగ్గర ఒక ధర్మశాలలో దిగేను. మా ముగ్గురికీ ఒక గది పుచ్చుకున్నాను. ధర్మశాల శుభ్రంగా లేదు. చీకటిగాను తడితడిగాను జారుజారుగాను చెమ్మచెమ్మగానూ వుంది. సత్రంలోనే భోంచేశాం. సుఖ అసలే తినలేకపోయింది.

కాశీ విశ్వేశ్వరుని మందిరం! లక్షలాది యాత్రికులు వచ్చి దర్శనం చేసుకుని పోతున్నారు.

- ఇంకా వుంది.

సమాచార హక్కు చట్టం..

ప్రజాస్వామ్య దేశాల ప్రధాన సూత్రాలు.. పారదర్శకత, పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం, జవాబుదారీతనం. వీటిని సాకారం చేయడానికి ఏర్పాటు చేసిందే... సమాచార హక్కు చట్టం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19-1(ఎ) ప్రకారం.. ప్రాథమిక హక్కుల్లో పేర్కొన్న వాక్ స్వాతంత్ర్యం, విజ్ఞాపన హక్కులకు విస్తృత రూపమే.. సమాచార హక్కు చట్టం. దేశంలో సమాచార హక్కు చట్టం 2005 అక్టోబర్ 12 నుంచి అమలులోకి వచ్చింది. ఈ చట్టం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2005, అక్టోబర్ 13 నుంచి అమలులోకి వచ్చింది. సమాచార హక్కు చట్టాన్ని 'అధికార రహస్యాల చట్టం-1923' స్థానంలో రూపొందించారు. ఈ చట్టం జమ్మూకాశ్మీర్‌కు వర్తించదు. అయితే ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 2009లో సమాచార హక్కు చట్టాన్ని అమలులోకి తెచ్చింది

సమాచార హక్కు చట్టం- నేపథ్యం

- భారత సుప్రీంకోర్టు ... బెన్నెట్- కాల్మన్ కంపెనీ (1973) కేసులో ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనే హక్కు ఆర్టికల్ 19-(1)(ఎ) ప్రకారం పౌరుడికిగల ప్రాథమిక హక్కుల్లో అంతర్భాగమని తీర్పు చెప్పింది.
- అదేవిధంగా రాజ్‌నారాయణ్ వర్సెస్ ఇందిరాగాంధీ (1975) కేసులో ప్రజలకు సేవలు అందించే ప్రభుత్వాలు, వాటికి సంబంధించిన సమస్త సమాచారాన్ని తెలుసుకొనే హక్కు ప్రజలకు ఉంది అని తీర్పు చెప్పింది.
- ఎస్.ఆర్.పాండ్యన్ నేతృత్వంలోని ఐదో వేతన సంఘం (1994-97) అధికార రహస్యాల చట్టం-1923ను రద్దుచేసి, దాని స్థానంలో సమాచార హక్కు చట్టాన్ని రూపొందించాలని సూచించింది.
- సమాచార హక్కు చట్టం రూపొందించడానికి విశేషంగా కృషిచేసిన వ్యక్తులు...
  1. అరుణారాయ్ (మాజీ ఐఏఎస్ అధికారి)
  2. సందీప్ పాండే (సామాజికవేత్త)
  3. అరవింద్ కేజ్రీవాల్ (ప్రస్తుత ఢిల్లీ ముఖ్యమంత్రి)

ముఖ్య ఉద్దేశాలు



- పరిపాలనలో పారదర్శకతను సాధించడం.
- ప్రభుత్వ శాఖల్లో అవినీతిని అంతం చేయడం.
- ప్రజలపట్ల ప్రభుత్వం జవాబుదారీగా ఉండటం.
- ప్రభుత్వ అసమర్థతను తగ్గించడం.

సమాచారహక్కు చట్టం - ముఖ్యాంశాలు

1. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి కావాల్సిన సమాచారాన్ని పొందే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుంది.
2. పౌరుడు ఏ ప్రభుత్వ శాఖ నుంచి అయినా తనకు కావలసిన సమాచారాన్ని కోరుతూ దరఖాస్తు చేసుకోవాలి.
3. దరఖాస్తు ఫారంతోపాటు రూ.10 నగదు లేదా డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించాలి. ప్రస్తుతం రాష్ట్రంలో గ్రామస్థాయిలో ఎలాంటి ఫీజు లేదు. మండల స్థాయిలో రూ.5, డివిజన్ స్థాయిలో రూ.10 చెల్లించాలి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు ఏ స్థాయిలో ఫీజు చెల్లించనవసరం లేదు.
4. దరఖాస్తుదారు కోరిన సమాచారం కోసం జిరాక్స్ కాపీలు లేదా సీడీలకు అయ్యే ఖర్చును ఇండియన్ పోస్టల్ ఆర్డర్ లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా దరఖాస్తు ఫారంతో జత చేయాలి.
5. పౌరుడు తనకు కావలసిన రికార్డులను కూడా తనిఖీ చేసుకోవచ్చు. దీనికోసం మొదటి గంట ఎలాంటి రుసుము లేదు. తర్వాత ప్రతి 15 నిముషాలకు రూ.5 చొప్పున చెల్లించాలి.
6. ప్రతి శాఖలో సమాచార అధికారి 30 రోజుల్లో పౌరుడు అడిగిన సమాచారాన్ని అందించాలి.
7. జీవించే స్వేచ్ఛకు సంబంధించిన సమాచారాన్ని 48 గంటల లోపు అందించాలి.
8. పౌరుడు అడిగిన సమాచారాన్ని 30 రోజుల్లో ఇవ్వకుంటే రోజుకు రూ.250 చొప్పున గరిష్ఠంగా రూ.25,000 వరకు జరిమానా, శాఖాపరమైన చర్య ఉంటుంది.
9. ఈ చట్టం అమలు కోసం కేంద్రస్థాయిలో కేంద్ర సమాచార కమిషన్, రాష్ట్రస్థాయిలో.. రాష్ట్ర సమాచార కమిషన్‌లు ఉంటాయి. వీటిలో ఒక చైర్మన్, పదిమంది సభ్యుల చొప్పున ఉంటారు.
10. ఈ చట్టంలోని సెక్షన్ 4 (1) (బి) ప్రకారం చట్టం అమల్లోకి వచ్చిన 120 రోజుల్లోగా ప్రతిశాఖ తమ శాఖకు సంబంధించిన ముఖ్య సమాచారాన్ని ప్రజలు కోరకున్నా స్వచ్ఛందంగా అందుబాటులో ఉంచాలి.
11. విచారణ సమయంలో సమాచార కమిషన్‌కు సివిల్ కోర్టుకు ఉండే అధికారాలు ఉంటాయి.

మినహాయింపులు

దేశ సార్వభౌమత్వం, సమగ్రత, విదేశీ సంబంధాలు దెబ్బతినే అవకాశమున్న అంశాలు, కోర్టు ధిక్కార సమాచారం, ఇంటెలిజెన్స్ బ్యూరో, సైనిక వ్యవహారాలు తదితర అంశాలపై సమాచారం కోరే హక్కు లేదు. సమాచార హక్కు చట్టం ఎంత సమర్థవంతంగా అమలైతే దేశం అంతగా అభివృద్ధి చెందినట్లని కేంద్ర సమాచార మాజీ ప్రధాన కమిషనర్ ఎ.ఎన్.తివారి పేర్కొన్నారు. ప్రజాస్వామ్య భారతావనిలో ఈ చట్టం ప్రజల చేతిలో వజ్రాయుధం వంటిది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన గత దశాబ్ద కాలంలో దీని పనితీరుని గమనిస్తే అనుకూల, ప్రతికూల అంశాలు కనిపిస్తాయి.

అనుకూల అంశాలు

- 1. ప్రభుత్వ యంత్రాంగం క్రియాశీలమై జవాబు దారీతనం పెరిగింది.
- 2. ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకత పెరిగి, ప్రజా పరిశీలన ఎక్కువైంది.
- 3. ఉద్యోగులు ప్రజాసేవకులుగా తమ విధులను నిర్వర్తిస్తున్నారు.
- 4. ఈ చట్టం ద్వారా అనేక అవినీతి కుంభకోణాలు వెలుగులోకి వచ్చాయి.
- 5. ప్రతి సంవత్సరం సగటున 5 లక్షల దరఖాస్తులు వస్తే వీటిలో 95% రాష్ట్రస్థాయిలోనే పరిష్కార మవుతున్నాయి.
- 6. చట్టం అమలులో స్వచ్ఛంద సంస్థలు, మీడియా బాగా సహకరిస్తున్నాయి.
- 7. దరఖాస్తుదారులకు సహాయంగా బీహార్‌లో కాల్‌సెంటర్లు ఏర్పాటు చేశారు.
- 8. కర్ణాటకలో ఫోన్ లేదా మెయిల్ చేస్తే రాష్ట్రవ్యాప్త సమాచారం లభ్యమయ్యే ఏర్పాటు చేశారు.

ప్రతికూల అంశాలు

- 1. గత 11 ఏళ్లుగా సమాచారం కోరేవారిపై భౌతిక దాడులు ఎక్కువయ్యాయి. 'స్వర్ణ చతుర్భుజి' రహదారుల నిర్మాణంలో జరుగుతున్న అక్రమాలపై ఐఏఎస్ మాజీ అధికారి ఒకరు సమాచారం అడిగి, హత్యకు గురయ్యారు. ప్రతియేటా హత్యకు గురయ్యేవారి సంఖ్య పెరుగుతోంది.
- 2. సమాచారాన్ని కోరుతూ ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను పరిష్కరించడంలో అధికారులు ఆలస్యం చేస్తున్నారు.
- 3. ఇప్పటికీ సమాచార అధికారుల్లో చాలామందికి ఈ చట్టంపై సరైన అవగాహన లేదు.
- 4. అధికశాతం సమాచారాన్ని ఆంగ్లంలోనే ఇస్తున్నారు.
- 5. దరఖాస్తుదారుడు కోరిన సమాచారం తమ కార్యాలయంలో కనిపించడం లేదని అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

సమర్థవంతంగా అమలు చేయడానికి సూచనలు

- 1. దరఖాస్తు చేసుకునే విధానాన్ని సులభతరం చేయాలి. బిహార్ తరహాలో ఫోన్ ద్వారా స్వీకరించాలి.
- 2. అన్ని శాఖల రికార్డులను సాధ్యమైనంత త్వరగా డిజిటలైజేషన్ చేయాలి.
- 3. సమాచారాన్ని దరఖాస్తుదారుడు కోరుకున్న భాషలో అందించాలి.
- 4. సమాచారాన్ని కోరే వ్యక్తులపై దాడులను నియంత్రించడానికి, వారి రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
- 5. వ్యక్తిపై దాడి చేసినంత సులభంగా సంస్థలపై చేయలేరు. కాబట్టి సంస్థలు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించాలి.
- 6. సమాచార కమిషనర్‌లుగా నిజాయితీగల న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలను నియమించాలి.
- 7. సమాచార హక్కు చట్టాన్ని డిగ్రీస్థాయి వరకు పాఠ్యాంశంగా చేర్చడంలో భాగంగా విద్యార్థులను చైతన్యవంతులను చేయాలి.
- 8. సమాచారాన్ని అందించడానికి 30 రోజుల గడువు చాలా ఎక్కువ. నార్వేలో కోరిన సమాచారాన్ని 3 రోజుల్లో అందిస్తే, ఐర్లాండ్‌లో 7 రోజుల్లో, అమెరికాలో 10 రోజుల్లో అందిస్తున్నారు.

సమాచార హక్కు చట్టానికి విస్తృత ప్రచారం కల్పిస్తూ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేసినపుడు చట్టం లక్ష్యం నెరవేరుతుంది. పాలకులు, ప్రభుత్వ అధికారులు ప్రజాసేవకులుగా ప్రజల మన్నన పొందుతారు.

ఇతర అంశాలు

- సమాచార హక్కు చట్టం చేసిన తొలి దేశం - స్వీడన్ (1766)
- సమాచార హక్కు చట్టం కోసం రాజస్థాన్‌లో ఉద్యమించిన మహిళ - అరుణారాయ్ (మజ్దూర్ కిసాన్ శక్తి సంఘ్)
- కేంద్ర సమాచార కమిషన్‌లో ప్రధాన సమాచార కమిషనర్‌గా పనిచేసిన తొలి మహిళ - దీపక్ సంధూ
- ప్రస్తుతం కేంద్ర సమాచార కమిషన్‌లో సమాచార కమిషనర్‌గా పనిచేస్తున్న తెలుగు వ్యక్తి-మాడభూషి శ్రీధర్

కేంద్ర సమాచార కమిషన్ ప్రధాన కమిషనర్లు

1. వజహత్ హబీబుల్లా	(2005-10)
2. ఎ.ఎన్.తివారి	(2010)
3. సత్యానంద్ మిశ్రా	(2010-13)
4. దీపక్ సంధూ	(2013)
5. సుష్మాసింగ్	(2013-14)
6. రాజీవ్ మాథుర్	(2014)
7. విజయ్‌శర్మ	(2015)
8. రాధాకృష్ణ మాథుర్	(2015 నుంచి)



సెంట్రల్ ఎక్సైజ్‌లో 26 ఖాళీలు

కొచ్చిన్‌లోని కస్టమ్స్ (ప్రివెంటివ్) కమిషనరేట్ గ్రూప్ సీ డిపార్ట్‌మెంట్‌లోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- మొత్తం పోస్టులు: 26

విభాగాలవారీగా ఖాళీలు

- సీమెన్-7, గీజర్-11, స్కిప్పర్‌మెట్-2 , ఇంజిన్ డ్రైవర్-1, సుఖాని-1, లాంచ్ మెకానిక్-1, అన్‌స్కిల్డ్ ఇండస్ట్రియల్ వర్కర్- 3
- అర్హతలు : పదోతరగతి లేదా తత్సమాన పరీక్షతోపాటు ఫిషింగ్ వెజల్‌లో సెకండ్ హ్యాండ్ సర్టిఫికెట్ ఉండాలి. ఇంజిన్ డ్రైవర్‌కు ఎనిమిదో తరగతి, అన్‌స్కిల్డ్ ఇండస్ట్రియల్ వర్కర్‌కు పదోతరగతితోపాటు మెకానిక్/ డీజిల్/ ఫిట్టర్/ టర్నర్/ వెల్డర్/ ఎలక్ట్రీషియన్/ ఇన్‌స్ట్రుమెంట్/ కార్పెంటరీ ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- వయస్సు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. కొన్ని పోస్టులకు 30 ఏండ్లకు మించరాదు.
- ఎంపిక : రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తులు : ఆఫ్‌లైన్
- చివరి తేదీ : జనవరి 31
- వెబ్‌సైట్ www.cenexcisekochi.gov.in

నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో 256 పోస్టులు

హైదరాబాద్‌లోని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) లిమిటెడ్.. వివిధ విభాగాల్లోని 256 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ రెండు వేర్వేరు ప్రకటనలు విడుదల చేసింది.

పోస్టు-ఖాళీలు : జూనియర్ మేనేజర్ (జేఎం)-32 (మైనింగ్-8+సర్వే-3+ జీ అండ్ క్యూసీ-1+ సీ అండ్ ఐటీ-7+ ఇన్‌స్ట్రుమెంటేషన్-1), డిప్యూటీ జూనియర్ మేనేజర్ (డీవైజేఎం)-1 (జియో ఫిజిసిస్ట్); జూనియర్ ఆఫీసర్ ట్రైనీ (జేవోటీ)-54 (మెకానికల్-13+ ఎలక్ట్రికల్-8+ మైనింగ్-29+జీ అండ్ క్యూసీ-4); మెయింటెనెన్స్ అసిస్టెంట్ ట్రైనీ (ఎంఏటీ)-154 (మెకానికల్-114+ఎలక్ట్రికల్-40), హెచ్ఈఎం(మెకానికల్) గ్రేడ్ (3) ట్రైనీ-4, ఎలక్ట్రీషియన్ గ్రేడ్ (3) ట్రైనీ-4, హెచ్ఈఎం ఆపరేటర్ గ్రేడ్ (3) ట్రైనీ-2, క్యూసీఏ గ్రేడ్ (3) ట్రైనీ-5.

అర్హతలు : సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి ఐటీఐ/ డిప్లొమా/ బీఈ/ బీటెక్/ ఎంఎస్సీ/ ఎంఎస్సీ(టెక్)/ ఎంటెక్/ ఎంసీఏ/ బీఎస్సీ. అలాగే నిబంధనల మేర ఉద్యోగానుభవం, సంబంధిత రంగంలోని ప్రత్యేకాంశాలపై నైపుణ్యం తదితర అర్హతలుండాలి.

వయసు : డీవైజేఎం, జేఎం పోస్టులకు 45 ఏళ్లు; జేవోటీకి 35 ఏళ్లు; మిగిలిన పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక : పోస్టులను బట్టి రాతపరీక్ష+ గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ/ట్రేడ్ టెస్ట్/జాబ్ ప్రొఫిషియెన్సీ టెస్ట్.

దరఖాస్తు రుసుం : జేఎం, డీవైజేఎం పోస్టులకు రూ.500; జేవోటీకి రూ.300; మిగిలిన పోస్టులకు రూ.150. రిజర్వేషన్ కేటగిరీలకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం : డీవైజేఎం, జేఎం, జేవోటీ పోస్టులకు ఆన్‌లైన్, మిగిలిన పోస్టులకు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ : జేఎం, డీవైజేఎం, జేవోటీ పోస్టులకు ఫిబ్రవరి 12, 2018; మిగిలిన పోస్టులకు ఫిబ్రవరి 17, 2018.

ఆఫ్‌లైన్ దరఖాస్తు చేరడానికి చివరి తేదీ: ఫిబ్రవరి 19, 2018.

వెబ్‌సైట్ : www.nmdc.co.in

సెంట్రల్ సాల్ట్ & మెరైన్‌లో

సెంట్రల్ సాల్ట్ అండ్ మెరైన్ కెమికల్స్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఎంసీఆర్ఐ) ఖాళీగా ఉన్న సీనియర్ సైంటిస్ట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు: సీఎస్ఎంసీఆర్ఐ అనేది కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్) పరిధిలో పనిచేస్తున్న సంస్థ.

- పోస్టు పేరు : సైంటిస్ట్/సీనియర్ సైంటిస్ట్-7
- సైంటిస్ట్ : 32 ఏళ్లకు మించరాదు.
- పే స్కేల్ : రూ. 15,600-39100 + గ్రేడ్ పే రూ. 6600
- సీనియర్ సైంటిస్ట్ : 37 ఏళ్లకు మించరాదు.
- పే స్కేల్ : రూ. 15,600-39,100 + గ్రేడ్ పే రూ. 7600
- అర్హత : ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ)తోపాటు పీహెచ్‌డీ
- అప్లికేషన్ ఫీజు: రూ. 100(డీడీ రూపంలో)
- ఎంపిక: రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు : ఆఫ్‌లైన్‌లో
- చివరితేదీ : జనవరి 31
- వెబ్‌సైట్ : www.csmcri.org

నిమ్‌హాన్స్‌లో 24 లోయర్ డివిజన్ క్లర్క్‌లు

బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ (ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్: నిమ్‌హాన్స్).. 24 ఎల్‌డీసీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ఎల్‌డీసీ (లోయర్ డివిజన్ క్లర్క్).
వేతనం : రూ.21,000. **అర్హతలు :** ఏదైనా డిగ్రీతోపాటు టైపిం గ్ (నిమిషానికి 35 ఇంగ్లిష్/ 30 హిందీ పదాలు కంప్యూటర్లో టైప్ చేయగలగాలి). **వయసు :** 27 ఏళ్లకు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. **దరఖాస్తు రుసుం :** రూ.500; ఎస్సీ/ఎస్టీ-రూ.250.
దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్.
దరఖాస్తు చేరడానికి చివరి తేదీ : జనవరి 31, 2018.
వెబ్‌సైట్ : www.nimhans.ac.in

Downloaded From Telugu e News App play.google.com/store/apps/details?id=com.roshan.enews

విశాలాంధ్ర బిజినెస్

-249.52	-80.75	-100	బంగారం (విశాఖపట్నం)	-300	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	28,860	వెండి (విజయవాడ)	40,750	
36,033.73	11,049.65	28,800	ప్రొద్దుటూరు 28,860	40,400	ప్రొద్దుటూరు 42,645	63.60
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
కోల్ ఇండియా	307.50	1.71
హీరో మోటోకార్ప్	3,697.00	1.33
సన్ ఫార్మా	594.60	0.72
ఎస్‌బీఐ	318.75	0.56
హెచ్‌యూఎల్	1,410.65	0.16

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
కోటాక్ మహీంద్ర	1,128.70	-2.15
ఏషియన్ పెయింట్స్	1,150.00	-2.22
డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్	2,370.00	-1.86
ఏక్సిస్ బ్యాంక్	609.80	-1.98
అదానీ పోర్ట్స్	440.00	-1.84

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ (క్రి. ముగింపు	రూ.విలువ ప్ర. ముగింపు
డాలర్	63.57	63.60
యూరో	78.95	78.98
పౌండ్	89.75	89.79
ఆస్ట్రేలియా డాలర్	51.47	51.47
సింగపూర్ డాలర్	48.56	48.53

బులియన్


బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,860	30,866
చెన్నై	28,860	30,866
బెంగళూరు	28,400	30,373
ముంబై	29,780	31,850
విజయవాడ	28,800	31,500
విశాఖపట్నం	28,860	31,483
ప్రొద్దుటూరు	28,860	30,300

ముడి చమురు	69.46

పెరిగిన బంగారం, వెండి ధరలు

ముంబై: బంగారం ధరలు మంగళవారం రూ.120లు పెరిగి 10గ్రాముల బంగారం ధర రూ.31,240లు పలికిందని బులియన్ మార్కెట్ వెల్లడించింది. పెండ్లిళ్ల సీజన్ దగ్గర పడటంతో స్థానిక ఆభరణాల వర్తకుల నుండి బంగారానికి డిమాండ్ పెరగడంతో ధరలు పెరిగినట్లు తెలుస్తోంది. వెండి ధరలు కూడా రూ.400లు పెరిగి కేజీ వెండి రూ.40,050లు పలికింది. సింగపూర్‌లో బంగారం ధర0.34 తగ్గి ఔన్స్ 1335.40 డాలర్లకు చేరింది. వెండి ధర 0.35శాతంతో ఔన్స్ 17.06 డాలర్లకు చేరింది.దేశ రాజధానిలో 99.9 శాతం మరియు 99.5శాతం బంగారం ధర రూ.120లు పెరిగి రూ.31,240, రూ.31.090లు పలికింది.గత రెండు సెషన్లలో నూ బంగార రూ.330లు నష్టపోయింది.

స్పాట్ గోల్డ్ ధరలు: డాలర్ బలపడటంతో బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. స్పాట్ గోల్డ్ 0.3శాతం తగ్గి ఔన్స్ 13 35.93 డాలర్లు పలికింది. సోమవారం 0.7శాతం తగ్గి ఔన్స్ 1334.20 డాలర్లకు చేరింది. అమెరికా డాలర్ బలపడటంతో వరుసగా బంగారం రెండవరోజు తగ్గిందని చెప్పవచ్చు. అమె రికా ఫెడరల్ రిజర్వు పాలసీ సమావేశంలో ఈ ఏడాది వడ్డీరేట్లు పెరగనున్నట్లు సంకేతాలు వెలువడ నుండటంతో ట్రేడర్లు వేచి చూస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఈ నెలలో ఇప్పటివరకు బంగారంధరలు 2.5శాతంపెరిగాయి. గత డిసెంబరులో జరిగిన ఫెడరల్ సమావేశం అనంతరం బంగారం ధరలు 8శాతం పెరిగాయి.



దాలర్ డిమాండ్‌తో...

నష్టపోయిన రూపాయి

ముంబై: రూపాయి విలువ డాలర్‌తో పోల్చిచూసుకుంటే 9 పైసలు తగ్గి 63.67 వద్ద నిలచింది. మాసాంతంలో డాలర్ డిమాండ్ పెరగడంతో రూపాయి విలువ తగ్గినట్లు చెప్ప వచ్చు. ఇంటర్‌బ్యాంకు ఫారెన్ ఎక్స్‌చేంజి మార్కెట్‌లో అమెరికా డాలర్ ఇతర దేశాల కరెన్సీలతో చూసు కుంటే పటిష్టపడిందని చెప్పవచ్చు. బ్యాంకుల నుండి దిగుమతుల నేపథ్యంలో డాలర్ డిమాండ్ పెరగ డం డొమెస్టిక్ ఈక్విటీ మార్కెట్ మరింత నీరసిం చింది. వరుసగా మూడు రోజుల ర్యాలీ అనంతరం సోమవారం రూపాయి 3పైసలు నష్టపోయి 63.58 వద్ద నిలిచింది.

బాల్యం బందీ

- నానాటికీ పెరుగుతున్న బాల్య వివాహాలు
- పేదరికమే ప్రధాన కారణం
- జాడలేని చైల్డ్‌లైన్.. కానరాని కమిటీలు
- సర్కార్ స్పందిస్తే సత్ఫలితాలు



విశాలాంధ్ర-అమరావతి : అమాయకత్వంతో ఆడుకునే వారికి బాల్యం దూరమవుతోంది. పౌష్టికత పడకేస్తే.. వివాహాలు మరణ శాసనాలు లిఖిస్తున్నాయి. కుటుంబ సభ్యులు భారందించుకుంటే.. బరువైన బతుకుతో కాలం వెళ్లదీస్తున్నారు. ఫలితంగా బాల్యాన్ని బాలికలు దుర్భర పరిస్థితుల నడుమ గడుపుతున్నారు. భేటి బచావో.. బేటీ పడావో... మా ఇంటి మా లక్ష్మీ.. ఇలా ఎన్నో పథకాలు బాలికా సంరక్షణ పేరిట సర్కార్ విస్తృతంగా అమలు చేస్తోంది. ఆర్భాటపు ప్రకటనలు ప్రకటనలకే పరిమితం కాగా నిధులు ఖజానాలో నిదరోతున్నాయి. ఆడపిల్లల సంరక్షణ కాగితాలకే అంకితం అవటంతో చిన్న వయసులోనే బాల్య వివాహాలకు చిన్నారి బాల్యం చిరునామాగా మారుతోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచుకుంటున్న ఈ రోజులలో బాలికల సంరక్షణ చెరసాలలో బందీగా ఉండటంతో చట్టాలు చేష్టలు డిగి చూస్తున్నాయి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా బాలి కల సంరక్షణ కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా సక్రమంగా అమలు జరగటం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా బాల్య వివాహాలు ఏ రోజుకారోజు పెరుగు తూనే ఉన్నాయి. అయితే ఇదే క్రమంలో గడిచిన మూడేళ్ళలో బాల్య వివాహాల నుంచి రక్షించిన కేసులు సంఖ్య బాగా పెరగటం హర్షించదగ్గ పరిణామం. ఆడపిల్లలు మానసికంగా, శారీరకంగా పరిపక్వత చెందిన తర్వాత వారి వివాహాలపై దృష్టి సారించేవారు. ప్రభుత్వం సైతం ఆడపిల్లల సంరక్షణ కోసం ప్రతి జిల్లాలో ఎన్నో అవగా హన కార్యక్రమాలు చేపట్టి తమవంతు కర్తవ్యం నిర్వర్తిస్తు న్నారు. సాంకేతికత అభివృద్ధి చెందని సమయంలో చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేయటం ఆనవాయితీగా ఉండేది. అప్పట్లో పెద్ద కుటుంబాలు కావటంతో ఇటు వంటి వివాహాలు ఎక్కువగా జరిగేవి. అయితే విద్యా వ్యవస్థ వ్యాప్తి చెందిన తరుణంలో బాలికలను బడి బాట పట్టించారు. అన్ని రంగాల్లో వారే ముందుండే విధంగా ప్రోత్సహం అందిస్తూ ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. అయితే కాలం మారుతున్న కొద్దీ మళ్ళీ తిరిగి పాత రోజులే పునరావృత్తం కావటం ఆందోళన కలిగించే అంశంగా మారింది. భారమైన రోజులు కావటం, కుటుంబ బాధ్యతలు ఎక్కువ కావటంతో చిన్నారి బాల్యం మరోసారి ప్రమాదపు అంచు ల్లోకి వెళుతుంది. మైనార్టీ తీరకుండానే మానసిక, శారీరక పరిపక్వత చెందకుండానే వివాహాలు జరిపిం చేస్తున్నారు. చిన్న వయసులోనే వివాహాలు జరిపించ టంతో పౌష్టికత లోపం, రక్త హీనత వంటి అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పేదరికమే ప్రధాన కారణం

పెరిగిన ఖర్చులతో కుటుంబ పోషణ మోయ లేని భారంగా మారింది. ఈ క్రమంలో ఆడపిల్లను తొందరగా పెళ్లి చేసి వదిలించుకోవాలనే ఆలోచన చేయటం పరిపాటిగా మారింది. బాధాకరంగా అనిపించినా కుటుంబ సభ్యులు తప్పని పరిస్థితిలో బాల్య వివాహాలు జరిపిస్తున్నారు. మరోవైపు నానాటికీ లైంగిక దాడులు పెరిగిపోతున్న తరుణంలో మేనరికం వివాహాలు చేసేందుకు కూడా ఏ మాత్రం వెనకాడటంలేదు. ప్రధా నంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన పేద వర్గాల వారికి అందకపోవటం కొంత బాల్య వివాహాలకు దారి తీస్తోంది. ఆర్థికంగా చేయూత నిచ్చే పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తే బాల్య వివాహాల సంఖ్య తగ్గించవచ్చు.

జాడలేని చైల్డ్ లైన్

చిన్నారి ఆడపిల్లలను వివాహాల పేరిట అకాల మరణాల పాలు చేస్తున్న వారిని అడ్డుకునేందుకు చైల్డ్ లైన్ సంస్థను ఏర్పాటు చేశారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఈ చైల్డ్ లైన్‌లు పని చేస్తున్నాయి. ఉన్నవి కూడా అంత సమర్థవంతంగా పని చేయడం లేదని విమర్శలు వినపడుతున్నాయి. చైల్డ్ లైన్ 1098 పేరిట ఏర్పాటు చేసిన అది కూడా అన్ని చోట్లా పని చేయడం లేదు. కాగా ప్రతి జిల్లాలో చైల్డ్ లైన్ సెంటర్లు ఉండాలన్న ప్రతిపాదన నేటికీ అమలుకి నోచు కోలేదు. గిరిజన తండాలలో, మారుమూల పల్లెటూర్లలో బాల్యవివాహాలు జరుగుతున్నా సమాచారం అందటం లేదని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ అధికారులే వ్యాఖ్యానించటం కొసమెరుపు.

బాల్య వివాహాలపై నమోదైన కేసులు ఇలా..

గత మూడేళ్ళుగా బాల్య వివాహాలను నిరోధించే క్రమంలో కేసులు భారీగానే నమోదు కావటం మంచి పరిణామంగా చెప్పుకోవచ్చు. అంటే బాల్య వివాహాల బారి నుంచి ఆడ పిల్లలను రక్షించిన కేసులు 2015లో 841 మందిని బాల్య వివాహాల బారి నుంచి రక్షిస్తే, 2016లో 878 కేసులు నమోదయ్యాయి. 2017 నాటికి ఆ సంఖ్య 1,114కి పెరిగింది. గత మూడేళ్లలో మొత్తంగా 2,833 బాల్య వివాహాలు నిలిపేసినట్లు కేసులు నమోదయ్యాయని అధికారులు చెబుతున్నారు. బాలికలలో అవగాహన పెరగటం వలన ఈ స్థాయిలో వివాహాలు నిరోధించగలిగామని అధికారులు వ్యాఖ్యా నిస్తున్నారు. మరింతగా అవగాహన, భరోసా కలిగించ గలిగితే మరిన్ని మంచి ఫలితాలు చూడొచ్చని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.

కానరాని కమిటీలు

బాలల సంరక్షణ, బాల్య వివాహాల నిర్మూ లన కోసం గ్రామ స్థాయిలో బాలల రక్షణ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మండలం, జిల్లా స్థాయిలలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, చైల్డ్ వెల్ఫేర్ కమిషనర్ తదితర యంత్రాంగంతో సమన్వయం చేసుకొంటూ ఈ కమిటీలు బాలల హక్కులు కాపాడాల్సి ఉంటుంది. అయితే ఎక్కడా ఈ కమిటీలు నిర్దిష్టంగా పని చేయటం లేదు. ప్రధానంగా గ్రామ స్థాయి అధికారులలో ఈ విషయంలో అవగాహన లేకపోవటం శోచనీయం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందిస్తే బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయవచ్చు అనేది సర్వత్రా వినిపిస్తోంది.

విజ్ఞానం

నానో టెక్నాలజీతో

కేన్సర్ గుర్తింపు, చికిత్స



కేన్సర్ నివారణ చికిత్సలో భాగంగా ఇప్పటివరకు అమలులో ఉన్న రేడి యేషన్, గామా కిరణా లతో కేన్సర్ కణితులను నిర్వీర్యం చేయడం మనకు తెలిసిందే.... దీనివలన ఆరోగ్యంగా ఉన్న కణాలపై కూడా ప్రభావం చూపుతుంది. రేడియేషన్ చికిత్సావిధానం కూడా అత్యంత ఖరీదైనది కూడా... దీనిత కూడా సైడ్ ఎఫెక్ట్ ఎక్కువగా ఉండడం గమనిస్తున్నాం. కానీ తాజాగా చేసిన పరిశోధనలో కాల్షియం ఫాస్ఫేట్ నానో పార్టికల్స్‌తో అత్యంత చవకగా, సురక్షితమైన పద్ధతిని కొచ్చికి చెందిన అమృత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ శాస్త్రజ్ఞులు చేప ట్టారు. మనిషి ఎముకల్లో ఉండే సహజసిద్ధంగా లభ్యమయే నాన్‌టాక్సిక్, బయోడిగ్రేడబుల్ అయిన కాల్షియం ఫాస్ఫేట్ నానో పార్టికల్స్‌ను ఎమ్ ఆర్ఐ, సిటీ స్కాన్‌లో చొప్పించి పరీక్షలు చేయడం ద్వారా కేన్సర్‌ను త్వరితంగా పసిగట్టి నివారించవచ్చునని తెలుస్తోంది. కాల్షియం ఫాస్ఫేట్ కణాలను మన శరీరం ఫారెన్‌బాడీగా గుర్తించదు. ఇది అతి తక్కువ టాక్సిసిటీని కలిగిఉండటంతో ఇమ్యూన్ రిజెక్షన్‌కూడా అంతగాఉండదు. ఇమేజ్ గైడెన్స్ ద్వారా కేన్సర్ కణాలను రేడియో వేవ్స్ ద్వారా నిర్వీర్యం చేస్తుది. ఈ విధానం క్లినికల్ ట్రయల్స్ ద్వారా ప్రస్తుతం జంతువలపై ప్రయోగిస్తున్నారు. ఇమేజ్ గైడెడ్ థెరపీ ద్వారా కాల్షియం ఫాస్ఫేట్ బయోడిగ్రేడబుల్ మెటీరియల్ వినియోగం కేన్సర్ రోగులకు మరింత ఉపకరిస్తుందని తెలుస్తోంది.

ఇన్‌సోమ్నియాతో డయాబెటిస్...!

ప్రతి ముగ్గురు గర్భిణీలలో ఇద్దరు చివరి మూడునెలల కాలంలో ఇన్‌సోమ్నియా(నిద్రలేమి)కి గురవుతున్నట్లు తెలుస్తోంది. గర్భ ధారణ సమయంలో 64శాతం మంది మహిళలు నిద్రలేమికి గురవ దంతో తదనంతర కాలంలో ఇది వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభాం చూపుతుందని యూరోపియన్ శాస్త్రవేత్తల తాజా అధ్యయనంలో వెల్ల డైంది. ముఖ్యంగా గర్భధారణ సమయంలో సరైన నిద్ర పట్టకపోవడం మధుమేహవ్యాధికి దారితీయవచ్చునని తెలుస్తోంది. గర్భస్థ సమయంలో క్రమం తప్పకుండా చేసే శారీరక వ్యాయామంతో ఇన్‌సోమ్నియా నివారించవచ్చునని వీరు సూచిస్తున్నారు. యూనివర్సిటీ ఆఫ్ గ్రెనడా, స్పెయిన్, అండలూసియన్ హెల్త్ సర్వీసు, యూనివర్సిటీ ఆఫ్ జాయెన్ సంయుక్తంగా చేపట్టిన అధ్యయనంలో 486 మంది గర్భిణీలపై మొత్తం తొమ్మిది నెలల కాలం పరిశోధన చేసారు. గర్భధారణకు ముందు నిద్ర పట్టనివారు 6శాతం కాగా, మొదటి మూడు నెలలకాంలో 44శాతం, రెండవ త్రైమాసికంలో 46శాతం మంది నమోదయ్యారు. నిద్రలో ఎన్నిసార్లు మేల్కొంటున్నారు, ఎంతసేపు మరలా నిద్రపోయేందుకు సమయం పడుతోంది..మొత్తం నిద్రపోయిన సమయం, పగలు నిద్ర వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని విశ్లేషించారు.



రికార్డులకు బ్రేక్..

- నష్టాల్లో నమోదైన సూచీలు
- 36వేల దిగువన సెన్సెక్స్, నిఫ్టీ 11,200

ముంబై: వరుస లాభాలతో రికార్డుల్లో ఓలలాడిన స్టాక్ మార్కెట్లకు మంగళవారం బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపింది. దేశీయ బెంచ్‌మార్క్ సూచీలు ప్రారంభ మార్కె ట్‌లో మంగళవారం 0.72శాతం తగ్గాయి. మదుపరులు లాభాలవైపు మొగ్గుచూపడంతో మార్కెట్లు నష్టాలో నమోద య్యాయి. 30షేర్ల బిఎస్ఇ సెన్సెక్స్ ఇండెక్స్ 226.02 పాయింట్ల నష్టంతో 0.62శాతంతో 36,057.23 వద్ద నమోదైంది. నిఫ్టీ 11,049.50 పాయింట్లతో 0.73 శాతంతో 80.90 పాయింట్ల దిగువన నమోదైంది. ఆసి యన్ పెయింట్ 2.38శాతం, విప్రో 1.80శాతం, యాక్సిస్ బ్యాంకు 1.64శాతం, డాక్టర్ రెడ్డీస్ 1.41 శాతం, కొటక్ మహీంద్రా 1.32శాతం, ఎల్ అండ్ టి 1.26శాతం నష్టాల్లో నమోదయ్యాయి. భారతి ఎయిర్‌టెల్ 1.75శాతం, ఎస్‌బీఐ 1.89శాతం ఎన్‌టిపిసి 0.67శాతం లాభాల్లో ముగిశాయి. విదేశీ మదుపరులు సుమారు రూ.291.86 కోట్లు షేర్లను కొనుగోలు చేశారు. దేశీయ మదుపరులు రూ.90.08 కోట్లు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఆసియా మార్కెట్లు నష్టాల్లో నమోదయ్యాయి. సింగపూర్ స్టాక్ ఎక్స్‌చేంజిలో నిఫ్టీ ఫ్యూచర్స్ 5.50 పాయింట్లు 0.05 శాతంతో 11,137వద్ద నమోదైంది. టెక్ మహీంద్రా ఆసియన్‌పెయింట్స్, టిసిఎస్ ఈ క్వార్టర్‌లో హాఫ్‌కలర్ ఫలితాలు వెల్లడించాయి. హెచ్‌డి ఎఫ్‌సి, పవర్‌గ్రిడ్, ఎల్‌అండ్‌టి 1శాతం నష్టాల్లో నమోద య్యాయి. బజాజ్ ఆటో, హీరో మోటాకార్ప్, ఎస్‌బీఐ మైనారిటీ షేర్లలో ఉన్నప్పటికీ గ్రీన్‌లో నమోదయ్యాయి. విస్తృత ప్రాతి పదికలో భారతీయ ఈక్విటీలు గత 13నెలలో సెన్సెక్స్, నిఫ్టీ 39శాతం పెరిగాయి.

అద్భుత ఫీచర్లతో మోటో ఎక్స్...!



విజయవాడ : 6జీబీ రామ్, 64 జీబీ అంతర్గత స్టోరేజీతో మోట రోలా సరికొత్త మోడల్ మోటో ఎక్స్ అందుబాటులోకి రానుంది. అద్భుత పీచర్లతో ఈ ఫోన్ కేవలం రూ.24,999లకే లభించ నుంది. మరి కొన్ని గంటల్లో అంటే బుధవారం అర్ధరాత్రి (జనవరి 31) నుంచి ఫ్లిఫ్‌కార్ట్, మోటో హబ్‌ల్లో ఎక్స్ క్లూజివ్‌గా దొరుకుతుంది. స్మార్టర్ ఆండ్రా యిడ్ 8.0 ఓరియో అనుభవాలతోపాటు వేగం, బ్యాటరీ దీర్ఘకాలిక మన్నిక, స్ప్లిట్-స్క్రీన్ సామర్థ్యం, స్మార్ట్ టెక్స్ ఎంపిక, అభి వృద్ధి చేసిన నోటిఫికేషన్స్, అతిక్లిష్టమైన పాస్‌వర్డ్ కోసం ఆటోఫిల్ ఫ్రేమ్‌వర్క్ గూగుల్‌ప్లే ప్రొటెక్ట్ దీని సొంతం. ఈ ఫోన్‌లో ప్రత్యేకమైన మోటో కీ ఫీచర్ ఉంది. సింపుల్‌గా వేలిని టచ్ చేసి మీ పాస్‌వర్డ్ - సెక్యూర్డ్ వెబ్‌సైట్‌లను ఫోన్ లేదా ల్యాప్‌టాప్‌ల ద్వారా పొందే అవకా శం ఉంది. ఈ ఫోన్‌లో స్నిప్పర్ 12 ఎంపీ ప్లస్ 8ఎంపీ వైడ్ యాంగిల్ రియర్ కెమెరా 120 డిగ్రీల వ్యూను అందిస్తుంది. ప్రైమరీ 12 ఎంపీ కెమెరా డ్యూయల్ ఆటో ఫిక్సల్‌తో అద్భుతంగా చిత్రీకరి స్తుంది. సెకండరీ 8 ఎంపీ కెమెరా వైడ్ యాంగిల్‌తో 120 డిగ్రీల కోణంలో మంచి డెప్త్‌తో చిత్రీకరిస్తుంది. ఇక 16 ఎంపీ ఫ్రంట్ కెమెరా ఫ్లాష్‌తో పని చేస్తుం ది. ఎంతటి కాంతి సమస్యనైనా అధిగ మించి, అద్భుత చిత్రాలను అందిస్తుంది.

ఫ్లిఫ్‌కార్ట్ ఆఫర్లు...!

ఫిబ్రవరి1, 2 తేదీలో ఫ్లిఫ్‌కార్ట్ పలు రాయి తీలు ప్రకటించింది. ఐసీఐసీఐ క్రెడిట్ కార్డుతో రూ.1500 ఫ్లాట్ రాయితీ పొంద వచ్చు. పాతఫోన్ మార్చుకుంటే రూ.3వేల తగ్గింపు, వోడాఫోన్‌పై రూ.199లు రీచార్జి చేసుకుంటే 490 జీబీవరకూ డాటా ఉచితం. 12 నెలల వరకూ ఎలాంటి వడ్డీ లేకుండా ఈఎంఐ రూ.2083కే ఫోన్ కొనుగోలు చేసే అవకాశం ఉంది.

ప్రపంచంలో రెండవ చౌక దేశం భారత్

గోబ్యాంకింగ్ రేట్స్ సర్వే

హ్యూస్టన్: ప్రపంచంలో దక్షిణ ఆఫ్రికా తరువాత రెండవ చౌక దేశంగా భారత దేశం నిలిచింది. సుమారు 112 దేశాల్లో గోబ్యాంకింగ్‌రేట్స్ నిర్వహించిన సర్వే ఈవిషయాన్ని వెల్లడిస్తోంది. నంబి యో అందించిన ఆన్‌లైన్ ధరల గణాం కాల ఆధారంగా నాలుగు ప్రధాన అం శాలను బేరీజు వేసిన అనంతరం సర్వే నివేదికను రూపొందించింది. స్థానిక కొనుగోలు శక్తి సూచి, అద్దె సూచి, సం కుల సూచి, వినియోగదారు ధర సూచి అనే నాలుగు అంశాలను సర్వేకు ప్రామాణికంగా తీసుకున్నట్లు గోబ్యాం కింగ్ రేట్స్ తెలిపింది. ఆదాయాలు తక్కువగా ఉన్నప్పటికీ వినియోగ వస్తువులు, సరకుల ధరలు తక్కువగా లభిస్తున్నందున ఇతర దేశాలతో పోల్చితే భారత్‌లో బతుకు బండిని లాగగలుగుతున్నారని సర్వే తెలిపింది. ఉదాహరణకు, కోల్‌కతలో ఒక మనిషి సుమారు 285డాలర్ల నెల సరి ఆదా యానికే బతుకుతున్న పరిస్థితి ఉన్నట్లు తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా చౌక దేశాలుగా గుర్తింపు పొందిన 50దేశాల్లో భారత్‌లో 1.25బిలియన్ల మంది ప్రజ లు ఉన్నారని తెలిపింది. ప్రధాన పరిశ్ర మల్లో టెక్స్‌టైల్స్ , కెమికల్స్, ఫుడ్ ప్రాసె సింగ్‌లు ప్రస్తావనార్హంగా ఉన్నాయని తెలిపింది. భారత్‌లో స్థానిక కొను గోలు శక్తి 20.9శాతం తక్కువగానూ, అద్దె 95.2శాతం తక్కువ సరకులు 74.4 శాతం చౌకగానూ, స్థానికంగా లభ్యమయే వస్తువులు, సేవలు 74.9శాతం చౌకగానూ ఉన్నట్లు సర్వే తెలిపింది. 13వ ర్యాంకులో నిలిచిన కొలంబియా, 14వ ర్యాంకులో నిలిచిన పాకిస్తాన్, 28వ ర్యాంకులో నిలిచిన నేపాల్, 40వ ర్యాంకులో నిలిచిన బంగ్లాదేశ్‌ల వంటి పొరుగు దేశాల కంటే భారత్ చౌక దేశమని సర్వే వివరించింది. జాబితా అగ్రస్థానంలో దక్షిణ ఆఫ్రికా నిలిచింది వ్యయ భరిత దేశాల్లో 112వ ర్యాంకులో బెర్ముడా, 111వ ర్యాంకులో బహామస్, 110వ ర్యాంకులో హాంగ్‌కాంగ్, 109వ ర్యాం కులో స్విట్జర్లాండ్ 108 వర్యాంకులో ఘనాలు ఉన్నట్లు సదరు సర్వే పేర్కొంది.



హైదరాబాద్‌లో ఎర్త్‌క్యూ స్టోర్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: సుప్రసిద్ధ ఆర్కిటెక్చరల్ స్టోర్ ఎర్త్‌క్యూ నగరంలో తన తొలిస్టోర్‌ను ప్రారంభించింది. ఫర్నిచర్, ఇంటీరియల్, లైఫ్ స్టైల్ ఉత్పత్తులు, యాక్సరీలను అందించే ఎక్స్‌క్లూజివ్ ఆర్కిటెక్చరల్ స్టోర్ అని ఎర్త్‌క్యూ డైరెక్టర్స్ మొహమ్మద్ అక్మలుద్దీన్, శిల్పా దర్శన్ కుమార్ తెలి పారు. ఎర్త్‌క్యూ ఉత్పత్తుల్లో నేచురల్ స్టోన్ క్లాడింగ్, ఫ్లోరింగ్, నేచురల్ స్టోన్ మ్యూరల్స్, నేచురల్ స్టోన్ వాష్ బేషిన్స్, సెమీ ప్రెషియస్ స్టోన్స్, ఎథ్నిక్ టైల్స్ ఇలా ఉన్నో ఉన్నాయన్నారు. ఇంటీరియల్ డెకరేషన్ మార్కెట్ వేగవంతమైన వృద్ధిలో ఉంద న్నారు. ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైన్‌కు సంబంధించిన సాంకేతికాంశా లలో అతి బలీయమైన బృందం తమకుందన్నారు. ఎర్త్‌క్యూ ఫ్రాంచైజీ షాలినీ దువ్వూరి మొదటి ఔట్‌లెట్‌ను ప్రారంభిస్తుండటం చాలా సంతోషంగా ఉందని, నూతన ఆలోచనలు, నేపథ్యాలను నగరం ఎప్పుడూ సాదరంగా స్వాగతిస్తూనే ఉంటుంద న్నారు. అందుబాటు ధరల్లో వినియోగ దారులకు ఇష్టమైన డిజైన్స్‌కు తగిన ఉత్పత్తులను ఈ షోరూమ్ అందిస్తుందన్నారు.

యప్ టీవీ వైట్ లేబుల్డ్ ఓటీటీ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: దక్షిణాసియా కంటెంట్‌కి యప్ టీవీ ఆస్థా గ్రూప్ టీవీ ఛానెల్స్ ప్రయాణాన్ని ఓటీటీ ప్రపంచంలో సొంతం చేసుకు న్నది. ఆధ్యాత్మిక, సాంస్కృతిక బ్రాండ్ ఆస్థా, యప్ టీవీ వైట్-లేబుల్డ్ వీడియో విధానాన్ని వెబ్, మొబైల్, కనెక్టె టీవీల డిజిటల్ ప్రపంచంలో ఉపయోగిస్తుంది. ఆస్థా మొబైల్ యాప్‌ని స్వామీ రామ్ దేవ్, ఆచార్య బాల ప్రారంభించారు. యోగా, ఆయుర్వేదం ద్వారా ఆధ్యాత్మికత, సహజమైన ఆరోగ్యంపై ప్రముఖ భారతీయ ఛానెల్ ఆస్థా ప్రయాణంలో ఒక కొత్త యుగా నికి ఇది ఆరంభమని చెప్పారు. ఆస్థా యాప్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజల్ని భారతదేశపు ఆధ్యాత్మికత, ధ్యానాలకు దగ్గర చేస్తుందన్నారు. ఆస్థా మొబైల్ యాప్ దేశ, విదేశాల్లోని యువతని భారతదేశపు ఆధ్యాత్మికత విలువ ఆధా రిత వ్యవస్థతో కలపటంలో, తమ జీవితాల్ని ఆధ్యాత్మికంగా, మానసికంగా, శారీరకంగా సుసంపన్నం చేసుకోవటంలో కీలకమైన పాత్ర పోషిస్తుంద న్నారు. యప్ టీవీ సిఇఒ ఉదయ్ రెడ్డి మాట్లాడుతూ, యువత, పెద్దవారిలో కూడా ఛానెల్ ఆధ్యాత్మికత, సంస్కృతిని ప్రోత్సహిస్తోందన్నారు. మా వైట్ లేబుల్డ్ ఓటీటీ విధానం ఛానెల్ యూజర్లను నేరుగా చేరుకోవటాన్ని, అందు బాటులోకి ఉండటాన్ని నిర్ధారిస్తుందన్నారు.

తలసరి ఆదాయం పెరిగినప్పటికీ....

జీడీపీలో పరిశోధనలకు అంతంత మాత్రమే..

న్యూఢిల్లీ: భారత్‌లో తలసరి ఆదాయం పెరిగినప్పటికీ స్థూల జాతీయోత్పత్తిలో పరిశోధన, అభివృద్ధిరంగాలలో అతి తక్కువ శాతాన్ని ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. చైనా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోల్చి చూసుకుంటే మన దేశంలో రీసెర్చిరంగంపై దృష్టి తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. 2016-17లో భారత జీడీపీలో ఆర్ అండ్‌డికి కేవలం 0.7శాతం మాత్రమే ఖర్చుపెట్టగా, 2016లో ఆరు పేటెంట్లుకోసం ఫైల్‌చేసినట్లు తెలుస్తోంది. వీటిలో ఐదు ఆమోదం పొందాయి. అంటే కేవలం మిలియన్ జనాభాకు ఆరు పేటెంట్లు దాఖలు చేయడమైంది. తలసరి ఆదాయంతో పోల్చుకుంటే మన దేశంలో ఆర్ అండ్ డిపై ఖర్చు చేసే వ్యయం చైనా కన్నా వేగంగానే వృద్ధి చెందింది. ఆదాయ స్థాయిలు పెరిగినప్పుడు చైనాతో చూసుకుంటే మాత్రం చైనా ముందంజలో ఉంది. చైనా, ఇజ్రాయెల్, సౌత్‌కొరియా, జపాన్, యుఎస్, దేశాలతో పోల్చి చూసుకుంటే భారత్‌లో ఆర్ అండ్ డిపై ఖర్చు పెడుతున్నది నామమాత్రంకంటే తక్కువే... మన దేశంలో ఆర్‌అండ్‌డి వ్యయం ప్రభుత్వ బాధ్యత అయితే ఇతర దేశాల్లో ప్రైవేటు పెట్టుబడులే ముఖ్యంగా ఉంటాయి. 2017-18 సంవత్సర ఆర్థిక సర్వేలో ప్రైవేటు- ప్రభుత్వ సమన్వయ ప్రతిపాదనతో డార్క్‌మేటర్, జీనోమిక్స్, సైబర్- ఫిజికల్ సిస్టమ్స్‌ను మరింత అభివృద్ధి పరచవలసిందిగా సూచించింది. 2015లో చైనాలో కార్పొరేట్286మిలియన్లు ఖర్చు చేయగా, అమెరికాలో 341 బిలియన్లుఖర్చు పెడుతున్నారు. భారత్ మాత్రం కేవల 17 బిలియన్లు ఖర్చు పెడుతున్నట్లు నమోదైంది. ప్రపంచంలో సైంటిఫిక్ పబ్లికేషన్స్‌లో భారత్ ఆరవస్థానాన్ని పొందిన ప్పటికీ, రీసెర్చి లక్ష్యాలకన్నా మించి ఇన్సెంటివ్స్‌లే ప్రాతిపది కలగా ఉన్నాయి. జర్నల్‌లో ప్రచురితమైనప్పటికీ, పేటెంట్స్ సాంకేతికతకు దర్పణం లాంటివని తాజా నివేదిక వెల్లడిం చింది. 1990 దశకం ముందు భారత్,చైనాలు పేటెంట్స్ అప్లికేషన్లు ఫైల్ చేయడంతో శూన్యం అని చెప్పవచ్చు.



కేంద్ర ప్రభుత్వోద్యోగాల్లో

'యాసిడ్' బాధితులకు కోటా

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వోద్యోగాల్లో యాసిడ్‌దాడులకు గురయిన వారికి కోటా కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అధికార వర్గాల సమా చారం ప్రకారం మొత్తం ఖాళీల్లో ప్రస్తుతం అమలు చేస్తున్న మూడు శాతం కోటాను నాలుగు శాతానికి పెంచింది. యాసిడ్ దాడి బాధితులు, ఆటిజమ్, మానసిక రుగ్మతలకు గురయిన దివ్యాంగులకూ ఆయా ఉద్యోగాల్లో కోటా కింద రిజర్వేషను సదుపాయాన్ని వర్తింపజేయ నున్నారు. అంధులకు ఒక శాతం. ఆటిజం, మానసిక రుగ్మతల బాధితు లకు వంతున పోస్టుల్లో రిజర్వేషను సౌకర్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వ విభాగాలన్నిటికీ సిబ్బంది, శిక్షణ శాఖ లేఖలు రాసింది. 2005లో జారీ చేసిన నోటిఫికేషను ప్రకారం పైన పేర్కొన్న వర్గాలకు మూడు శాతం రిజర్వేషను వర్తింపజేస్తున్నారు.

Downloaded From Telugu e News App play.google.com/store/apps/details?id=com.roshan.enews

ఆక్వాపై అవగాహన ఉండాలి..

లేకుంటే నష్టాలే

ఇతర వ్యవసాయ రంగాలతో పోలిస్తే చేపల పెంపకంలో లాభాలు ఎక్కువ. అందుకే ఎక్కువ మంది రైతులు చేపల పెంపకం వైపు మొగ్గు చూపుతున్నారు. ఆక్వారంగం ప్రతి సంవత్సరం అభివృద్ధి చెందుతూ కొత్త రైతులను ఆకర్శిస్తోంది. ఈ నేపథ్యంలో సరైన యాజమాన్య పద్ధతులపై అవగాహన లేమి కారణంగా నష్టాల బారిన పడుతున్నారు. దీన్ని అధిగమించే లక్ష్యంతో చేపల సాగులో ప్రత్యేకించి ప్రస్తుత సీజన్‌లో వచ్చే వ్యాధులు, నీటి నాణ్యతలో జరిగే మార్పుల గురించి శాస్త్రవేత్తలు రైతులకు అందిస్తున్న సూచనలు, సలహాలు ఈ విధంగా ఉన్నాయి.



నీటి నాణ్యత నిర్వహణ చాలా ముఖ్యం

వాతావరణంలో సంభవిస్తున్న మార్పులు, దానివల్ల చెరువు నీటి నాణ్యతలో వచ్చే మార్పులతో చేపలు ఒత్తిడికి గురవుతాయి. ఒత్తిడిలో ఉన్న చేపలపై పరాన్న జీవులు తేలికగా దాడిచేసి, అధిక నష్టాన్ని కలిగిస్తాయి. చేపలు శీతల రక్తజీవులు కావడం వల్ల వాటి శరీర ఉష్ణోగ్రతను నీటి ఉష్ణోగ్రతకు అనువుగా సర్దుబాటు చేసుకుంటాయి. ఈ ప్రక్రియ చేపలపై సాధారణ ఒత్తిడిని కలుగజేస్తుంది. కొన్నిసార్లు అధిక ఒత్తిడికి గురికావడం వల్ల చనిపోవడం లేదా చురుకుగా లేకపోవడంవల్ల పరాన్న జీవులు ఆశించి, వ్యాధుల బారిన పడుతున్నాయి. అధిక ఒత్తిడికి గురికావడానికి ఆక్సిజన్ తక్కువగా ఉండటం, ఇతర విషవాయువులు (అమ్మోనియా, హైడ్రోజన్ సల్ఫైడ్, నైట్రేట్) ఏర్పడటం ప్రధాన కారణం. వేకువజామున నీటిలో కరిగిన ఆక్సిజన్ స్థాయిలు తక్కువగా ఉంటాయి. శీతాకాలంలో రాత్రినుంచి ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల ఉపరితలంలో నీరు చల్లబడుతుంది. చల్లబడిన నీరు బరువెక్కి ఒక్కసారిగా చెరువు అడుగుభాగానికి చేరి, అడుగు భాగాన్ని చెదరగొడుతుంది. దీని కారణంగా అడుగు భాగాన ఉన్న విషవాయువులు నీటిలో చేరి, అధిక ఒత్తిడిని కలుగజేస్తుంది. నీటిలో ఆక్సిజన్ 4 పీపీఎం కంటే అధికంగా ఉంటే చేపలు చాలావరకు ఒత్తిడికి గురికావు.



పరాన్న జీవుల వల్ల కలిగే వ్యాధులు

ఆర్గులోసిస్ (చేప పేను వ్యాధి) : కార్ప్ జాతి చేపలు ఎక్కువగా ఆర్గులోసిస్ వ్యాధికి గురవుతుంటాయి. ఈ వ్యాధి ఆర్గులస్ (పేను) పరాన్నజీవి వల్ల సంక్రమిస్తుంది.

లక్షణాలు : ఆర్గులస్ చేప దేహాన్ని అంటిపెట్టుకుని రక్తాన్ని పీలుస్తాయి. ఇవి ముందుగా చేప సున్నిత ప్రదేశాలైన వాజాలు, ఉదరభాగాలను ఆశిస్తాయి. అవి ఉన్నచోట చిన్నపుండ్లు పడతాయి. దీని కారణంగా చేప మేత సరిగా తీసుకోక, పెరుగుదల మందగిస్తుంది.

లెర్నియోసిస్ (పుడక పురుగు లేక లంగరు పురుగు వ్యాధి) : లెర్నియా కూడా ఎక్కువగా కార్ప్ జాతి చేపల పెంపకంలో ఎక్కువ నష్టాన్ని కలుగజేస్తుంది. ఇవి చూడానికి దారపు పోగుల్లా కనిపిస్తాయి.

లక్షణాలు : ఇవి ఎక్కువగా చిన్న చేపలపై (100 గ్రాముల లోపు) దాడి చేస్తాయి. ఆర్గులస్ మాదిరిగానే లెర్నియా కూడా చేపల రక్తాన్ని పీలుస్తుంది. ఇవి ఉన్నచోట పొలుసులు ఊడిపోతాయి. ఇవి ఆశించిన చేపలకు పుండ్లు పడి, ఇన్‌ఫెక్షన్లకు గురవుతాయి.

శంకు జలగ వ్యాధి : డాక్టయిలో పైరస్ పరాన్న జీవి వల్ల ఈ వ్యాధి వస్తుంది. ఇది చాలా సూక్ష్మంగా ఉంటుంది. ఇది దాదాపు అన్ని చేపలను ఆశిస్తుంది. ఈ వ్యాధి ముఖ్యంగా బొచ్చె చేపలకు వస్తుంది. ఈ పరాన్నజీవులు ముందుగా చేప మొప్పల్లోని కణజీవులను నాశనం చేస్తాయి. దీంతో నీటిలో ఆక్సిజన్ తక్కువగా ఉన్నపుడు చేపలు విపరీతంగా చనిపోతాయి.

లక్షణాలు : మొప్పల నుంచి జిగురు అధికంగా స్రవిస్తుంది. మొప్పలపై జిగురు ముద్దగా ఏర్పడటంతో ఆక్సిజన్ తీసుకోవడం కష్టమవుతుంది. మొప్పలు పాలిపోయినట్లుగా కనిపిస్తాయి.

వ్యాధి నియంత్రణా యాజమాన్యం : పై మూడు వ్యాధులలో పేర్కొన్న లక్షణాలు కనిపించిన వెంటనే ఎకరానికి 70 కిలోల ఉప్పును వెంటనే నీటిలో కరిగించి చెరువంతా చల్లాలి. ఒకరోజు తరువాత ఫార్మలిన్ ఎకరానికి రెండు లీటర్లు లేదా టీకేజీ ఒక లీటరు చొప్పున పిచికారీ చేయాలి. ఎకరానికి 100-150 మిల్లీలీటర్ల డెల్టామిత్రన్ చల్లడం ద్వారా కూడా చాలావరకు ఈ వ్యాధులను నియంత్రించవచ్చు. మంచి యాజమాన్య పద్ధతులు పాటించి, వ్యాధులు రాకుండా జాగ్రత్త వహిస్తే ఎంతో మేలు కలుగుతుంది.

వేప ఉత్పత్తులతో

ఉపయోగాలెన్నో..



వేప ఉత్పత్తులు ఇటు మానవాళికి, వివిధ పంటల రక్షణకు దోహదపడుతున్నాయి. వేప చెట్టులో వేరు మొదలుకొని బెరడు, ఆకులు, పువ్వులు, పండ్లు, విత్తనాలు తదితర అన్ని భాగాలు ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. ఎరువులు దుకాణదారులు సొమ్ము చేసుకోవడానికి చెప్పే మాటలను నమ్మి పంటల సాగులో విచక్షణారహితంగా రసాయనిక, పురుగు మందులను బస్తాల కొద్దీ గుమ్మరించరాదు. సాగునేల ఆరోగ్యాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలి. వేప ఉత్పత్తులను సాగులో వాడితే సాగు ఖర్చు చాలా ఆదా అవుతుంది. ఆశించిన రీతిలో దిగుబడులు వస్తాయి. ముఖ్యంగా నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఉత్పత్తులు చేతికి అందుతాయి. వేప ఉత్పత్తులు, వాటి ఉపయోగాలపై శాస్త్రవేత్తల సూచనలు ఈవిధంగా ఉన్నాయి.

300 రకాల కీటకాల నాశనం

వేపలో అజాడిరాక్టిన్ అనే పదార్థం ఉంది. దీనికి 300 రకాల కీటకాలు, నల్లిజాతి పురుగులు, చెదలు, కొన్ని రకాల బూజు శిలీంద్రాలను అరికట్టే శక్తి ఉంది. ఇది వరి, పత్తి, అపరాలు, కూరగాయలు, పండ్ల మొక్కలు, కాఫీ, జొన్న ఉద్యానవన పంటల్లో వచ్చే కీటకాలను అరికడుతుంది. మార్కెట్‌లో వేప పిండి, వేపనూనె, వేప కషాయం, వివిధ రకాల వేప ఉత్పత్తులు లభిస్తున్నాయి.

ఉత్పత్తులు పనిచేసే విధానం

నీమ్ ఆయిల్‌ను వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు వాడితే కీటకాల పెరుగుదలను నిరోధిస్తుంది. ఈ మందును స్ప్రే చేసినప్పుడు పురుగులకు వికారం కలిగి పంటను తినకుండా చేస్తుంది. విషపూరిత అవశేషాలుండవు. ఈ మందు పక్షులు, మానవులు, మిత్రపురుగులు, తేనెటీగలు వంటి జీవాలకు హాని చేయదు. సీతాకోక చిలుకలు, తల్లిరెక్క పురుగులు పెట్టిన గుడ్లు పొదగక, ఎక్కువ శాతం చనిపోతాయి. సమగ్ర సస్యరక్షణ విధానంలో ఈ మందులు బాగా ఉపయుక్తమవుతాయి. ఒక మాదిరి వేడి వాతావరణం వల్ల ఈ మందులు నిరుపయోగం కాకుండా ఉంటాయి. అలా అని బాగా ఎండలో ఈ మందులను పిచికారీ చేయరాదు. ఎండలో పిచికారీ చేస్తే మందు ప్రభావం తగ్గిపోతుంది. పురుగు మందులు, శిలీంద్ర నాశినులతో కలిపి సురక్షితంగా స్ప్రే చేసుకోవచ్చు.

పిచికారీకి సానుకూల సమయమిది

పైరుపై పురుగు ఆశించిన వెంటే పిచికారీ చేయాలి. తల్లి పురుగు గుడ్లు పెట్టినట్లు గమనించిన వెంటనే చేస్తే ఇంకా మంచిది. ఎకరాకు 3 నుండి 5 మిల్లీలీటర్ల నీమ్ ఆయిల్‌ను లీటరు నీటికి కలిపి స్ప్రే చేయాలి. వాతావరణం చల్లగా ఉన్న సమయాలలో (ఉదయం లేక సాయంత్రం) పిచికారీ చేయాలి. 7నుంచి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేసుకోవాలి. పిచికారీ చేసిన ఆరు గంటల వ్యవధి లోపు వర్షం కురిస్తే మళ్లీ చల్లాల్సిందే.

వివిధ పంటల్లో తెగుళ్ల నివారణ ఇలా..

వివిధ పంటల్లో వేపమందు వాడకంతో పలు రకాల చీడపీడలను నివారించుకోవచ్చు. వరిపంటకు ఎకరాకు 150 నుంచి 200 కిలోల వేప పిండిని దమ్ములో వేయడం వల్ల కాండం తొలిచే పురుగు, ఉల్లికోడును అదుపు చేయవచ్చు. వరిపైరుపై లీటరు నీటికి 3 మిల్లీలీటర్ల చొప్పున కలిపిన ద్రావణాన్ని ఎకరాకు 200 లీటర్ల చొప్పున పిచికారీ చేస్తే అగ్గితెగులు, తొడిమి కుళ్లు, పొడ తెగులు, వరి తుంగ్రో వైరస్ తెగుళ్లను అదుపు చేసుకోవచ్చు. 5 శాతం వేపగింజల కషాయం ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని మిర్చిపైరుపై పిచికారీ చేస్తే తెల్లదోమను అరికట్టవచ్చు. తద్వారా మిర్చిమీద వచ్చే జెమినీ వైరస్ తెగులు అదుపులో ఉంటుంది. వేరుశనగ పైరును ఆశించి ఎక్కువగా నష్టపరిచే తిక్కా ఆకుమచ్చ తెగులు, టమాటా సాగులో ఎండు తెగులును వేపనూనెతో నివారించవచ్చు.





పోషక విలువలు అపారం

వేపచెక్కలో నత్రజని 5.6 శాతం, భాస్వరం 1.1 శాతం, పొటాష్ 1.4 శాతం, వేపపిండిలో నత్రజని 2-3 శాతం, భాస్వరం 1.0 శాతం, పొటాష్ 1.4 శాతం చొప్పున పోషక విలువలు ఉన్నాయి. వీటితోపాటు పశువుల ఎరువు వాడుకుంటే పంటలకు మేలు చేకూరుతుంది. వేపగింజల నుంచి నూనె తీస్తారు. నూనె తీయగా వచ్చే వేప చెక్క, ఎండిన వేపకాయలను దంచగా వేప పిండి తయారువుతుంది. ఈ పిండిని ఎక్కువగా వరిపంట, నిమ్మతోటలకు ఎక్కువగా వాడవచ్చు. తద్వారా రైతులు మంచి దిగుబడులు సాధించి, లాభాలు పొందవచ్చు.

ఇంటిలోనే వేప కషాయం తయారీ


పంటకు అవసరమైన వేప కషాయాన్ని కూడా ఇంట్లోనే తయారుచేసుకోవచ్చు. 5 కిలోల వేపగింజలు నలుగగొట్టి 6 నుంచి 7 లీటర్ల నీటిలో ఒకటి నుంచి రెండురోజులు నానబెట్టాలి. వచ్చిన ఆ చూర్ణాన్ని వస్త్రంలో పోసి, వడకట్టాలి. మరో వంద లీటర్ల నీటిని అందులో కలపాలి.

రాశీఖన్నా న్యూ లుక్





'కాంచన 2' రీమేక్‌లో అక్షయ్ కుమార్



ప్రముఖ నటుడు, కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కాంచన'. ఈ చిత్రం అటు తమిళంలోనే కాకుండా తెలుగులోనూ మంచి విజయం సాధించింది. ఇందులో రాఘవ, రాయ్ లక్ష్మి జంటగా నటించారు. ప్రముఖ నటుడు శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఆ తరువాత 2015లో దీనికి సీక్వెల్‌గా 'కాంచన 2' వచ్చింది. ఇది తెలుగులో 'గంగ' టైటిల్‌తో విడుదలైంది. ఇందులో రాఘవ, తాప్సి, నిత్యా మీనన్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రం తెలుగు, తమిళంతో కలిపి దాదాపు రూ.120 కోట్ల వసూళ్లు రాబట్టింది. ఇప్పుడు 'కాంచన 3' సిద్ధం కాబోతోంది. ఇందులో రాఘవకు జోడీగా ఓవియా నటిస్తున్నారు. కాగా..'గంగ' బాలీవుడ్‌లో రీమేక్‌గా రాబోతోంది. రాఘవ పాత్రలో ప్రముఖ బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ నటించనున్నారు. ఈ విషయాన్ని చిత్ర వర్గాలు సోషల్‌మీడియా వేదికగా వెల్లడించాయి. క్రిఅర్జ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై ప్రేరణ అరోరా, అర్జున్ కపూర్ ఈ చిత్రానికి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. సెప్టెంబర్‌లో సినిమా చిత్రీకరణను మొదలుపెట్టనున్నారు. 2019లో ఈ సినిమా విడుదల కాబోతోంది. మరోపక్క అక్షయ్ నటించిన 'ప్యాడ్‌మ్యాన్' చిత్రం ఫిబ్రవరిలో విడుదలకు సిద్ధమైంది. ఇదేకాకుండా అక్షయ్..'గోల్డ్', 'కేసరి' చిత్రాలతో బిజీగా ఉన్నారు.

ఎన్టీఆర్‌కు జోడీగా శ్రద్ధా కపూర్





'సాహో' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం కాబోతోంది బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్. తొలి తెలుగు చిత్రంతోనే అగ్ర కథానాయకుడు ప్రభాస్‌కు జోడీగా నటించే అవకాశం దక్కించుకున్న శ్రద్ధ ఇప్పుడు ఎన్టీఆర్‌కు జోడీ కట్టబోతున్నట్లు టాలీవుడ్ వర్గాల సమాచారం. ప్రస్తుతం ఎన్టీఆర్.. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో ఎన్టీఆర్‌కు జోడీగా అను ఇమ్మానుయేల్ నటిస్తున్నట్లు తొలుత వార్తలు వెలువడ్డాయి. అయితే ఇప్పుడు అను స్థానంలో శ్రద్ధను ఎంపిక చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇటీవల త్రివిక్రమ్ ఈ సినిమా కథను శ్రద్ధకు వివరించారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మధుబాబు రచించిన ఓ డిటెక్టివ్ నవల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం శ్రద్ధ నటిస్తున్న 'సాహో' చిత్రానికి సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. మరోపక్క బాలీవుడ్‌లో శ్రద్ధ 'స్త్రీ' అనే చిత్రంలో నటిస్తోంది. ఇన్ని సినిమాలతో బిజీగా ఉన్న శ్రద్ధ త్రివిక్రమ్-ఎన్టీఆర్ చిత్రంలో నటించేందుకు ఒప్పుకుంటుందో లేదో చూడాలి. ఈ సినిమానే కాకుండా ఎన్టీఆర్.. దర్శకధీరుడు ఎస్.ఎస్ రాజమౌళి దర్శకత్వంలో ఓ మల్టీస్టారర్ చిత్రంలో నటించనున్నారు. ఇందులో తారక్..రామ్‌చరణ్‌తో తెర పంచుకోనున్నారు.

అందుకే 'అర్జున్ రెడ్డి'కి నో చెప్పా





విజయ్ దేవరకొండ నటించిన 'అర్జున్ రెడ్డి' బాక్సాఫీస్ వద్ద ఎంతటి విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో విజయ్‌కి జోడీగా శాలిని పాండే నటించారు. ఇప్పుడు ఈ సినిమాను బాలీవుడ్‌లో రీమేక్ చేయనున్నారు. ఇందులో విజయ్ పాత్రలో రణ్‌వీర్ సింగ్‌ను తీసుకోవాలనుకున్నారు. కానీ రణ్‌వీర్ సినిమాకు ఒప్పుకోకపోవడంతో షాహిద్ కపూర్‌ను ఎంపికచేసుకున్నారు. హిందీలోనూ సందీప్ రెడ్డినే దర్శకత్వం వహించనున్నట్లు తెలుస్తోంది. అయితే 'అర్జున్‌రెడ్డి'కి ఒప్పుకోకపోవడానికి కారణమేంటో తాజాగా రణ్‌వీర్ వెల్లడించాడు. ఈ సినిమాలో హీరో మద్యం తాగుతూ ఉంటాడు. కానీ రణ్‌వీర్‌కి మద్యం తాగే అలవాటు లేదట. అందుకే సినిమాకు ఒప్పుకోలేదని వెల్లడించాడు. అదీకాకుండా సినిమాకు ఎనిమిది కిలోల వరకు బరువు తగ్గాలని చెప్పారట. ఇవన్నీ తాను చేయలేకే సినిమాకు ఒప్పుకోలేదని పేర్కొన్నాడు. ఈ సినిమాకు షాహిద్ కపూర్‌ను ఎంపికచేసుకోవడానికి ఓ కారణం ఉంది. షాహిద్ 'ఉడ్తా పంజాబ్' చిత్రంలో మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వ్యక్తిగా నటించాడు. అతను డ్రగ్స్ తీసుకోకపోయినా అలవాటున్నవాడిలాగే నేచురల్‌గా నటించడంతో విజయ్ పాత్రకు సరిగ్గా సరిపోతాడని షాహిద్‌ను ఎంపికచేశారట. త్వరలో ఈ సినిమా చిత్రీకరణ మొదలుపెట్టనున్నట్లు బాలీవుడ్ వర్గాల సమాచారం

రజనీ అభిమానులకు మళ్లీ నిరాశే

సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులకు మళ్లీ నిరాశే ఎదురైంది. ఆయన కథానాయకుడిగా నటించిన '2.ఓ' చిత్రానికి వాయిదాల పర్వం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకొంటోంది. అన్నీ అనుకున్నట్లు జరిగి ఉంటే ఈ సినిమా జనవరి 26న విడుదలయ్యేది. కానీ వీఎఫ్‌ఎక్స్ పనులు పూర్తికాకపోవడంతో కనీసం టీజర్‌ను కూడా చిత్ర బృందం విడుదల చేయలేదు. దాంతో సినిమాను ఏప్రిల్‌కు వాయిదా వేశారు. కానీ ఇప్పుడు ఏప్రిల్‌లోనూ ఈ సినిమా విడుదలకు నోచుకోవండలేదు. ఏప్రిల్ నుంచి మరో రెండు, మూడు నెలలకు సినిమా వాయిదా పడినట్లు చిత్రవర్గాలు ట్విట్టర్ ద్వారా వెల్లడించాయి. ఈ సినిమా టీజర్‌కు సంబంధించిన పని లాస్ ఏంజెల్స్‌లోని మాబ్‌సీన్ సంస్థలో జరుగుతోందని ఇటీవల దర్శకుడు శంకర్ ట్విటర్ ద్వారా వెల్లడించారు. ఈ పని పూర్తవ్వగానే టీజర్‌ను విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే విడుదల చేసిన మేకింగ్ వీడియో సినిమాపై అంచనాలను పెంచేసింది. ఈ నేపథ్యంలో టీజర్‌పై మరింత ఆసక్తి పెరిగింది. హైదరాబాద్‌లో త్వరలో టీజర్‌ను విడుదల చేయనున్నారు. మరి అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం 2018లోనైనా విడుదలకు నోచుకుంటుందేమో వేచిచూడాలి.



డీ గ్లామర్ లుక్‌లో అనుష్కశర్మ

బాలీవుడ్ బ్యూటీ అనుష్క శర్మ, ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీని వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. పెళ్ళి తర్వాత కొన్నాళ్లు విదేశాలలో విహరించిన ఈ జంట ప్రస్తుతం ఎవరి పనులతో వారు బిజీగా ఉన్నారు. విరాట్ కోహ్లీ దక్షిణాఫ్రికా టూర్‌లో బిజీగా ఉంటే, అనుష్క తన తాజా ప్రాజెక్ట్ సుయి ధాగాతో బిజీగా ఉంది. శరత్ కతారియా దర్శకత్వంలో తెరకెక్కు తున్న ఈ సినిమాలో వరుణ్ ధావన్ ప్రధాన పాత్ర పోషిస్తున్నాడు. ఈ చిత్రం కోసం వరుణ్ ధావన్ మిషన్ కుట్టడం నేర్చుకుంటే, అనుష్క శర్మ ఎంబ్రాయిడరీ నేర్చుకుంటోంది. యశ్ రాజ్ ఫిలింస్ సంస్థ రీసెంట్‌గా అనుష్క ఎంబ్రాయిడరీ నేర్చుకుంటున్న ఫోటో షేర్ చేసింది. అయితే తాజాగా చిత్రంలో అనుష్కకి సంబంధించిన ఫోటో ఒకటి లీక్ అయింది. డీ గ్లామర్ లుక్‌లో చీర కట్టుకొని ఉన్న అనుష్క శర్మ ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఇందులో అనుష్కని చూసి అభిమానులు అవాక్కయ్యారు.



Downloaded From Telugu e News App play.google.com/store/apps/details?id=com.roshan.enews



మహాత్మాగాంధీకి ప్రధాని మోడీ నివాళి

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ 70వ వర్థంతి సందర్భంగా ప్రధాని మోడీ ఘన నివాళి అర్పిం చారు. దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన ఎందరో త్యాగధనులను ఆయన గుర్తు చేసుకున్నారు. బాపు పుణ్యతిథి కారణంగా ఆయన్ను గుర్తు చేసుకుని నివాళి అర్పించానని ఆయన ట్వీట్ చేశారు. దేశవిముక్తి కోసం ఎందరోమహానులు చూపిన అసమాన ధైర్యసాహసాలను ప్రధాని శ్లాఘించారు.

పద్మావత్‌కు అమెరికాలో అనూహ్య ఆదరణ



న్యూఢిల్లీ : సంజయ్‌లీలా బన్సాలీ వివాదాస్పద సినిమా 'పద్మావత్' ఉత్తర అమెరికాలో భారీ వసూళ్లు రాబట్టింది. ఈ సినిమా మొదటి 4 రోజుల్లో 4.9 మిలియన్ డాలర్లు వసూలు చేసి రికార్డు సాధించింది. అమెరికా, కెనడాల్లో 2డీ,3డీ ఐమ్యాక్ 3డీలు కలసి మొత్తం 326 థియేటర్లలో ఈ సినిమాను ప్రదర్శిస్తున్నారు. ఇప్పటివరకు ఏ బాలీవుడ్ సినిమా ఇంత కలెక్షన్లను రాబట్టలేదని బాక్సాఫీసు గురు ఒక ప్రకటనలో తెలిపారు. 2014లో అమీర్‌ఖాన్ పీకే వారాంతానికి 3.6 మిలయన్లను రాబట్టి అప్పట్లో రికార్డు నెలకొల్పింది. దీపికా పదుకోణె, రణ్వీర్‌సింగ్, షాహిద్ కపూర్‌లు ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా విడుదలైన మొదటి రోజే 1.85 మిలియన్ డాలర్లు వసూలు చేసిందన్నారు. ఉత్తర అమెరికాలో విడుదలైన హిందీ సినిమాలు పూర్తి స్థాయిలో ప్రదర్శిస్తే వచ్చే వసూళ్లను కేవలం నాలుగురోజుల్లో పద్మావతి వసూలు చేసిందని గురు వెల్లడించారు.

బీజేపీ ఓటమే ధ్యేయం..!

బెంగళూరు: కర్ణాటకలో బీజేపీ ఓటమికి తాను శాయశక్తులా కృషిచేస్తానని గుజరాత్ దళిత నేత జిగ్నేష్ మేవానీ స్పష్టం చేశారు. కొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న కర్ణాటకలో ఏప్రిల్‌లో పర్యటిస్తానని చెప్పారు. "రాష్ట్రంలోని 20 శాతం దళితులను వేడు కుంటున్నాను.. మీ 20 ఓట్లు కూడా బీజేపీకి వేయొద్దు. ఏప్రిల్‌లో రెండు వారాల పాటు కర్ణాటకలో పర్యటిస్తా" అని మేవానీ అన్నారు. బెంగళూరులో జర్నలిస్ట్ గౌరీ లంకేష్ 55వ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తనతో కలిసి వచ్చే అన్ని రాజకీయ పార్టీలతో తాను చేతులు కలుపుతానని మేవానీ స్పష్టం చేశారు. రాష్ట్రంలో చెడ్డీదారీస్‌ను ఓడించడానికి కలిస ?వచ్చే అన్ని ప్రధాన పార్టీలతో చేతులు కలిపేందుకు సిద్ధమని మేవానీ ప్రకటించారు. బీజేపీకి ఓటు వేయొద్దని ఆయన కోరారు. రాష్ట్రంలోని దళితులందరితో తాను మాట్లాడ తానని చెప్పారు. "రాజ్యాంగాన్ని కాపాడు కునేందుకు నా సిద్ధాంతాల విషయంలోనూ రాజీ పడటానికి నేను సిద్ధం. కర్ణాటకలో బీజేపీని గెలవకుండా చూస్తా" అని మేవానీ అన్నారు. దేశంలో ఉద్యోగాల కల్పన, రైతు ఆత్మహత్యల నివారణలో బీజేపీ పూర్తిగా విఫలమైందని, కేవలం లవ్ జిహాద్‌లాంటి అంశాలపైనే దృష్టి సారించారని విమర్శించారు

సైన్యంపై కాశ్మీర్ సర్కారు కేసు?!

- బీజేపీకి పీడీపీ ఝలక్
- ఇరకాటంలో కమలనాథులు



శ్రీనగర్ : అధికారం కోసం సిగ్గులజ్జ వదిలేసిన బీజేపీకి కాశ్మీర్ సీఎం ఝలక్ ఇచ్చారు. వేర్పాటువాద పార్టీతో చెట్టా పట్టాలేసుకుని అధికారాన్ని అనుభవిస్తున్న బీజేపీకి ప్రస్తుతం దిక్కుతోచని స్థితి ఏర్పడింది. తమపై దాడి చేసిన అల్లరి మూకలపై కాల్పులు జరిపిన సైన్యంపై కాశ్మీర్ ప్రభుత్వం కన్నెర్ర చేసింది. హత్య, హత్యాయత్నం కేసులు పెట్టింది. దీనితో అక్కడి బీజేపీ ఎమ్మెల్యేలకు దిక్కుతోచని స్థితి ఏర్పడింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఈ వ్యవహారంపై తీవ్ర చర్చ జరుగుతోంది. సైన్యంపై కేసు నమోదు చేయ టంపై సర్వత్రా అవాక్కయ్యారు. ఇప్పటి వరకూ తమ నరనరాన దేశభక్తి ఉన్నట్టు పూనకంతో ఊగిపోయే.. కమలనాథులు కిక్కురమనటం లేదు. కాశ్మీర్‌లో అధికారం చేజార్చుకోలేక, కక్కలేక మింగలేక అధిష్ఠానం అల్లాడి పోతోంది. ఇదే తరుణంలో జమ్మూకాశ్మీర్ సీఎం ముఫ్తీ మెహబూబాపై బీజేపీ నేత, ఎంపీ సుబ్రమణ్యన్ స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. సైన్యంపై కేసు నమోదు చేయటం ఏంటని? ఆయన కాశ్మీర్ ప్రభుత్వంపై విరుచుకు పడ్డారు. మంగళవారం ఓ జాతీయ మీడియాతో స్వామి మాట్లాడుతూ, "సైన్యంపైనే కేసా? ఆమె తీసుకున్న నిర్ణయం అర్థం పర్థం లేనిది. ఈ అంశంలో కేంద్రం వెంటనే జోక్యం చేసుకోవాలి. తక్షణమే కేసు వెనక్కి తీసుకోకపోతే.. విచక్షణ అధికారాలను ఉపయోగించి ప్రభుత్వాన్ని రద్దు చెయ్యండి" అని సుబ్రమణ్య స్వామి వ్యాఖ్యానించారు. కాగా, ఈ వివాదం ఇప్పుడు పీడీపీ-బీజేపీ మిత్రపక్షం మధ్య చిన్నగా చిచ్చును రాజేస్తోంది. మెహబూబా నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేబినెట్ నుంచి బయటకు వచ్చేందుకు బీజేపీ నేతలు సిద్ధం కావటం కలకలం రేపింది. అధిష్టానం సూచనలతో వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. దక్షిణ కాశ్మీర్ షోపియాన్ జిల్లాలోని గోవాంపురా ప్రాంతంలో శనివారం సైనిక వాహన శ్రేణిపై దాదాపు 250 మందికి పైగా నిరసనకారులు రాళ్లు రువ్వారు. అంతేకాదు ఒక అధికారి నుంచి ఆయుధాన్ని లాక్కు నేందుకు ప్రయత్నించారు. దీంతో సైనికులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఇద్దరు పౌరులు మృతి చెందారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు.

దీంతో లోయలో పరిస్థితి ఒక్క సారిగా మారిపోయింది. జవాన్ల కాల్పుల్లో పౌరుల మృతికి నిరసనగా వేర్పాటు వాదులు ఒక్క రోజు బంద్‌కు పిలుపునిచ్చారు. ఘటనపై పూర్తి నివేదిక సమర్పించాలని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ సైన్యాన్ని ఆదేశించారు. మరోవైపు కాల్పుల జరిపిన సైన్యంపై జమ్మూ కాశ్మీర్ పోలీసులు కేసు నమోదుచేశారు. గర్వాల్ 10 బెటాలియన్‌పై హత్య, హత్యాయత్నం కేసును నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఉప ఎన్నికల్లో 3 సీట్లూ కాంగ్రెస్‌కే : గెహ్లాట్

జైపూర్ : రాజస్థాన్‌లో రెండు లోక్‌సభ ఒక అసెంబ్లీ సీట్లలో కాంగ్రెస్‌దే విజయమని మాజీ ముఖ్యమంత్రి అశోక్‌గెహ్లాట్ వ్యాఖ్యానించారు. అజ్మీర్, అల్వార్, లోక్‌సభ మండల్‌ఘర్ అసెంబ్లీ స్థానాల్లో సోమవారం ఎన్నికలు నిర్వహించారు. ఈ మూడు సీట్లను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుదన్నారు. ఫిబ్రవరి 1న ఓట్ల లెక్కింపున కు ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుంది. ప్రతి రౌండ్‌లోనూ ఫలితాలను ఎన్నికల శాఖ వెబ్‌సైట్‌లో ఉంచుతామని అధికార ప్రతినిధి తెలిపారు. ఈ మూడు స్థానాల్లో అభ్యర్థుల మృతితో ఎన్నికలు నిర్వహించారు.

మహిళా మావోయిస్టు అరెస్టు

రాయ్‌పూర్ : మహిళా మావోయిస్టును చత్తీస్‌ఘర్‌లో అరెస్టు చేశారు. ఆమెపై రూ.3 లక్షల రివార్డును ప్రభుత్వం ప్రకటించిందని పోలీసులు వెల్ల డించారు. పక్కా సమాచారంతో పోలీసులు కొర్రం(21)ను సంయుక్త భద్రతాదళాలు కొండగోన్‌లోని చిత్‌పని గ్రామ అటవీ ప్రాంతంలో ఆమెను అరెస్టు చేశామని ఎస్పీ మహేశ్వర్‌నాగ్ వెల్లడించారు. జిల్లా రిజర్వుగార్డులు, స్థానిక పోలీసులు, మావోయిస్టు ఏరివేతలో పాల్గొన్నారు. 2015లో పోలీసులపై జరిగిన దాడుల్లో ఆమె పాల్గొందని పోలీసులు తెలిపారు.

బీజేపూర్ ఉప ఎన్నికకు నామినేషన్లు

భువనేశ్వర్ : ఒడిశాలోని బీజేపూర్ ఉప ఎన్నికకు నామినేషన్ దాఖలు ప్రారం భం కానుంది. ఎన్నికల కమిషన్ (ఈసీ) ఇందుకోసం నోటిఫికేషన్‌ను మంగళవారం జారీ చేసింది. వచ్చే ఏడాది లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీజేడీ, బీజేపీ, కాంగ్రెస్‌లకు ఈ ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే సుబల్ సాహు ఆగస్టులో మృతి చెందడంతో ఈ ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 24న ఎన్నికలు జరుగుతాయని చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ డీఎన్ గుప్తా తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

ముజఫర్‌నగర్ : రెండు వేర్వేరు ఘటనల్లో విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి చెందారని పోలీసులు వెల్లడించారు. షికార్‌పూర్ గ్రామంలో 40 ఏళ్ల వ్యక్తికి విద్యుత్ ప్రసరిస్తున్న వైర్లు తగిలి పడిపోవడంతో ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యమంలో చనిపోయినట్లు డాక్టర్లు తెలిపారు. రెండవ ఘటనలో 25 ఏళ్ల వ్యక్తికి కరెంటు వైర్లు తగిలి మృతి చెందాడని, మృతదేహాలను పోస్టు మార్టంకు తరలించామని పోలీసులు తెలిపారు.

150 మంది ఆఫీసుబేరర్లపై బహిష్కరణ వేటు

చెన్నై : ఆర్కేనగర్ ఉప ఎన్నికల్లో అపజయం పాలైన అధికార ఏఐఏడీఎంకే అందుకు కారణమైనవారిపై బహిష్కరణ వేటువేస్తోంది. దీనిలో భాగంగా కాంచీపురం, కోయంబత్తూర్ జిల్లాలోని 150 మంది ఆఫీసు బేరర్లను బహిష్క రించింది. కోయంబత్తూర్ అర్బన్ యూనిట్ ఛైర్మన్ ఏపీ నాగరాజన్‌ను పదని నుంచి తొలగిం చామని ఆ పార్టీ కోఆర్డినేటర్లు, ఓ పన్నీర్ సెల్వం, కె పళనీసెల్వం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

ఆధార్ లేదని.. ఆసుపత్రి గేటువద్దే ప్రసవం

జౌన్‌పూర్ : మధ్యప్రదేశ్‌లోని గర్భిణికి అధార్, బ్యాంకు ఎకౌంటు లేనందున ఆసుపత్రి డాక్టర్లు ఆమెకు వైద్యం చేయడానికి నిరాకరించడంతో ఆమె గేటువద్దనే ప్రసవించింది. జనవరి 29న ఈ ఘటన జరిగిందని, ఆసుపత్రిలో ప్రవేశించగానే సిబ్బంది తమను వెనక్కు పంపేశారని దీంతో ఆమె బయటే ప్రసవించిందని బాధితురాలి భర్త వెల్లడించారు. దీనిపై మెడికల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆమెను జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశామని, గేటు వద్దకు వెళ్లగానే నొప్పులు రావటంతో ఆమెను లోపలికి తెచ్చి కాన్పు చేశామన్నారు. ప్రస్తుతం తల్లీబిడ్డా కులాసాగా ఉన్నారన్నారు.

హజ్ సబ్సిడీ విత్‌డ్రాపై అఫిడవిట్ దాఖలు చేయండి

న్యూఢిల్లీ : హజ్‌సబ్సిడీని ఉపసంహరించుకోవడానికి గల కారణాలపై కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశిస్తూ, కేసును ఫిబ్రవరి 19 నాటికి వాయిదా వేసింది. ముస్లింలు మక్కాలోని హజ్‌ను సందర్శిం చుకునేందుకు విడుదల చేసే సబ్సిడీని ఉపసంహరించుకున్నట్లు ఈనెల 16న కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తూ, ఆ నిధులను ముస్లిం బాలికల విద్యకు ఖర్చు చేస్తామని వెల్లడించింది. దీనిని సవాలు చేస్తూ ముస్లిం సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి

ఎంపీ తరహా బెస్టు ఎమ్మెల్యే అవార్డు

యూపీ స్పీకర్ యోచన



లక్నో : శాసనసభ్యులలో క్రమశిక్షణ, సత్ప్రవర్తన తీసుకురావడంలో భాగంగా వారి కోసం కొత్తగా అవా ర్డులు ఇవ్వాలని ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ హృదయ నారాయణ్ దీక్షిత్ భావిస్తున్నారు. పార్లమెంటులో ఎంపీలకు ఇప్పటికే ఈ తరహా అవార్డులు ఇస్తున్నారు. ఎంపీల తరహాలోనే ఉత్తమ శాసనసభ్యులకు అవార్డులు ఇవ్వనున్నారు. ఈ ప్రతిపాదన అమలులోకి వస్తే ఈ తరహా అవార్డు ఏర్పాటు చేసిన మొదటి రాష్ట్రం ఉత్తరప్రదేశ్ అవుతుంది.

సభా కార్యక్రమాలకు తరచూ ఆటంకం కలుగు తున్న నేపథ్యంలో ఈ తరహా అవార్డులు కొంతమేరకు సభ్యులను నియంత్రించడానికి దోహద పడతాయని దీక్షిత్ పీటీఐతో అన్నారు. సభలో క్రమశిక్షణ తీసుకు రావడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. యూపీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 8 నుంచి ప్రారంభం కానున్నాయి. పార్లమెంటరీ విధానాలు అనుసరించ దానికి శాసనసభ్యులకు ఈ అవార్డులు ప్రోత్సాహకరంగా ఉంటాయని దీక్షిత్ అన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు తరహాలో ఉత్తమ లెజిస్లేచర్ అవార్డును ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. బడ్జెట్ సమావేశాలు దీర్ఘకాలం జరుగుతాయి. నాణ్యమైన చర్చలు జరగాలని కోరుకుంటున్నాం. ప్రతిపక్షాలు దూకు డుగా ఉండాలని భావిస్తాయి. ఆరోగ్యకరమైన వాదనలు ఉండాల్సిన అవసరం ఉంది. ప్రతిపక్షాలు ఈ అవకాశాన్ని బాగా ఉపయోగించుకోవాలని కోరుకుంటున్నా. గవర్నరు ప్రసంగంపై చర్చకు కావాల్సినంత సమయం ఉంటుంది. తర్వాత బడ్జెట్‌పై చర్చ జరుగు తుంది. కొన్ని శాఖాపరమైన బడ్జెట్ చర్చలు ఉంటాయని స్పీకర్ వివరించారు. చర్చకు ప్రతిపక్షాలు సహకరిం చాలని ఆయన కోరారు.

ఎన్నికలు రాజ్యాంగ ప్రక్రియ

బహిష్కరణ సరికాదు కేంద్రమంత్రి రిజిజు



న్యూఢిల్లీ : ఎన్నికలు రాజ్యాంగ ప్రక్రియకు సంబం ధించినవని, కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి కట్టుబడి పనిచేస్తుందని కేంద్రమంత్రి కిరన్ రిజిజు అన్నారు. ఫిబ్రవరి 27న జరిగే ఎన్నికల్లో పోటీ చేయరాదని నాగాలాండ్ లోని అన్ని పార్టీలు నిర్ణయించుకున్న మరుసటి రోజు కేంద్రమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో గల నాగా సమస్యకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని రిజిజు ప్రకటించారు. సకాలంలో ఎన్నికల నిర్వహణ రాజ్యాంగ ప్రక్రియకు సంబంధించినది. కేంద్ర ప్రభుత్వం రాజ్యాం గానికి కట్టుబడాల్సిందేనని ఆయన వ్యాఖ్యానించారు. నాగా లాండ్‌లో బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జిగా రిజిజు పనిచేస్తున్నారు. నాగాల రాజకీయ సమస్యకు ముందు పరిష్కారం కనుగొనాలన్న గిరిజన సంస్థలు, పౌర సంఘాల డిమాండును అంగీకరిస్తూ...ఈ సమస్య పరిష్కారమయ్యేంత వరకూ ఎన్నికల్లో పోటీ చేయరాదని పాలక నాగా పీపుల్స్ ఫ్రంటు సహా రాజకీయపార్టీలన్నీ సోమవారం తీర్మానించాయి. నాగాలాండ్ ట్రైబల్ హోహోస్, సివిల్ ఆర్గనైజేషన్స్ కోర్ కమిటీ వ్యక్తంచేసిన అభిప్రాయాలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా అవగాహన చేసుకున్నదని రిజిజు పేర్కొన్నారు. అయితే, ఎన్నికల బహిష్కరణ పరిష్కారం కాదని హితవు పలికారు. ప్రధాని నరేంద్రమోడీ నిబద్ధతపై విశ్వాసం ఉంచండని వేడుకున్నారు. నాగాల సమస్యపై నాగా పీపుల్స్ ఫ్రంట్, కాంగ్రెస్, బీజేపీ, నేషనలిస్టు డెమోక్రటిక్ పీపుల్స్ పార్టీ, నాగాలాండ్ కాంగ్రెస్, యునైటెడ్ నాగాలాండ్ డెమోక్రటిక్ పార్టీ, ఆమ్‌ఆద్మీ పార్టీ, నేషనల్ కాంగ్రెస్ పార్టీ, లోక్‌జన పార్టీ, జనతాదళ్(యునైటెడ్), నేషనల్ పీపుల్స్ పార్టీ సమావేశమై ఎన్నికల్లో పోటీ చేయరాదని నిర్ణయం తీసుకున్నాయి. నాగా ఉద్యమ పార్టీలు సమావేశానికి హాజరయ్యాయి.

ఎఫ్ఐఆర్‌పై పాంథర్స్ పార్టీ ధర్నా

జమ్మూ: షోపియన్ జిల్లాలో ఇద్దరు పౌరుల మరణించిన ఘటనలో సైనికులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినందుకు జమ్మూకాశ్మీర్ నేషనల్ పాంథర్స్ పార్టీ(జేకేఎల్‌పీపీ) ఆందోళనకు దిగింది. జేకేఎల్‌పీపీ ఛైర్మన్ హర్ష్ దేవ్ సింగ్ ఆధ్వర్యంలో ఆందోళనకారులు ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ధర్నా చేపట్టారు. జాతి వ్యతిరేకులను, వేర్పాటువాదులను రాష్ట్ర ప్రభుత్వం బుజ్జగిస్తున్నదని, వారితో ప్రభుత్వం మెతక వైఖరితో వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వ్యతిరేక నినాదాలను చేస్తూ, ఎఫ్ఐఆర్‌ను వెంటనే తొలగించాలని డిమాండు చేశారు.

పసిగుడ్డుపై దానవత్వం?!

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో చోటు చేసుకున్న అమానుషం సభ్య సమాజాన్ని కలవర పెట్టింది. ఎనిమిది నెలల పసి బిడ్డపై ఓ కిరాతకుడు అత్యాచారం చేశాడు. ఈ దానవత్వ ఘటన ఆదివారం చోటు చేసుకోగా అలస్యంగా వెలుగు చూసింది. ఢిల్లీలోని శాకూర్‌బస్తీకి చెందిన దంపతులకు 8 నెలల ఆడ బిడ్డ ఉంది. భార్య ఇళ్లలో పాచి పని చేస్తుండగా.. భర్త కూలీకి వెళ్తున్నాడు. ఆదివారం ఉదయం ఆవిడ తన పసిబిడ్డను బంధువుల ఇంట్లో వదిలి పనికి వెళ్లింది. భర్త కూడా బయటకు వెళ్లాడు. ఆమె ఇంటికి తిరిగి వచ్చేసరికి తన పసి బిడ్డ బట్టల నిండా రక్తపు మరకలు. గుక్కపట్టి ఏడుస్తోంది. ఆ బిడ్డను చూసి అమ్మ తల్లడిల్లిపోయింది. తక్షణమే చిన్నారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వైద్యపరీక్షలు జరిపిన వైద్యులు.. ఆ బిడ్డ అత్యాచారానికి గురైనట్లు నిర్ధారించారు. తమ బంధువుల ఇంట్లో పాపను వదిలివెళ్లిన కొద్ది సేపటికే.. 28 ఏళ్ల యువకుడు చిన్నారిని ఆడిస్తానని మాయమాటలు చెప్పి పక్కకు తీసుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టాడు. చిన్నారి తండ్రికి యువకుడు సూరజ్‌పై అనుమానం రావడం తో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సూరజ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా.. చేసిన తప్పును అంగీకరించాడు. నిందితుడిపై పోలీసులు పోస్కో చట్టం కింద కేసు నమోదు చేశారు.



తల్లడిల్లిన మహిళా కమిషన్

నెలల పసికందుపై జరిగిన దురాగతంపై ఢిల్లీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ స్వాతి మలివాల్ తీవ్ర ఆక్రోశం వ్యక్తం చేశారు. ఇది ఢిల్లీ మహిళా కమిషన్‌పై జరిగిన అత్యాచారంగా అభివర్ణించారు. ఏదైనా అత్యాచార ఘటన జరిగిన ఆరునెలలలోపు నేరస్తులకు శిక్ష విధించాలని పదే పదే తాను విజ్ఞప్తి చేస్తున్నా? ఫలితం లేదన్నారు. ఈ రోజు జాతిపిత గాంధీజీ వర్థంతి.. ఇలాంటి దేశాన్నా తాను స్థాపించిందీ అని గాంధీ ఆశ్చర్య పోతారన్నారు. అన్నెం పుణ్యం ఎరుగని ఎనిమిది నెలల పాపపై దారుణం..ఇదేమి రామరాజ్యం అంటూ ట్వీట్ చేశారు. మహాత్మా గాంధీ, సుభాష్, భగత్‌లాంటి మహా యోధుల త్యాగం వృధా అయిపోయింది, సమాజం, వ్యవస్థ పూర్తిగా చచ్చిపోయిందంటూ ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

దేశ రాజధాని నగరంలో పసిగుడ్డుపై అత్యా చార ఘటన తరువాత దేశ పతాకం విశ్వంలో ఎలా ఎగురుతుందంటూ ప్రధానమంత్రి నరేంద్రమోడీని ఉద్దేశించి ఒక ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ పోలీసు వ్యవస్థపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వీఐపీ డ్యూటీలో మునిగితేలుతున్నారనీ, నేరస్తులకు పోలీసుల భయం అస్సలు లేదని విమర్శించారు. ఎనిమిది నెలల పసిపాపపై ఇంత అఘాయిత్యం జరుగుతోంటే.. ఢిల్లీ నగరం ఎలా నిద్ర పోయిం దంటూ తీవ్రమైన తన మరో ట్వీట్‌లో ఆవేదనను వ్యక్తం చేశారు.

ఘటన అనంతరం ఆసుపత్రిని సందర్శించిన ఆమె వరుస ట్వీట్లలో ఈ సంఘటనపై తన ఆవేదనను వ్యక్తం చేశారు. అంతేకాదు గౌరవం కోసం పాఠశాల బస్సుపై దాడి చేసిన సేన ఎక్కడ ఉంది అని ఆమె ప్రశ్నించారు. ఈ దారుణం గురించి విన్న వెంటనే తాను నిర్ఘాంత పోయాననీ, ఆపాప ముఖం చూడాలంటేనే భయంగా ఉందంటూ ట్వీట్ చేశారు. బాధిత శిశువును స్వాతి మలీవాల్ సోమవారం పరామర్శిం చారు. శస్త్రచికిత్స తర్వాత పాప ఆరోగ్యం స్థిరంగా ఉందనీ, త్వరలోనే వైద్యులు ఆమెను డిశ్చార్చ్ చేస్తారని తెలిపారు. పాప తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. అలాగే పేదవారైన పాప తల్లిదండ్రులకు రూ.50వేల సహాయం అందిస్తు న్నట్టు ప్రకటించారు. ఈ అంశంలో శిశువుకు తాత్కాలిక నష్టపరిహారం అందించాల్సిందిగా కోరుతూ కోర్టులో దరఖాస్తు చేసినట్టు పేర్కొన్నారు.

పశ్చిమ బెంగాల్ బస్సు ప్రమాదం

41కి చేరిన మృతుల సంఖ్య

బరంపూర్ : పశ్చిమ బెంగాల్‌లోని ముర్షీదాబాద్ జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంలో మృతుల సంఖ్య 41కి చేరింది. గాలింపు చర్యల సందర్భంగా మంగళవారం ఉదయం మరో ఐదు మృతదేహాలను కనుగొనడంతో ఈ సంఖ్య పెరిగింది. నీటిలో మునిగిపోయిన కొన్ని, కొమ్మలకు చిక్కుకుని కొన్ని మృతదేహాలు కనిపించినట్లు రాష్ట్ర పాలనాయంత్రాంగానికి చెందిన సీనియర్ అధికారులు తెలిపారు. ముర్షీదాబాద్ జిల్లా బలీర్‌ఘాట్ ప్రాంతంలో సోమవారం ఉదయం 6గంటలకు ప్రయాణీకులతో వెళుతున్న ఒక బస్సు బ్రిడ్జిపై నుంచి వెళు తూ రెయిలింగ్‌ను దూసుకుంటూ గోగ్రా కెనాల్‌లో పడిపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. వెలుతురు బాగా లేకపోవడంతో గత రాత్రి సహాయక చర్యలను నిలిపివేశారు.

నేటి ఉదయం 7 గంటలకు తిరిగి గాలింపు చర్యలను ప్రారంభించారు. "మృతదేహాలేవీ నీటిలో లేవని మేము విశ్వసించే వరకు గాలింపు కొనసాగుతుంది" అని ఆ అధికారి తెలిపారు. జాతీయ విపత్తుల స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్), రాష్ట్ర విపత్తుల నిర్వహణ బృందం సోమవారం దాదాపు 9 గంటల పాటు లోతైన జలాల్లో గాలింపు జరిపి 36 మృతదేహాలను వెలికితీసింది. మరో ఎనిమిది మందిని కాపాడింది. "ఇప్పటి వరకు 35 మృతదేహాలను గుర్తించారు. గుర్తించాల్సి ఉన్న ఆరు మృతదేహాలను ముర్షీదాబాద్ మెడికల్ కాలేజీ, హాస్పటల్ మార్చురీలో ఉంచాం" అని ఆయన తెలిపారు. ప్రమాదసమయంలో బస్సులో ఎంతమంది ప్రయాణిస్తున్నారనేది ఇంకా ధృవీకరణ కాలేదని, బస్సులో 50 మంది ప్రయాణీకులు వుండివుండవచ్చునని ముర్షీదాబాద్ జిల్లా మేజిస్ట్రేట్ పి. ఉలగనాథం పీటీఐకి తెలిపారు.

యూపీలో ఉధృతంగా చలి గాలులు

లక్నో: చలి గాలులు, పొగ మంచుతో ఉత్తరప్రదేశ్ వణుకుతోంది. రాష్ట్రంలో అత్యల్ప ఉష్ణోగ్రత లక్ష్మీపూర్ ఖేరీలో 3 డిగ్రీలు నమోదు అయింది. తూర్పు ఉత్తరప్రదేశ్‌లో విపరీతమైన పొగ మంచుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాతావరణ విభాగం అధికారి తెలిపారు. లక్నో, రాయ్‌బరేలి, ఫైజాబాద్, గోరఖ్ పూర్, అలహాబాద్, కాన్పూర్, మురాదబాద్‌లో పగటి ఉష్ణోగ్రతలు సగటు కన్నా అత్యల్పంగా నమోదయాయి. ఇదే పరిస్థితి మరో రెండు రోజులు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

రాజౌరీ సరిహద్దుల్లో పాకిస్థాన్ కాల్పులు

జమ్మూ: జమ్మూకాశ్మీర్‌లోని రాజౌరీ దగ్గర్లోని వాస్తవాధీన రేఖ వెంబడి పాకిస్థాన్ కాల్పులకు తెగబడింది. ఎలాంటి ప్రాణ నష్ట వివరాలు తెలియరాలేదని అధికారులు పేర్కొన్నారు. రాజౌరీ జిల్లాలోని నౌషెరా సెక్టార్‌లో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి పాకిస్థాన్ కాల్పులు మొదలయాయని వారు తెలిపారు. జిల్లాలోని ఝంగర్, ధమకా, కలాల్ ప్రాంతాలతో పాటు, జనసంచారం ఉన్న 5 గ్రామాలే లక్ష్యంగా పాకిస్థాన్ కాల్పులకు పాల్పడిందని అధికారులు తెలిపారు.

'సీలింగ్'పై సుప్రీం తలుపు తట్టనున్న ఆప్

న్యూఢిల్లీ : సీలింగ్ డ్రైవ్‌పై ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ బీజేపీ నేతల చర్చలు, ఆరోపణలు-ప్రత్యారోపణల నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం సీలింగ్ డ్రైవ్‌పై సుప్రీంకోర్టులో పిటిషన్ వేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశం నుంచి ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు మనోజ్ తివారీ అర్ధాంతరంగా వెళ్లిపోయారు. ఆప్ ప్రభుత్వం సమస్యను తప్పుదోవ పట్టిస్తున్నదని ఆయన ఆరోపించారు. డ్రైవ్‌పై తాత్కాలిక నిషేధం విధించాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేయాలని ఆప్ ప్రభుత్వం నిర్ణయించింది.



న్యూఢిల్లీ : భారత రైల్వే ఉద్యోగులను మొట్టమొదటి విదేశీ ఆనందయాత్రని రూపొందించింది. ఈ యాత్ర సీనియర్ అధికారులు కోసం

రైల్వే సిబ్బందికి విదేశీ యాత్ర

గ్యాంగ్, ట్రాక్ మ్యాన్‌లు, నాన్-గెజిటెడ్ ఉద్యోగులకు ప్రాధాన్యత

కాదు, గ్యాంగ్‌మ్యాన్‌లు, ట్రాక్‌మ్యాన్‌లు, ఇతర నాన్-గెజిటెడ్ ఉద్యోగులను ఈ యాత్రకు పంపించింది. మొట్టమొదటిసారిగా దక్షిణమధ్య రైల్వేకి చెందిన వంద మంది నాన్-గెజిటెడ్ కార్మికులు ఆరు రోజుల యాత్రకు జనవరి 28న సింగపూర్, మలేసియా వెళ్లారని రైల్వే శాఖ ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటన తెలిపింది. ఈ యాత్రకు వెళ్లే ఉద్యోగులు పర్యటనకు అయ్యే వ్యయంలో 25 శాతం భరిస్తారని, మిగిలిన 75 శాతాన్ని స్టాఫ్ బెనిఫిట్ ఫండ్ (ఎస్‌బీఎఫ్) నుంచి వెచ్చిస్తారని ఎస్‌సీఆర్ ప్రధాన పౌరసంబంధాల అధికారి ఎం. ఉమాశంకర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

"గ్రూప్ సీ, గ్రూప్ డి కేటగిరి ఉద్యోగులతో కూడిన వంద మంది బృందం ఈ యాత్రకు వెళ్లింది. దిగువ కేడర్ ఉద్యోగులు, పదవీ విరమణకు దగ్గరలో ఉన్న ఉద్యోగులకు ఈ యాత్రలో ప్రాధాన్యత కల్పించాం. ఒక్కొక్క డివిజన్ ,వర్క్‌షాపు, ప్రధాన కార్యాలయం నుంచి వివిధ విభాగాల వారిని ఎంపిక చేశాం. ఈ విభాగాలకు మంజూరైన సిబ్బంది ప్రాతిపదికగా కేటాయింపులు జరిగింది" అని తెలిపారు. సికింద్రాబాద్ ప్రధాన కార్యాలయంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే నాన్-గెజిటెడ్ సిబ్బంది ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ యాత్ర కోసం చొరవ తీసుకున్నది. భారత రైల్వే చరిత్రలో ఈ విధమైన ఉద్యోగుల విదేశీ యాత్ర చేపట్టడం ఇదే మొదటిసారి. ఈ యాత్రలో పర్యాటక ప్రదేశాలు, సింగపూర్‌లోని సార్వజనీన స్టూడియోలను, సెంటోసా, నైట్ సఫారీలు, కౌలాలంపూర్‌తో పాటు వివిధ ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాలను చూపిస్తారు. రైల్వే శాఖలో పనిచేసే నాన్-గెజిటెడ్ ఉద్యోగుల వివిధ సంక్షేమ కార్యక్రమాల కోసం రైల్వే బోర్డు ఎస్‌బీఎఫ్ నిధులను కేటాయిస్తుంది. ఆ నిధులను సాధారణంగా తక్కువ గ్రేడ్ ఉద్యోగులకు స్కాలర్‌షిప్‌ల కోసం, వారి ఆడపిల్లల ప్రయోజనాల కోసం, ఇతర సామాజిక ప్రయోజన పథకాల కోసం వినియోగిస్తారు.

అవి అవాస్తవ ఆరోపణలు : మహారాష్ట్ర మంత్రి

ముంబై: ఎన్‌సీపీ అధికార ప్రతినిధి నవాబ్ మల్లిక్ తనపై చేసిన ఆరోపణలు అవాస్తవమని, అందుకు పరువు నష్టం దావా వేయాలని నిర్ణయించినట్టు మహారాష్ట్ర మంత్రి జయ్‌కుమార్ రావల్ తెలిపారు. మల్లిక్ ఆరోపణలు తనను తీవ్రంగా బాధించా యని, దీనిపై న్యాయపరమైన చర్యలు తీసుకోనున్నట్టు ఆయన తెలిపారు. మంత్రి జయ్‌కుమార్ భూకుంభకోణాలకు పాల్పడుతున్నారని మల్లిక్ ఇటీవల ఆరోపించారు.

విద్యుత్ ఈఈపై బీజేపీ నేతల దాడి

బదౌన్ : చోరీ కేసు నమోదుపై ఆగ్రహం చెందిన బీజేపీ నేతలు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌పై దాడి చేసి గాయపర్చిన ఘటనలో వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఆవాస్ వికాస్ కాలనీకు చెందిన నాథురాంపై విద్యుత్ చోరీ కేసు నమోదు చేయడంతో కేసును ఉపసంహరించు కోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు హరీష్ షక్యా, తన అనుచరులతో ఈఈపై ఒత్తిడి చేయగా ఆయన అంగీకరించలేదు. ఆగ్రహం చెందిన బీజేపీ నేతలు ఈఈపై దాడికి పూనుకున్నారు.

Downloaded From Telugu e News App play.google.com/store/apps/details?id=com.roshan.enews

జేఎన్‌టీయూ ప్రొఫెసర్‌పై కేసు నమోదు

విశాలాంధ్ర-కాకినాడ రూరల్ : విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురిచేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న కాకినాడ జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ బాబుల్‌పై వర్సిటీ రిజిస్ట్రార్ వైవీ సుబ్బారావు ఫిర్యాదుతో మంగళవారం సర్పవరం పోలీసులు కేసు నమోదు చేసినట్టు సీఐ చైతన్య కృష్ణ తెలిపారు. మూడు రోజులుగా విద్యార్థులు ఆందోళనలు చేయడంతో సెక్షన్ 506, 354, 354ఏ కింద కేసు నమోదు చేశారు. ప్రొఫెసర్ బాబుల్ వైవా జరుగుతున్న సమయంలో తమతో అసభ్యకరంగా ప్రవర్తించారంటూ 20 మంది విద్యార్థినులు వీసీ కుమార్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు ప్రత్యక్ష ఆందోళనకు దిగడంతో వర్సిటీ అధికారులతోపాటు కలెక్టర్ స్పందించారు.

ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్

(భారత ప్రభుత్వ అజమాయిషీ సంస్థ)

ఆర్ఆర్ఎల్ క్లస్టర్, విజయవాడ, # 27-33-40, మొదటి అంతస్తు, గూడవల్లి వారి వీధి, బీసెంట్ రోడ్ క్రాస్, గవర్నరుపేట, విజయవాడ - 520 002
ఫోన్ : 0866-2571631, వి.ఓ.ఐ.పి. : 997678, ఈ-మెయిల్ : rrl_7678@obc.co.in

ఈ-వేలం విక్రయ నోటీసు ప్రచురణ

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క నిబంధన 8(5) అండ్ (6) రూపంలో ఉద్దేశిత విక్రయ నోటీసు. సాధారణంగా ప్రజలకు ప్రత్యేకించి **ఋణగ్రహీత-ఎం/ఎస్ కొండపాటూరి కాటన్ ట్రేడర్స్ యజమాని కె.వి.వి. శివకుమార్,** డో.నెం. 11-554, వెంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలో అన్నపూర్ణనగర్, అమరావతి రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522 034.

హామీదారు-కమ్-తనఖాదారు: శ్రీమతి కొండపాటూరి కనకదుర్గ, భర్త. కె.వి.వి. శివకుమార్, డో.నెం. 11-554, వెంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలో అన్నపూర్ణనగర్, అమరావతి రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522 034.

హామీదారు: శ్రీ కె. ఆంజనేయ ప్రసాద్, తండ్రి. లేటు. కె. గోపాల కృష్ణయ్య, డో.నెం. 4-5-32/68, ఫ్లాట్ నెం. 102, ఇంద్రప్రస్థ, మొదటి సందు, విద్యానగర్, గుంటూరు - 522 006.

పైన పేర్కొన్న ఋణగ్రహీత, తనఖాదారు, హామీదారులకు తేది. 05-07-2017న జారీ చేసిన డిమాండు నోటీసుకు అనుగుణంగా ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, కొత్తపేట బ్రాంచి ఆఫీసు గుంటూరునకు వున్న ఋణం రూ. 42,16,904ను రాబట్టుకొనేందుకు ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ అధీకృత అధికారి ది. 18-09-2017న ఆస్తిని స్వాధీనపరుచుకున్నట్లు ఇందుమూలంగా తెలియజేయడమైనది. 29-01-2018 నాటికి రూ. 43,49,229 + 30-01-2018 నుండి తిరిగి చెల్లించే వరకు వడ్డీ, నోటీసు ప్రచురణ ఖర్చులు మరియు ఇతర పర్యావసాన, చట్టబద్ధ ఖర్చులతో కలుపుకొని పైన పేర్కొన్న ఋణగ్రహీత, తనఖాదారు, హామీదారు నుండి తిరిగి రాబట్టుకోవలసి వున్నది. ఈ దిగువ షెడ్యూలులో ప్రస్తావించబడిన స్థిరాస్తిని వున్నది వున్న ప్రాతిపదికపై ఆన్‌లైన్ ఈ-వేలంలో విక్రయించబడుతుంది.

షెడ్యూలు ఆస్తి (స్థిరాస్తి)

గుంటూరు జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్, గుజ్జనగుండ్ల ఏరియా కొరిటపాడు గ్రామం యొక్క డో.నెంబర్లు 253/బి, సి, 259/బి, సి, డి, 260/ఎ, బి, 274/ఎబిసిడిల సమీపంలో వున్న విద్యానగర్‌లోని 215 చ.గ.లు లేదా 179.77 చ.మీ. విస్తీర్ణం గల యూడీఏ ప్లాట్ నెం. 251, హద్దులు : తూర్పు 33 అ॥ల రోడ్డు, దక్షిణం : ప్లాట్ నెం. 250, పడమర : ప్లాట్ నెం. 216, ఉత్తరం : ప్లాట్ నెం. 252.

ఈ-వేలంకు సంబంధించిన వివరాలు ఈ దిగువ ప్రస్తావించబడినవి :

ఈ-వేలం తేది మరియు సమయం	: 20-02-2018 ఉదయం 10.30 గం. నుండి ఉదయం 11.30 గం.ల మధ్య ఒక్కొక్కసారి 5 ని॥ల చొప్పున అపరిమిత పొడిగింపులతో
స్థిరాస్తి రిజర్వు ధర	: రూ. 49,50,000/-లు
ఈ-వేలం వెబ్‌సైట్ చిరునామా	: https:\\bankauctions.in
దరావత్తు సొమ్ము డిపాజిట్	: రూ. 5,00,000/-లు
ఎన్.ఇ.ఎఫ్.టి./ఆర్.టి.జి.ఎస్. ద్వారా ఇ.ఎం.డి. చెల్లించాలి	: ఎం/ఎస్ ఈ-వేలం ఖాతా, కొండపాటూరి కాటన్ ట్రేడర్స్, ఖాతా నెం. 05701181000012, ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్- ORBCCO100570, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, కొత్తపేట, గుంటూరు.
బిడ్‌ల సమర్పణకు ఆఖరు తేది	: 17-02-2018 సా॥ 5.00 గం.ల వరకు
కనీస బిడ్ పెంపుదల మొత్తం	: రూ. 25,000/-లు
ఉద్దేశిత కొనుగోలుదారులకొరకు ఆస్తి తనిఖీకి తేది మరియు సమయం	: 16-02-2018 మ॥ 2.00 గం.ల సా॥ 5.00 గం॥ల వరకు

ఆన్‌లైన్ టెండర్/వేలం నియమ నిబంధనలు

1) ఈ-వేలంలో పాల్గొనటానికి ముందుగా వేలం విక్రయ సవివర నియమ నిబంధనల కొరకు వెబ్‌సైట్, www.bankauctions.in (ఈ-వేలం ఏజెన్సీ వెబ్‌సైట్ మరియు బ్యాంక్ వెబ్‌సైట్ చిరునామా) ను పరిశీలించవలసిందిగా బిడ్డర్లకు సలహా. 2) అధీకృత అధికారి పరిజ్ఞానం మరియు సమాచారం మేరకు ఆస్తిపై ఎటువంటి అప్పులు లేవు. అయితే వేలానికి పెట్టబడిన ఆస్తిపై అప్పులు, దస్తావేజులకు సంబంధించి, ఉద్దేశిత బిడ్డర్లు వారు సొంతంగా దర్యాప్తు చేసుకోవచ్చును. 3) ఆసక్తిగల బిడ్డరు ఈఎండీ (రిజర్వు ధరకు తగ్గకుండా)తో పాటు వారి బిడ్ పత్రాలను మరియు అవసరమైన పత్రాలను ఈ దిగువ విధంగా 17-02-2018 సాయంత్రం 5 గంటల వరకు సమర్పించాలి, నమోదు ప్రక్రియ (ఆన్‌లైన్), మరియు యూజర్ ఐడీ అండ్ పాస్‌వర్డ్‌ను కల్పించి, అధీకృత అధికారి సమగ్ర పరిశీలన (పత్రాలు) మరియు ఆమోదించిన తరువాత మాత్రమే ఈ-వేలం ప్రక్రియలో పాల్గొనేందుకు అర్హులు. 4) బిడ్ సమర్పణకు ఆఖరు తేదీకి ముందుగా వెబ్‌పోర్టల్‌లో అప్‌లోడ్ చేయబడిన ఈ దిగువ పత్రాలు అనగా-ఎ) ఎన్‌ఈఎఫ్‌టీ/ఆర్‌టీజీఎస్ చలాన్, బి) పాన్ కార్డ్, సి) ఐడీ ప్రూఫ్ : ఆధార్ కార్డు/డ్రైవింగ్ లైసెన్స్/ఓటర్ కార్డు/పాస్‌పోర్టు, డి) అడ్రస్ ప్రూఫ్ కాపీలను ఉద్దేశిత కొనుగోలుదారు/బిడ్డర్ పొందవలసి వుంటుంది. అవి లేనట్లయితే బిడ్ తిరస్కరించబడుతుంది. 5) విజయం సాధించిన బిడ్డరు దరావత్తు సొమ్ము డిపాజిట్‌ను పాక్షిక విక్రయ నిమిత్తం అట్టిపెట్టుకోబడుతుంది. ఫలప్రదం కాని బిడ్డర్ల ఈఎండీ తిరిగి ఇవ్వబడుతుంది. దరావత్తు సొమ్ము డిపాజిట్‌పై వడ్డీ చెల్లించబడదు. ఫలప్రదమైన బిడ్డరు వారి బిడ్ ధరను అధీకృత అధికారి ఆమోదించిన 24 గంటల లోపల అప్పటికే చెల్లించిన ఈఎండీ సర్దుబాటు చేసిన తరువాత విక్రయ ధరలో 25 శాతం డిపాజిట్ చేయవలసి వుంటుంది. కుదరల 75 శాతం విక్రయ ధరను 15 రోజులకు గాని అంతకు ముందుగాని చెల్లించాలి. ఫలప్రదమైన బిడ్డరు చెల్లింపు చేయటం విఫలమైనట్లయితే అప్పటికే డిపాజిట్ చేసిన మొత్తాన్ని కోల్పోవలసి వుంటుంది, ఆస్తి తిరిగి వేలానికి పెట్టబడుతుంది. మరియు మొత్తాన్ని తిరిగి చెల్లించని ఋణగ్రహీతకు ఆస్తి/మొత్తమునకు సంబంధించి ఎట్టి క్లెయిమ్/హక్కు వుండదు. 6) అర్హత పొందిన ఆశావహులైన బిడ్డర్లు ఈ-వేలం తేదీకి ముందుగా ఎం/ఎస్-4 క్లోజర్ నుండి ఈ-వేలంపై ఆన్‌లైన్ శిక్షణను పొందవచ్చును. ఇంటర్నెట్ పని సమస్యకు బ్యాంకు అధీకృత అధికారి గాని, ఎం/ఎస్-4 క్లోజర్‌కి గాని ఎట్టి బాధ్యత వుండదు. ఈ-వేలంలో పాల్గొనటానికి సాంకేతిక పరంగా సుశిక్షితులుగా ఉండేటట్లు ఆసక్తిగల బిడ్డర్లు చూసుకోవాలి. 7) కొనుగోలుదారు స్టాంప్ డ్యూటీలు/అదనపు స్టాంపు డ్యూటీ/ట్రాన్స్‌ఫర్ ఛార్జీలు, ఫీజు వగైరాలను భరించాలి. మరియు ఆస్తి చట్టబద్ధ, చట్టబద్ధేతర బకాయిలు, పన్నులు, రేట్లు, అసెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజు వగైరాలను కూడా కొనుగోలుదారే భరించాలి. 8) ఎట్టి ముందస్తు నోటీసు లేకుండా మరియు ఎట్టి కారణము చూపకుండానే బిడ్‌ను ఆమోదించే లేదా తిరస్కరించే లేదా వాయిదావేసే/విక్రయాన్ని రద్దుచేసే లేదా విక్రయ నియమ నిబంధనలు సవరించే సంపూర్ణ హక్కును మరియు విచక్షణను అధీకృత అధికారి కలిగి వుంటారు. 9) ఈ ప్రచురణను ఋణగ్రహీతకు మరియు హామీదారు/లు కు 15 రోజులు నోటీసుగా కూడా పరిగణించబడుతుంది. 10) తదుపరి వివరాలకు అధీకృత అధికారి, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ బ్యాంకు, శ్రీ కె. శ్రీరామకృష్ణ- మొబైల్ : 9483505452కు సంప్రదించాలి

ప్రదేశం : విజయవాడ, తేది : 30-01-2018 — సం/- అధీకృత అధికారి, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్

లక్ష్మీ విలాస్ బ్యాంక్

రీజినల్ ఆఫీస్, నం.31-23-1ఎ, మొదటి అంతస్తు, బిఎస్ఎన్ఎల్ భవన్ పక్కన, చుట్టుగుంట, ఏలూరు రోడ్, విజయవాడ-520004. ఫోన్ : 0866-2440020

వేలం ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఏసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 కింద సెక్షన్ 13(4) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 నిబంధనల కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ది లక్ష్మీ విలాస్ బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు బ్రాంచ్‌కు తనఖా పెట్టిన స్థిర ఆస్తి వేలం విక్రయం

ది లక్ష్మీ విలాస్ బ్యాంక్ లిమిటెడ్, చీరాల బ్రాంచ్ అధీకృత అధికారి చట్టంలోని సెక్షన్ 13(2) కింద ఋణగ్రహీత మరియు హామీదారులైన **1. ఎం/ఎస్. ఉ మహేశ్వర డిస్ట్రిబ్యూటర్స్, 2. శ్రీ. అడపా బాలాజీ, 3. శ్రీమతి. ఎ. లావణ్య, 4. శ్రీమతి చల్లా వెంకటరమణ, 5.శ్రీమతి అడపా సరోజనమ్మ, 6. శ్రీ. చల్లా క్రిష్ణమోహన్, 7. శ్రీ. చల్లా వినయ్‌కుమార్ మరియు 8. శ్రీ చల్లా దినేష్‌కుమార్** లకు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు బకాయి పడిన మొత్తాన్ని 60 రోజుల్లోగా చెల్లించవలసిందిగా పిలుపునిస్తూ 15-09-2015న డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది. చెల్లింపునకు గడువు మీరిపోయినప్పటికీ వారు బకాయిని చెల్లించనందున దిగువ సంతకందారు తేదీ : **17-01-2018** న కింద ప్రస్తావించిన స్థిర ఆస్తిని విక్రయం ద్వారా బదలాయించే హక్కుతో స్వాధీనం చేసుకోవడమైనది.

01-09-2015 నుండి భవిష్యత్తు వడ్డీ మరియు వర్తించే వ్యయం తో పాటు కలిగియున్న బకాయిలను రాబట్టుకునేందుకు దిగువ వివరించిన ఆస్తులను చట్టం ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించి బహిరంగ వేలం పద్ధతిలో అమ్మకానికి పెట్టడమైనది. బహిరంగ వేలం మరియు వివరాలు మరియు నియమ నిబంధనల వివరాలను ఈ కింద తెలియపర్చడమైనది :

వేలం ప్రదేశం	లక్ష్మీ విలాస్ బ్యాంక్, గుంటూరు బ్రాంచ్, డి.నం. 24-3-79, మెయిన్ రోడ్, పట్నం బజార్, గుంటూరు-522 003.
పూచీ కలిగి ఉన్న బాకీ	వ్యయాలు మరియు ఇతర ఛార్జీలతోపాటు తిరిగి చెల్లించు తేదీ వరకు 01.09.2017 నుండి వడ్డీతో **రూ.91,30,452.08 పై. (తొంభై ఒక్క లక్షల ముప్పై వేల నాలుగు వందల యాభైరెండు రూపాయల ఎనిమిది పైసలు మాత్రమే)**
ఐటెమ్ నం-1	
వేలం తేదీ & సమయం	**06-03-2018, ఉ.11.00 గం.లు**
పూచీ కలిగియున్న ఆస్తి వివరాలు :	గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, గుంటూరు నగరంలో రామచంద్రాపుర అగ్రహారం వద్ద పాత వార్డ్ నంబరు 16, బ్లాక్ నం.6, టి.ఎస్. నం.388 లో పాత డోర్ నం.24-4-77, కొత్త డోర్ నం.24-4-76, అసెస్‌మెంట్ నం.31837 కలిగియున్న 67.1/3 చదరపు గజాల విస్తీర్ణపు స్థలం మరియు డాబా ఇల్లు మొత్తంగా. **హద్దులు : తూర్పు** : ఉమ్మడి గల్లీ - 35.6 అ॥, **తూర్పు వ్యతిరేకంగా** : ఉమ్మడి గల్లీ - 7.6 అ॥. **పడమర** : దగ్గుపాటి ఆంజనేయులు ఇల్లు - 2.6 అ॥. **పశ్చిమానికి వ్యతిరేకంగా** : ఈ ఆస్తి మరియు ఐటెమ్ నం.1 చల్లా దమయంతి యొక్క గోడ -21.6 అ॥. **ఉత్తరం** : మున్సిపల్ కార్పొరేషన్ - 19.00 అ॥ **దక్షిణం** : ఉమ్మడి గల్లీ, **దక్షిణానికి వ్యతిరేకంగా** : ఈ ఆస్తి మరియు చల్లా రత్తయ్య గోడ - 6.6 అ॥. **దక్షిణానికి వ్యతిరేకంగా** : దగ్గుపాటి ఆంజనేయులు ఇంటి గోడ-8 అ॥లు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, గుంటూరు నగరంలో రామచంద్రాపుర అగ్రహారం వద్ద పాత వార్డ్ నంబరు 16, బ్లాక్ నం.6, టి.ఎస్. నం.388 లో పాత డోర్ నం.24-4-77, కొత్త డోర్ నం.24-4-76, అసెస్‌మెంట్ నం.31837 కలిగియున్న 24.00 చదరపు గజాల విస్తీర్ణపు స్థలం మరియు డాబా ఇల్లు మొత్తంగా. **హద్దులు : తూర్పు** : కిడాంబి కృష్ణాచార్యులు గోడ-13.60 అ॥. 2.పడమర : ఉమ్మడి గల్లీ - 13.60 అ॥. **ఉత్తరం** : చల్లాదమయంతి యొక్క బాత్‌రూమ్ ఆస్తి - 16.60 అ॥. **దక్షిణం** : చల్లా రత్తయ్య బాత్‌రూమ్ ఆస్తి - 16.60 అ॥. మొత్తం 91 1/3 చదరపు గజాల విస్తీర్ణం.
భూమి & భవనం యొక్క అప్‌సెట్/రిజర్వు ధర	**రూ. 30,20,000/-** (ముప్పై లక్షల ఇరవై వేల రూపాయలు మాత్రమే)
బిడ్డర్ ద్వారా చెల్లించబడు ధరావత్తు సొమ్ము డిపాజిట్	**రూ. 3,02,000/-** (మూడు లక్షల రెండు వేల రూపాయలు మాత్రమే)
ఐటెమ్ నం-2	
వేలం తేదీ & సమయం	**06-03-2018, మ.12.00 గం.లు**
పూచీ కలిగియున్న ఆస్తి వివరాలు :	గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, గుంటూరు నగరంలో రామచంద్రాపుర అగ్రహారం వద్ద పాత వార్డ్ నంబరు 17, బ్లాక్ నం.19, టి.ఎస్. నం.606 లో డోర్ నం.25-4-4 అసెస్‌మెంట్ నం.35669 కలిగియున్న 213.00 చదరపు గజాల విస్తీర్ణపు స్థలం (253.00 చదరపు గజాల నుండి) మరియు పెంకుటిల్లు ఇల్లు మొత్తంగా. **హద్దులు : తూర్పు** : పోతూరి సుందరరావు మరియు ఇతరుల ఆస్తి-38.40 అ॥. **పడమర** : ఈ ఆస్తి యొక్క గోడ మరియు అరుణాచల మాణిక్యవేలుమినకోడి ద్వారా అమ్మిన ఆస్తి - 28.40 అ॥ **ఉత్తరం** : అడపా వెంకయ్య ఇంటి గోడ - 22.40 అ॥ **దక్షిణానికి వ్యతిరేకంగా** : పోతూరి సుందరరావు మరియు ఇతర ఆస్తి - 52.00 అ॥. **పశ్చిమానికి వ్యతిరేకంగా** : అడపా వెంకయ్య ఇంటి గోడ - 22.40 అ॥. **ఉత్తరానికి వ్యతిరేకంగా** : మున్సిపల్ రోడ్డు - 38.30 అ॥. **మొత్తం 213.00 చదరపు గజాల విస్తీర్ణం.**
భూమి & భవనం యొక్క అప్‌సెట్/రిజర్వు ధర	**రూ. 69,51,000/-** (అరవై తొమ్మిది లక్షల యాభై ఒక్క వేల రూపాయలు మాత్రమే)
బిడ్డర్ ద్వారా చెల్లించబడు ధరావత్తు సొమ్ము డిపాజిట్	**రూ. 6,95,100/-** (ఆరులక్షల తొంభై ఐదు వేల వంద రూపాయలు మాత్రమే)

ఆస్తి తనిఖీ మరియు తదుపరి వివరాల కొరకు దయచేసి బ్రాంచ్ మేనేజర్, లక్ష్మీ విలాస్ బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు బ్రాంచ్, డి.నం.24-3-79, మెయిన్ రోడ్డు, పట్నం బజార్, గుంటూరు - 522 003, ఫోన్ : 0863-2224940 ను సంప్రదించగలరు.

నియమ నిబంధనలు

1.ఔత్సాహిక బిడ్డరు ఇఎండిగా అప్‌సెట్ ధర (రిజర్వు ధర) లో 10% ను గుంటూరులో చెల్లుబాటయ్యేలా ది లక్ష్మీ విలాస్ బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు బ్రాంచ్ పేరిట తీసిన డిడిని పైన వివరించిన సంబంధిత వేలం తేదీలో వేలం సమయాలకి ముందుగా డిపాజిట్ చేయవలెను.
2. విజయవంతమైన బిడ్డర్ బిడ్ మొత్తంలో 25% (ఇఎండిని తగ్గించి) విక్రయం ముగిసిన వెంటనే చెల్లించాలి. మిగిలిన 75% మొత్తాన్ని 15 రోజుల్లో చెల్లించాలి.
3. సెక్యూర్డ్ క్రెడిటార్ తరఫున స్థిర ఆస్తి వేలంపాటకు సెక్యూర్డ్ క్రెడిటార్ నుంచి అధికారం పొంది ఉన్నట్లయితే సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ఏ అధికారికైనా అది వర్తించదు ఇఎండి అనగా అప్‌సెట్ ధరలో 10% డిపాజిట్, కొనుగోలు డబ్బు చెల్లింపు మొదలైన వాటికి సంబంధించి వేలం నియమ నిబంధనలు సెక్యూర్డ్ క్రెడిటార్ అధికారికి వర్తించవు. కొనుగోలు ధర సెక్యూరిటీ క్రెడిటార్ క్లెయిమ్ మొత్తానికి సర్దుబాటు చేయబడును.
4. విజయవంతమైన బిడ్డర్ చట్ట ప్రకారం వర్తించే రిజిస్ట్రేషన్ ఫీజులు, స్టాంప్ డ్యూటీ వంటి వాటి కొరకు వర్తించే ఛార్జీలు/ఫీజు చెల్లించవలెను.
5. వేలంలో ఎవరయితే అత్యధిక ధర ఆఫర్ చేస్తారో వారి పేరిట అమ్మకం ధ్రువీకరించబడుతుంది.
6. అమ్మకం ధర రిజర్వు ధర కన్నా తక్కువగా ఆఫర్ చేసినట్లయితే అమ్మకం ధ్రువీకరించబడదు.
7. విజయవంతమైన బిడ్డర్ 15 రోజుల్లో అమ్మకం ధర చెల్లించబడని పక్షంలో డిపాజిట్‌ను కోల్పోతారు. ఆస్తి తిరిగి విక్రయించబడుతుంది. విఫలమైన కొనుగోలుదారు ఆస్తిపై అన్ని క్లెయిములను కోల్పోతారు.
8. ఆస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అలా" మరియు "అక్కడ ఏముంటే అది" పద్ధతిపై విక్రయించబడుతుంది.
9. ఉద్దేశిత బిడ్డర్లు ఆస్తిని బ్రాంచ్ మేనేజర్ ముందస్తు అపాయింట్‌మెంట్ తర్వాత అన్ని పని దినాలలో ఉ.10 గం. నుండి సా.5 గం.ల వరకు తనిఖీ చేసుకోవచ్చును. ఆస్తి యొక్క వేలం విక్రయం గురించి ఏదైనా ఇతర సమాచారం కొరకు బ్రాంచ్ మేనేజర్, ది లక్ష్మీ విలాస్ బ్యాంక్ లిమిటెడ్,గుంటూరు బ్రాంచ్, డి.నం.24-3-79, మెయిన్ రోడ్డు, పట్నం బజార్, గుంటూరు - 522 003, ఫోన్ : 0863-2224940, 9640407111, 9490141568 నుండి పొందవచ్చును.
10. ఏటువంటి కారణాలను తెలియజేయకుండానే విక్రయాన్ని రద్దు/వాయిదా వేసే అధికారాన్ని అధీకృత అధికారి కలిగియున్నారు.

తేదీ : 29-01-2018
ప్రదేశం : గుంటూరు

ది లక్ష్మీవిలాస్ బ్యాంక్ లిమిటెడ్ తరఫున
అధీకృత అధికారి

బందరు పోర్టు భూసేకరణా.. భూసమీకరణా

- భూ సేకరణ అయితే రూ. 750 కోట్లు
- భూ సమీకరణకు రూ. 200 కోట్లు
- కావాల్సిన పట్టా భూమి 1,510 ఎకరాలు



విశాలాంధ్ర - విజయవాడ : కృష్ణాజిల్లా పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడే బందరు పోర్టు నిర్మాణం ఇప్పట్లో కొలిక్కి వచ్చే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో ప్రక్రియ రోజురోజుకూ ఆలస్యమవుతోంది. పోర్టుకు అవసరమైన భూమి సేకరణకు తీసుకోవాల్సిన విధానాలపై ప్రభుత్వ పెద్దలు ఇంకా మల్లగుల్లాలు పడుతున్నారు. భూసేకరణ, భూ సమీకరణ.. వీటిలో ఏ పద్ధతి అనుసరించాలనేదానిపై ఇంకా ఓ నిర్ణయం తీసుకోకపోవడం చర్చనీయాంశమైంది. పోర్టు నిర్మాణానికి 5,324 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. మూడేళ్ల క్రితం భూ సేకరణ, రెండేళ్ల క్రితం భూ సమీకరణ నోటిఫికేషన్లను రాష్ట్ర ప్రభుత్వమే జారీ చేసింది. ఈ రెండూ అమలులోనే ఉన్నాయి. ఇప్పటికే 3,010 ఎకరాల అస్సైన్డ్, ప్రభుత్వ భూములను మచిలీపట్నం అర్బన్ డెలప్‌మెంట్ అథారిటీ (ఎంయూడీఏ) ద్వారా సమీకరించారు. గత ఏడాది మార్చి 29వ తేదీన ఈ భూమిని కాకినాడ పోర్టు డైరెక్టర్‌కు అప్పగించారు. అంతకు ముందే గిలకలదిండిలోని 424 ఎకరాల పోర్టు భూములను నిర్మాణ బాధ్యతలు దక్కించుకున్న నవయుగ సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. మరో 780 ఎకరాల పట్టాభూములు అప్పగించేందుకు రైతులు ఎంయూడీఏకు అంగీకారపత్రాలు ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పటికే సేకరించిన అస్సైన్డ్, ప్రభుత్వ భూమితోపాటు మరో 1,510 ఎకరాలను ప్రభుత్వం అప్పగిస్తే పోర్టు పనులు మొదలయ్యే అవకాశం ఉంది. అయితే పోర్టు, పారిశ్రామిక కారిడార్ నిర్మాణం పేరుతో ప్రభుత్వం ఏకంగా 32 వేల ఎకరాలను సమీకరించాలని నిర్ణయించడం, ఈ క్రమంలోనే భూసేకరణ, సమీకరణ నోటిఫికేషన్లు జారీ చేయడం వివాదాస్పదమైంది. పోర్టు నిర్మాణానికైతే భూములు ఇస్తామని, పారిశ్రామిక కారిడార్‌కు భూములు ఇచ్చేది లేదని తెగేసి చెప్పిన రైతులు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమబాట పట్టారు.

ఎంయూడీఏ నివేదికపై భిన్నస్వరాలు

పోర్టు, పారిశ్రామిక కారిడార్ నిర్మాణాల కోసం భూసేకరణ చేస్తే సుమారు రూ.750 కోట్ల ఖర్చవుతుందని ప్రభుత్వ అంచనా. చినకరగ్రహారం పంచాయతీ పరిధిలోని క్యాంప్ బెల్‌పేట, పల్లెపాలెం గ్రామాలను ఖాళీ చేయడం, నిర్వాశితులకు పునరావాసం, భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లింపునకు అయ్యే ఖర్చుపై ఇప్పటికే ఎంయూడీఏ అధికారులు నివేదికలు రూపొందించారు. భూసమీకరణ అయితే రూ. 200 కోట్లు మాత్రమే ఖర్చు అవుతుందని, రైతులకు పదేళ్లపాటు లీజు సొమ్ము చెల్లిస్తే సరిపోతుందని నివేదికలో పేర్కొన్నారు. భూసేకరణ అయితే ప్రభుత్వ రికార్డుల ప్రకారం గోపువానిపాలెంలో ఎకరం భూమికి రూ. 5లక్షలు, మంగినపూడి, తపశిపూడి గ్రామాల్లో అయితే ఎకరానికి రూ.11 లక్షలుగా ఉంది. పక్కపక్కనున్న ఈ మూడు గ్రామాల్లోని భూముల ధరలో భారీ వ్యత్యాసం ఉండటంతో గోపువానిపాలెం గ్రామ రైతులు తమ భూములిచ్చేదిలేదని ప్రకటించారు. ఈ సమస్యను చక్కదిద్దాల్సిన అధికారులు తమ పరిధిలో లేదని చేతులెత్తేస్తున్నారు. ఇప్పటికే సమీకరించిన 3,010 ఎకరాలకు తోడు మరో 1,518 ఎకరాల పట్టా భూములు సమీకరించాల్సి ఉందని ఎంయూడీఏ అధికారులు చెబుతున్నారు. ఈ భూమిలో అధికశాతం గోపువానిపాలెం గ్రామ పరిధిలోనే ఉండటం గమనార్హం.

రైతులతో సీఎం భేటీలోనూ స్పష్టత కరవు

పోర్టు నిర్మాణ ప్రాంతంలోని గోపువానిపాలెం, కరగ్రహారం, మంగినపూడి, తపశిపూడి, చినకరగ్రహారం తదితర గ్రామాలకు చెందిన 300 మంది రైతులను ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ముఖాముఖి అని అమరావతి తీసుకువచ్చారు. ఎంయూడీఏ నుంచి రూ.5 లక్షలు ఖర్చు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. భూమి ఇచ్చినందుకు ప్రభుత్వం నుంచి మీరేమి కోరుతున్నారని చంద్రబాబు ప్రశ్నించడంతో రైతులు స్పష్టత లేకుండా మాట్లాడటం, పోర్టు నిర్మాణంపై ఆలోచించి చెబుతానని సీఎం చెప్పడం గందరగోళానికి గందరగోళానికి దారితీసింది. భూమి తీసుకున్నందుకు ప్రభుత్వం పరిహారం ఎంత ఇవ్వాలనుకుంటుందో అనేదానిపై స్పష్టత లేకుండానే సమావేశం ముగిసింది.

మెగా టౌన్‌షిప్ ప్లాన్‌కు రూ.5 కోట్లు

మచిలీపట్నం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా పోర్టు, పారిశ్రామిక కారిడార్‌ను ఎలా అభివృద్ధి చేయాలి, మెగాటౌన్ షిప్ నిర్మాణం అంశంపై ప్రణాళికల రూపకల్పన కోసం ప్రభుత్వ ఢిల్లీకి చెందిన ఓ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చారు. దీనికి రూ. 5 కోట్లు కేటాయించారు. ఈ సంస్థ నివేదికలో మచిలీపట్నం మొత్తం ఖాళీ చేయించాలనే ప్రతిపాదన పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. పోర్టు నిర్మాణానికి భూమి, మెటీరియల్ రవాణాకు రోడ్డు, రైల్వే కనెక్టివిటీ సమకూరిస్తేనే పోర్టు పనులు ప్రారంభిస్తామని నవయుగ సంస్థ ప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఇన్ని ఇబ్బందుల మధ్య ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

రైలులో రూ.36 లక్షల అపహరణ



విశాలాంధ్ర - ఒంగోలు : హైదరాబాదు నుంచి సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో సోమవారం రాత్రి ఒంగోలు ప్రయాణిస్తుండగా రూ. 36 ,89,500 నగదు, వెండి వస్తువులతో కూడిన బ్యాగ్ చోరీకి గురైనట్టు ఒంగోలు ప్రసాద్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యుడు డాక్టర్ రావిపాటి సుశీల, ప్రసాద్‌రెడ్డి మంగళవారం ఒంగోలు రైల్వే పోలీస్ స్టేషన్ సీఐ టి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. బాధితుని కథనం ప్రకారం డాక్టర్ సుశీల బంధువులకు సంబంధించి హైదరాబాదు ఓ కార్యక్రమానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కారు. ఏ2 కోచ్‌లో 32, 33 బెర్తులలో ప్రయాణిస్తుండగా విజయవాడ- తెనాలి మధ్యలో తమ వద్ద బ్యాగ్ అపహరణకు గురైనట్టు గుర్తించామని ఫిర్యాదులో ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బ్యాగ్‌లో నగదుతోపాటు వెండి వస్తువులు ఉన్నట్టు తెలిపారు. స్థానిక కు మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగంతకుల అగ్నిప్రమాదాల అలజడి



విశాలాంధ్ర - కర్లపాలెం : గుంటూరు జిల్లా కర్లపాలెం మండలంలో వేర్వేరు చోట్ల మంగళవారం తెల్లవారుజామున అంగంతకులు వరికుప్పలకు నిప్పు పెట్టడంతో అలజడి చెలరేగింది. వరికుప్పలు నూర్చుకుందామనుకుంటున్న తరుణంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో రైతులు తల్లడిల్లిపోయారు. కర్లపాలెం మండలం పేరలి గ్రామంలో వరికుప్ప కాలిపోతుందన్న సమాచారంతో రైతులతోపాటు గ్రామస్తులు అక్కడకు పరుగు తీశారు. అంతలోనే పేరలిపాడులో మరో వరి కుప్ప దగ్ధమవతుందనే సమాచారంతో అక్కడికి గ్రామస్తులు పరుగులు పెట్టారు. ఇంతలో పెదగొల్లపాలెం పంచాయతీ పరిధిలో మరో వరి కుప్ప కాలిపోతుందన్న సమాచారంతో ప్రజలు ఉరకలు పట్టారు. సమ్మెటవారిపాలెం పంచాయతీలోని కొత్తపాలెంలో పశువుల చావిడి మంటల్లో చిక్కుకోవడంతో మండల ప్రజలను ఉలికిపాటుకు గురిచేసింది. పోలీసులు ఒక ప్రదేశానికి వెళ్లే సమయానికి మరో చోట ప్రమాద సమాచారం రావడంతో అసలేం జరుగుతుందోనే ఆందోళన వ్యక్తమైంది. పేరలి గ్రామ రైతు బుర్ల రామయ్యకు చెందిన 1.50 ఎకరాల వరి కుప్పను అతని పొలంలో వేసుకున్నాడు. కుప్ప నూర్పిడి కోసం చుట్టు పరదాలు పరిచేందుకు కులీలు వస్తున్న తరుణంలో మంటలు చెలరేగడంతో రైతు రామయ్య గొల్లుమన్నాడు. పేరలిపాడు గ్రామంలో జంగం ఏసుదాసుకు చెందిన 1.10 ఎకరాల వరికుప్ప కాలిపోతున్నట్టు సమాచారం రావడంతో నలుగురిని పిలుచుకుని వెళ్లేలోపే ప్రమాదం జరిగిపోయింది. పెదగొల్లపాలేనికి చెందిన బత్తుల రవీంద్రబాబుకు చెందిన ఎకరా వరికుప్ప దగ్ధమవుతున్న సమయంలో అటువైపు వెళ్తున కొందరు సమాచారం ఇవ్వడంతో రైతులు పరుగులు పెట్టారు. సమ్మెటవారిపాలెం పంచాయతీ కొత్తపాలేనికి చెందిన కుంచాల వెంకటరెడ్డి పశువుల పాక కాలిపోవడంతో దానిలోని పశువులు గాయాలు కావడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఎస్సై అశోక్‌బాబు సిబ్బందితో నాలుగు ప్రదేశాలను పరిశీలించారు.



సాగర్ కాల్వకు గండి

విశాలాంధ్ర - ఎ కొండూరు : కృష్ణాజిల్లా మైలవరం బ్రాంచ్ తొమ్మిదో కిలోమీటరు సమీపంలోని మాధవరం గ్రామంలో మంగళవారం సాగర్ కాల్వ యూటీకి గండి పడింది. ఆరుతడి పంటలు, దాళ్వావరి సాగుచేసిన రైతులు సాగర్ నీటి కోసం ఎదురు చూస్తున్న సమయంలో గండి పడటంతో నిరాశకు గురయ్యారు. సోమవారం రాత్రి నుంచి సాగర్ కాల్వకు నీరు రావడంతో మంగళవారం ఉదయం గండి పడింది. తహశీల్దార్ ఎం సురేష్‌కుమార్, ఎన్ఎస్పీ అధికారులు గండిపడిన ప్రదేశాన్ని పరిశీలించారు. గండి పడిన ప్రాంతంలో 500, 700 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నీరు పంట పొలాలను ముంచెత్తడంతో సాగర్ జలాలను నిలిపివేశారు. రెండు రోజుల్లో కాల్వకు మరమ్మతులు చేయించి నీరు విడుదల చేయిస్తామని అధికారులు ప్రకటించారు. దాళ్వ వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలు సాగర్ నీరు రాక ఎండిపోతున్న సమయంలో రైతులు నిరాశ చెందారు. యూటీ కూలిపోవడంతో పొలాల్లో నీరుచేరిన చోట పంట నష్టం వాటిల్లినట్లు పేర్కొంటున్నారు. కొద్దిపాటి నీటి ప్రవాహానికే కాల్వకు గండి పడటంతో కాంట్రాక్టర్ నాసిరకం పనులే కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. సాగర్ కాల్వ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేయించి తమ పంటలను కాపాడాలని రైతులు ఎన్ఎస్పీ అధికారులను కోరుతున్నారు.

ముగ్గురు మొగుళ్ల ముద్దుల పోలీస్

- విశాఖ ఏఆర్ మహిళా కానిస్టేబుల్ రహస్య వివాహాలు
- అందినంత దండుకుని భర్తలకు బాయ్‌బాయ్
- మూడో భర్త తిరుగుబాటుతో వెలుగులోకి

విశాలాంధ్ర - విశాఖపట్నం : తరచూ మగాళ్లే రెండు, మూడు వివాహాలు చేసుకుంటూ మహిళలను మోసం చేయడం వార్తల్లో చూశాం, కానీ విశాఖలో ఒక మహిళా ఏఆర్ కానిస్టేబుల్ ఏకంగా ముగ్గుర్ని పెళ్ళాడి అందినంత దోచుకున్న తర్వాత అక్రమ కేసుల్లో ఇరికిస్తూ వారికి బాయ్‌బాయ్ చెబుతున్న మాయలేడీ మోసాలు ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చాయి. నగరానికి చెందిన ఏఆర్ మహిళా కానిస్టేబుల్ బుదుమూరి విజయలక్ష్మి (సీఆర్ డబ్ల్యూపీసీ 1671) విశాఖ ఆర్మ్ రిజర్వ్‌డ్ విభాగం ద్వారా ప్రస్తుతం కమిషనరేట్ కంట్రోల్‌రూమ్‌లో విధులు నిర్వహిస్తోంది. అదే శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జి.మాకయ్య (ఏఆర్‌పీసీ 429)ను చినముషిడివాడలో పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకుంది. గౌతమ్ అనే అబ్బాయి ఉన్నాడు. తర్వాత విజయలక్ష్మి విజయవాడకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మహేంద్ర కార్తీక్‌ను రెండో వివాహం చేసుకుంది. మూడోసారి గాజువాక అక్కిరెడ్డిపాలేనికి చెందిన మాదవరపు హరికృష్ణను పెళ్లాడింది. బయటకు పోలీసుగా కనిపించినా ఆమె లక్ష్యం సంపాదనే. సరిపోయే వ్యక్తిని ఎంచుకోవడం, ప్రేమపేరుతో వల వేయడం, సాక్ష్యాలతో సహా పెళ్లి చేసుకోవడం, అతని వద్ద డబ్బు అయిపోగానే విడిచిపెట్టేయడం ఆమెకు పరిపాటిగా మారింది. వదిలేసే ముందు పథకం ప్రకారం భర్తపై తప్పుడు కేసులు బనాయించడం ఆనవాయితీ. ఈమె చేతిలో దారుణంగా మోసపోయిన హరికృష్ణ నగరపోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. తనకు ముందే పెళ్లి అయినట్లు విజయలక్ష్మి చెప్పలేదని, కుమారుడు ఉన్నట్టు కూడా తెలియదని, తన వద్ద రూ.25 లక్షలు తీసుకున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు. గాజువాక దరి అక్కిరెడ్డిపాలెంలో ఎలక్ట్రికల్ వ్యాపారం చేస్తున్న తనకు వినియోగదారునిగా పరిచయమై ప్రేమాయణం నడిపి 2013లో అన్నవరం గుడిలో వివాహం చేసుకుందన్నారు. వివాహం తర్వాత కొంతకాలం పీతానగర్‌లో, తర్వాత మద్రిపాలెంలో కాపురం చేశామని వివరించారు. పెళ్లికి ముందే తనపై కేసు బనాయించేలా చేసి సుమారు రూ. 25 లక్షలు వసూలు చేసినట్టు ఫిర్యాదులో హరికృష్ణ వాపోయాడు. ఆమె పెళ్లిళ్ల వ్యవహారానికి మొదటి భర్త మాకయ్య ప్రోత్సాహం కూడా ఉందని హరికృష్ణ ఆరోపించారు. ఇప్పటికైనా ఈ మహిళా పోలీస్ పెళ్లిళ్ల భాగోతం వెలుగులోకి రాకపోతే తనలా మరెందరు మోసపోతారనే ఆందోళనతోనే ఈ ఫిర్యాదు చేశానన్నారు.

రాష్ట్రంలో కోల్డు స్టోరేజీలు

విశాలాంధ్ర - శ్రీకాకుళం: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వ ర్యంలో కోల్డు స్టోరేజీల నిర్మాణానికి చర్యలు తీసుకుం టున్నట్టు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ ఎల్.వి.ఎస్. ఆర్.కె.ప్రసాద్ తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గిడ్డంగుల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చినట్టు చెప్పారు. రూ.80 కోట్లు అవసరమయ్యే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ. 20 కోట్లను నాబార్డు ద్వారా అందిస్తుందన్నారు. శ్రీకాకుళం జిల్లా భామిని మండల కేంద్రంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో రూ.5.20 కోట్లతో నిర్మించిన 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గిడ్డంగులను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ధాన్యం దిగుబడి బాగుందని, పంటల నిల్వలకు గిడ్డంగులు నిర్మించాల్సి ఉందన్నారు. ఇప్పటికే 70 వేల నుంచి 80 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గిడ్డంగులు అవసరమని గుర్తించామన్నారు. రాష్ట్రంలో 6 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కూడిన గిడ్డంగులను ప్రభుత్వ అధ్వర్యంలో, మరో 6 లక్షల మెట్రిక్ టన్నుల గిడ్డంగులను ప్రైవేటు సంస్థల ద్వారా నిర్వహిస్తున్నామన్నారు.

త్వరలో ఫుడ్ ప్రోసెసింగ్ యూ నిట్లు నెలకొల్పే యోజనలో ఉన్నాయన్నారు. దిగుబడులకు ధర వచ్చే వరకు గిడ్డంగుల్లో భద్రపరచుకోవచ్చని ఆయన అన్నారు.

నేడు శ్రీవారి ఆలయం మూత

విశాలాంధ్ర - తిరుమల : చంద్రగ్రహణం కారణంగా బుధవారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు శ్రీవారి ఆలయ తలుపులు మూసి ఉంచు తారు. బుధవారం సాయంత్రం 5.18 గంటలకు ప్రారంభ మయ్యే చంద్రగ్రహణం రాత్రి 8.41 గంటలకు పూర్తవు తుంది. దీంతో రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు, దివ్యదర్శనం టోకెన్లు, వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు తదితర ప్రత్యేక ప్రవేశ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. వీఐపీ బ్రేక్ దర్శనాన్ని ప్రొటోకాల్ ప్రముఖులకు మాత్రమే పరిమితం చేశారు. మాతృశ్రీ తరిగొండ వెంగ మాంబ అన్నప్రసాద భవనాన్ని కూడా మూసివేస్తారు. శ్రీవారి ఆలయం ఉదయం, రాత్రి కలిపి దాదాపు 5 గంటల పాటు మాత్రమే తెరిచి ఉంటుందని టీటీడీ అధికారులు ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జలవనరుల శాఖ
ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

ఈ-కార్యాలయం టెండరు నోటీసు నెంబర్లు 792/2017-18 నుండి 796/2017-18 వరకు తేది. 25-1-2018 నీరు-చెట్టు 5 పనులు మొత్తం రూ. 115.55 లక్షలు. టెండర్ల స్వీకరణకు ఆఖరు తేది 5-2-2018 సా 3 గం. వరకు. తదుపరి వివరాలకు www.eprocurement.gov.in లో చూడవచ్చును. సంప్రదించుటకు ఫోన్ నెంబర్లు 08812-220108/9440814836

సం/- సూపరింటెండింగ్ ఇంజనీరు, ఇరిగేషన్ సర్కిల్, ఏలూరు.
DIPR/3193/CL/ADVT-1/1/17-18 Dt. 30-1-18

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

సుమారు రూ.17.20 లక్షల విలువగల 4 పనులకు అనగా నిట్ నెం.68 నుండి 71/ఇ.ఇ/ఆర్ & బి నరసరావుపేట/2017-18 తేది : 25-1-2018 ద్వారా ఆహ్వానించబడుచున్నవి. వివరములకు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in నుండి 8-2-2018 సా.3 గం. వరకు డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.

- సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, (ర.భ) డివిజన్, నరసరావుపేట
DIPR/3203/CL/ADVT-1/1/17-18 Dt. 30-01-18

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ

టి.యస్.నెం.10/ఏ.టి.ఓ/టెండర్స్/17-18 **టెండరు నోటీసు** తేది : 25-1-2018

కార్యపాలక ఇంజనీరు, గ్రామీణ నీటి సరఫరా మరియు శానిటేషన్ ప్రాజెక్టుల డివిజన్, తెనాలి వారి కార్యాలయములో 5 పనులకు అంచనా విలువ రూ.30.08 లక్షలకు అర్హత ఉన్న కాంట్రాక్టర్ల నుండి సీలువేసిన టెండర్లు కోరబడును. టెండరు షెడ్యూలు కొరకు దరఖాస్తులు స్వీకరించుటకు ఆఖరు తేది : 5-2-2018 సా.5 గం. వరకు మరియు టెండరు షెడ్యూలును కాంట్రాక్టర్లను 6-2-2018 సా.5 గం.వరకు జారీచేయబడును. ఇతర వివరములకు ఈ కార్యాలయము పనివేళలలో సంప్రదించగలరు.

- సం/- కార్యపాలక ఇంజనీరు, గ్రా.నీ.స. మరియు శానిటేషన్ ప్రాజెక్టుల డివిజన్, తెనాలి
DIPR/3206/CL/ADVT-1/1/17-18 Dt. 30-01-18

చేనేత కార్పొరేషన్

అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే తీర్మానం: జగన్

విశాలాంధ్ర-నెల్లూరుబ్యూరో: వైసీపీ అధికారం చేపట్టిన వెంటనే ప్రత్యేకంగా చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించారు. అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే ఆ మేరకు తీర్మానం చేస్తామని ఆయన వెల్లడించారు. మంగళవారం ఆయన సైదాపురం మండలంలో ప్రజా సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కలిచేడు గ్రామంలో చేనేత కార్మికులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూలుపై నాడు దివంగత మహానేత రూ.600 ఇవ్వగా, రూ.1000 ఇస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు ఆ మాట నిలబెట్టుకోలేదని చెప్పారు. అందుకే తాము అధికారం చేపట్టాక కచ్చితంగా ప్రతి చేనేత కుటుంబానికి రూ.2 వేల సబ్సిడీ ఇస్తామని పేర్కొన్నారు. చేనేత కార్మికులకూ 45 ఏళ్లకే పింఛను



ఇస్తామని, వారికి అన్ని విధాలుగా మేలు చేస్తామని తెలిపారు. పెరిగాయని చెబుతున్నారు. కానీ వాస్తవానికి గతంలో కంటే ఇప్పుడు స్టీల్, సిమెంట్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గాయి. అయినా కమిషన్ల కోసం కాంట్రాక్టర్లకు బిల్లులు పెంచి ఇస్తున్నారు. అందుకే మేము అధికారంలోకి రాగానే అవ్వా తాతలకు 60 ఏళ్లకే పింఛను ఇస్తాము. అది కూడా రూ.1000 కాకుండా, రూ.2 వేలు ఇస్తాము. అంతే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలలో అర్హులకు రూ.2 వేల పింఛను ఇస్తామన్నారు.



పోలవరం నిర్వాసితుల కోసం ఐక్యంగా పోరాడదాం

సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రావుల వెంకయ్య

విశాలాంధ్ర- కూనవరం: పోలవరం నిర్వాసితుల పునరావాసం, న్యాయమైన పరిహారానికై 13 జిల్లాలోని ప్రజా సంఘాలను ఏకంచేసి పోరాడాల్సిన ఆవశ్యకత ఉందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రావుల వెంకయ్య ఉద్ఘాటించారు. మంగళవారం కోతులగుట్టలోని పొడియం అప్పారావు అధ్యక్షతన జరిగిన సీపీఐ డివిజన్ ప్రథమ మహాసభలో ఆయనతో పాటు జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆర్థిక విధానాల వలన 7.9శాతంగా ఉన్న దేశ ఆర్థిక వృద్ధిరేటు 6.5శాతానికి దిగజారిందని విమర్శించారు. మోడీ పాలనలో పర మతాలపై దాడి, నికార్సైన జర్నలిస్టులపై హత్యాయత్నాలు, అత్యాచారాలు పెరిగిపోయాయని గుర్తుచేశారు. పెద్దనోట్ల రద్దు వల్ల ఒక్క రూపాయి నల్ల ధనాన్ని వెలికితియ్య లేకపోగా వేల కోట్ల రూపాయలు దేశానికి ఎగ్గొట్టిన విజయ మాల్యా లాంటి కార్పొరేటర్లకు ఈ ప్రభుత్వం దండుగా నిలిచిందని విమర్శించారు. చంద్రబాబు పరిపాలనలో అవినీతి అమాంతం పెరిగిపోయిందని అభివృద్ధి కోసం అంటూ చేసే ప్రతీ పనిలో అవినీతి పర్సంటేజీలను పెంచుకుంటూ పోతుందని విమర్శించారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం ప్రాజెక్టులు కమీషన్ల కోసం నిర్మించినవి కావా అని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టు సంస్థలు తరచుగా ఎందుకు మారుతున్నాయో ప్రజలు తెల్సుకుంటున్నారని గుర్తుచేశారు. విలీన మండలాల నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ మెరుగైన పునరావాసం కల్పించే వరకూ పోరాటం ఆగే ప్రసక్తే లేదని ఉద్ఘాటించారు. అనంతరం ఈ మహాసభలో సీనియర్ నాయకుడు మండా దుర్గాప్రసాద్‌ని డివిజన్ కార్యదర్శిగా, సహాయ కార్యదర్శిగా ఎస్‌కె రంజాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కందుకూరి మంగరాజు, వెలిసాల నాగరాజు, పడియం అప్పారావు, గుజ్జా మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అసమర్థతతోనే

ఫ్లైఓవరు పనుల జాప్యం : శివాజీ


విశాలాంధ్రబ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతతోనే విజయవాడ దుర్గ ఫ్లైఓవరు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ విమర్శించారు. ఈ మేరకు పీసీసీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కృష్ణాపుష్కరాలలోపే ఫ్లైవోవరును పూర్తిచేస్తామని సీఎం చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రెండేళ్లు గడుస్తున్నా దుర్గ ఫ్లైవోవరు పనులు పూర్తి చేయకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని పేర్కొన్నారు.

గాంధీ బోధనలకు ఆచరణ కరవు

పీఏ కల్యాణ్ ఆందోళన

చెన్నై : జాతిపిత మహాత్మా గాంధీని నాథూరాం గాడ్సే ఒక్కసారి మాత్రమే హత్య చేశాడని, కానీ, ఆయన బోధనలను ఆచరించకుండా రాజకీయ పార్టీలు ప్రతి రోజూ జాతిపితను హత్య చేస్తున్నాయని గాంధీజీ వ్యక్తిగత సహాయకుడు(పిఏ) వెంకిట కల్యాణం ఆందోళన వ్యక్తం చేశారు. 1943-1948 మధ్య బాపూజీకి పీఏగా పని చేసిన 96 ఏళ్ల కల్యాణం గాంధీజీ 70వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం పీటీఐతో మాట్లాడారు. గాంధీజీ ప్రాణాలు కోల్పోయేటప్పుడు 'హే రామ్' అని అనలేదని తాను చెప్పానసటంలో నిజం లేదని స్పష్టం చేశారు. "నేనెప్పుడూ అలా చెప్పలేదు. హే రామ్ అని గాంధీజీ అనడాన్ని విన లేదని మాత్రమే నేను చెప్పాను. గాంధీజీ అని ఉండవచ్చు, నాకు తెలియదు" అని చెప్పారు.

భూ వివాదాలపై సిట్ ఏర్పాటు యోచన...!



- ప్రతిపాదించిన పోలీసుశాఖ
- సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం
- సాధ్యాసాధ్యాలపై పరిశీలన
- రాజధానిలో పేట్రేగుతున్న ల్యాండ్ మాఫియా

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాజధాని ప్రాంతంలో వెలుగులోకి వస్తున్న భూ వివాదాలపై ప్రత్యేక విచారణ బృందం (సిట్) ఏర్పాటు యోచనలో ప్రభుత్వం ఉంది. విశాఖ పట్నంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ, లేని సర్వే నంబర్లు సృష్టించి రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై ప్రభుత్వం ఇప్పటికే సీనియర్ ఐపీఎస్ అధికారితో సిట్‌ను ఏర్పాటు చేసింది. అదేరీతిలో రాజధాని అమరావతి ప్రాంతంలో రోజు రోజుకి వెలుగు చూస్తున్న భూ దందాలపైనా సిట్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. విజయవాడ రాజధానిగా మారిన తర్వాత భూముల ధరలు అమాంతంగా పెరిగాయి. దీంతో దశాబ్దాలపాటు ఖాళీగా ఉన్న స్థలాలు, భూముల ఆక్రమణపై భూ మాఫియా కన్నేసింది. ఒకటి కాదు రెండు కాదు వందల సంఖ్యలో భూ వివాదాల కేసులున్నాయి. అయితే సివిల్ వివాదాల పేరుతో కేసు నమోదు చేసేందుకు పోలీసులు అంగీకరించటంలేదు. ఫలితంగా సెటిల్‌మెంట్ కోసం బాధితులు ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులను ఆశ్రయిస్తున్నారు. మూడున్నర సంవత్సరాల్లోనే వందలాది భూ వివాద కేసులు వెలుగు చూసినా ఎక్కడా కేసు నమోదు కాలేదు. రెండు నెలల వ్యవధిలో నేర విచారణ విభాగం (సీఐడీ) దొంగ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకోవటం ద్వారా వందల కోట్ల రూపాయల విలువైన భూములను ఆక్రమించుకున్న ఘటనపై రెండు కేసులు నమోదు చేసింది. నెలన్నర క్రితం విజయవాడ గుణదల పరిధిలో 500 చదరపు గజాల స్థలానికి అడ్రస్‌లేని వ్యక్తులను సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకోవటం సంచలనం సృష్టించగా, తాజాగా అధికార పార్టీకి చెందిన విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు అండ్ కో ఏకంగా స్వాతంత్ర్య సమర యోధుడు కేసిరెడ్డి సూర్యనారాయణ కుటుంబానికి చెందిన భూమికి దొంగ పత్రాలు సృష్టించి కబ్జా చేయటం గమనార్హం. ఈ విషయంలో సీఎం చంద్రబాబు సీరియస్ కావటంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఇదే సమయంలో విజయవాడలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాల స్థలం ఎప్పటి నుంచో ఆక్రమణలో ఉంది. బొండా ఉమా కబ్జా వ్యవహారంతో విద్యార్థులు ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకు నేందుకు ప్రయత్నించారు. ఇలాంటి భూ వివాదాలపై ప్రత్యేకంగా విచారణ చేసేందుకు సిట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు సమాచారం. విశాఖ తరహాలోనే సిట్ ఉంటే భూ మాఫియాకు చెక్ పెట్టే అవకాశం ఉంటుందని కూడా సీనియర్ ఐపీఎస్ అధికారి ఒకరు సీఎం చంద్రబాబుకు నివేదించినట్లు తెలిసింది. దీంతో సిట్ ఏర్పాటుపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

న్యాయవాది భూమినీ అమ్మేశారు

ఎమ్మెల్యే బొండా ఉమా భూ కబ్జా వ్యవహారంపై సీఐడీలో కేసు నమోదుకావటం, దొంగ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయటం నిజమేనని తేలటంతో భూ బాధితులు ఒక్కొక్కరు బయటకు వస్తున్నారు. విజయవాడ నగరానికి చెందిన సీనియర్ న్యాయవాదికి చెందిన 200 చదరపు గజాల స్థలాన్ని మూడున్నర సంవత్సరాల క్రితమే ల్యాండ్ మాఫియా కబ్జా చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. బొండా ఉమా వ్యవహారంపై సీఐడీ విచారణ చేస్తుండటంతో ఆ న్యాయవాది కూడా బయటకు వచ్చి తనకు జరిగిన అన్యాయాన్ని ఏకరువు పెట్టినట్లు తెలిసింది. న్యాయవాదిగా ఉన్న తానే భూమిని కాపాడుకోలేక పోవటంతో ఆయన తన పేరును బయటకు చెప్పుకోలేకపోతున్నారు. ఇలా బయటకు వచ్చేవి ఒకటీ రెండే ఉంటున్నాయని, సిట్ ఏర్పాటైతే అనేకం వెలుగు చూసే అవకాశం ఉంటుంది. అందుకే సిట్‌ను ఏర్పాటు చేయాలని పోలీసుశాఖ ప్రతిపాదనపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. అయితే ఇది ఎంత వరకు సాధ్యపడుతుందనే అంశాన్ని కూడా లోతుగా పరిశీలిస్తున్నారు.



భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తున్నారు

విశ్వవిద్యాలయాల్లో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి : సుబ్బారావు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విశ్వవిద్యాలయాల్లో భావ ప్రకటన స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని హరించే విధంగా పనిచేస్తుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు విమర్శించారు. దేశ వ్యాప్తంగా దళిత, మైనారిటీ, మహిళలపై, విద్యార్థులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా, హిందూ మతోన్మాద వ్యతిరేకంగా మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటూరు మల్లయ్య లింగంభవన్ నుంచి మార్కెట్ సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు ప్రదర్శన చేశారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విగ్రహం వద్ద మోకాళ్ళపై నిలుచుని కొంత సమయం నినాదాలు చేశారు. ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు మాట్లాడుతూ హిందూ మతోన్మాద ముసుగులో పేదవర్గాలపై దాడులు పెరిగిపోయాయని, ప్రశ్నించే వారి గొంతులు నొక్కి చంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు జరుగుతున్న దేశ ప్రధాని నరేంద్రమోడి ప్రభుత్వం మౌనంగా ఉంటూ హిందూ మతోన్మాదులకు అనుకూలంగా ఉంటున్నారని విమర్శించారు. మహాత్మాగాంధీని చంపిన గాడ్సేను పూజిస్తున్న వారు దేశభక్తి గురించి మాట్లాడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో విశ్వ విద్యాలయాల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించి ప్రజాస్వామ్యాన్ని కాపాడటంతో పాటు హిందూ మతోన్మాదుల దాడుల నుంచి దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. జేఎన్‌యూ విశ్వవిద్యాలయంలో వామపక్ష విద్యార్థులలో ఒకరిని కిడ్నాప్ చేస్తే ఇంత వరకు ఆచూకి కూడా తెలియక వారి తల్లిదండ్రులు బాధపడుతున్నారన్నారు. హిందూత్వ ముసుగులో ఇటువంటి సంఘటనలు పునరావృతమైతే ఏఐఎస్ఎఫ్ దేశ వ్యాప్తంగా విద్యార్థులను చైతన్యవంతం చేసి ఆందోళనలు ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మద్దినేని కిరణ్, గోపయ్య, నాయకులు బి.రామాంజి, సుబ్బారావు, వెంకటేష్, గొట్టుముక్కల దుర్గా, చందు, శివ, షాహిమ, నజీమా, గౌతమి తదితరులు పాల్గొన్నారు.



పీసీసీ కార్యాలయంలో గాంధీ వర్ధంతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పీసీసీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం మహాత్మ గాంధీ 70వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీసాల రాజేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధులు వి.గుర్నాథం, వింతా సంజీవరెడ్డి, నిమ్మల జ్యోతిక పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమిస్తాం : రంగన్న

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశ లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఏఐఎస్ఎఫ్ ఉద్యమిస్తుందని సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రంగన్న పేర్కొన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ సమితి పిలుపులో భాగంగా హిందూ మతోన్మాదాన్ని వ్యతిరేకిస్తూ మంగళ వారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనల్ని నిర్వహించారు. విజయ వాడ నగరంలోని కస్తూరిబాయిపేటలో వున్న గాంధీ విగ్రహానికి స్థానిక ఏఐఎస్ఎఫ్ నాయకులతో కలిసి ఆయన పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగన్న మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీజీని చంపిన గాడ్సేకు గుడికట్టి దేశభక్తుడిగా పూజించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నేడు మతోన్మాదులు ప్రజలు తినే తిండిని, కట్టే దుస్తులనూ నిర్ణయిస్తున్నారని పేర్కొన్నారు. గోసంరక్షణ పేరుతో దళిత, మైనారిటీలపై దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇందులో భాగంగానే గౌరీ లంకేష్, దబోల్కర్, కల్బుర్గి తదితరులను దారుణంగా హత్యచేశారని పేర్కొన్నారు. ఈ హత్యా రాజకీయాల వాతావరణంలో ఈ దేశ ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించేందుకు గాను ప్రజా సంఘాలు, మేథావులు, రచయితలు, రాజకీయ నాయకులు, విద్యార్థి సంఘాలన్నీ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కృష్ణా (విజయవాడ), కర్నూలు, కడప, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, అనంతపురం, గుంటూరు, విశాఖపట్నం జిల్లాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన విజయవంతంగా నిరసనలు కొనసాగాయి. ఆయా జిల్లాల ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



నేటి నుంచే జన జాతర

- ఏర్పాట్లు పూర్తి
- లక్షలాదిగా భక్తుల రాక
- భారీ భద్రతా ఏర్పాట్లు
- సకల సదుపాయాలు

విశాలాంధ్ర-మేడారం: సాధారణ సమ యంలో కనుచూపు మేర ఖాళీగా కనిపించే మేడారం చీమలదండులా మారుతున్నది. తాత్కాలిక గుడారాలు, లెక్కకు మిక్కిలి వాహనాలతో మేడారం మహానగరాన్ని తలపిస్తున్నది. కోటిమంది భక్తుల కొంగు బంగారమైన సమ్మక్క-సారలమ్మ మహాజాతర ప్రారంభానికి ఒక్కరోజే మిగిలి ఉండడంతో పిల్లాపాపలతో వనదేవతలను దర్శించుకొనేందుకు పయనమవుతు న్నారు. మహాజాతర బుధవారం నుంచి శనివారం వరకు అంగరంగ వైభవంగా జరుగనున్నది. లక్షలాది మంది భక్తులు ఎదురు చూస్తున్న సమ్మక్క-సారలమ్మలు బుధ, గురు వారాలలో మేడారంలోని గద్దెలపై కొలువుదీరనున్నారు. రెండు నెలల నుండి లక్షలాది మంది భక్తులు అమ్మవార్ల గద్దెల పైకి రాక ముందే మేడారం చేరుకుని తమ మొక్కులను అప్పగించుకున్నారు. బుధ, గురువారాలలో గద్దెలపైకి చేరుకున్న అమ్మవార్లను దర్శించుకోనున్నారు. బుధవారం కన్నెపల్లి గ్రామం నుండి సారలమ్మ పూజారి కాక సారయ్య గ్రామంలోని అమ్మవార్ల గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారిని సాయంకాలం 6 గంటల సమయంలో కన్నెపల్లి గ్రామం నుండి జంపన్నవాగు మీదుగా మేడారంలోని గద్దెపైకి చేర్చుతారు. ఇదే రోజు ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామం నుండి గోవింద రాజులను ప్రధాన పూజారి దబ్బగట్ల గోవర్ధన్, గంగారం మండలం పూనగండ్ల నుండి పగిడిద్దరాజును ప్రధాన పూజారి పెనుక మురళీధర్‌రావు తీసుకరానున్నారు. సారలమ్మ గద్దెపైకి చేరక ముందే గోవిందరాజు, పగడిద్ద రాజులు గద్దెల ప్రాంతానికి చేర్చుతారు. ప్రతి జాతర సందర్భంగా అమ్మవార్లను తీసుకువస్తున్న సమయంలో భక్తుల తాకిడి అధికంగా ఉండి



తొక్కిసలాటలు జరుగుతుండగా ఈసారి అలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు, అధికార యంత్రాగం ముందస్తు చర్యలు తీసుకుంది. సారలమ్మ కొలువుదీరిన కన్నెపల్లి గ్రామాన్ని, సమ్మక్క కొలువుదీరిన చిలకలగట్టు ప్రాంతాన్ని పోలీసులు తమగుప్పిట్లోకి తీసుకున్నారు. రెండు రోజుల నుండి ఆయా ప్రాంతాలకు భక్తులు రాకుండా కట్టడి చేశారు. అమ్మవార్లను తీసుకువస్తున్న సమయంలో ప్రత్యేక పోలీస్ బలగాను మోహరించారు. జాతర ప్రత్యేక అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కర్ణన్, ఎస్పీ భాస్కరన్, ములుగు సబ్ కలెక్టర్ వీసీ గౌతం, ఐటీడీఏ పివో చక్రధర్‌రావు, వివిధ శాఖల అధికారులు మేడారంలో ఉండి పరిస్థితులను పరిశీలిస్తున్నారు. మేడారానికి నాలుగు వైపుల 10 కిలోమీటర్ల వరకు భక్తులు వేచిఉన్నారు. అన్ని ప్రాంతాలలో మంచినీటి సమస్య, విద్యుత్ సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు.

24 గంటలు - ఏడు హత్యలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : వరుస హత్యలతో రాజధాని హైదరాబాద్ వణికిపోతోంది. మానవ సంబంధాలు కనుమరుగవుతున్నాయి. మానవాళిలో క్రూరత్వం పెరిగిపోతోంది. భార్య, బిడ్డలు, అత్త, మామలు, బంధవులు అన్న తేడా లేకుండా కుటుంబ సభ్యులను హతమార్చే సంస్కృతి ఆగడం లేదు. చిన్న, చిన్న విషయాలు, ఆర్థిక సంబంధాలతో కుటుంబ వ్యవస్థలో వారసత్వమే కరవవుతోంది. విభిన్న సంస్కృతులకు కేంద్రస్థానంగా బాసిల్లుతున్న హైదరాబాద్ మహానగరం హత్యలకు అడ్డగా మారుతోంది. నగరంలో 24 గంటల్లో ఏకంగా ఏడు హత్యలు జరిగాయి. దీంతో స్థానికులు బెంబేలెత్తుతుండగా పోలీసులకు కొత్త టెన్షన్ మొదలైంది. మృతుల్లో ఓ పాప సహా ఐదుగురు మహిళలు ఉండటం గమనార్హం. సోమవారం చందానగర్‌లో ప్రేమ వ్యవహారంలో రజినీసింగ్ హత్యకు గురైంది. మంగళవారం వేర్వేరు ఘటనల్లో ఇద్దరు యువతుల హత్యోదంతాలు వెలుగులోకి వచ్చాయి. కొండాపూర్ బొటానికల్ గార్డెన్ దగ్గర మహిళను అత్యంత దారుణంగా హత్య చేసి, ఆమెను ముక్కలుగా కోసి ఓ గోనె సంచిలో మూటకట్టారు. హయత్‌నగర్‌లో అనూష అనే యువతి హత్యకు గురైంది. ఇలా వరుసగా హత్యలు జరగడంతో పోలీసుల్లో టెన్షన్ మొదలవుతోంది. కొండాపూర్‌లోని శ్రీరాంనగర్ కాలనీ బొటానికల్ గార్డెన్ సమీపంలో స్థానికులు ఒక మూటను గుర్తించి పోలీసులను సమాచారం అందించారు. తెరిచి చూడగా.. ముక్కలుగా నరికిన మృతదేహం కనిపించింది. ఆనవాళ్లను బట్టి మహిళ హత్యకు గురైనట్టు పోలీసులు నిర్ధారించారు. హతురాలు ఎవరు? దుండగులెవరో కనిపెట్టేందుకు పోలీసులు యత్నిస్తున్నారు. హయత్‌నగర్‌లో హత్యకు గురైన యువతిని అనూషగా గుర్తించారు. బండరాయితో తలపై బలంగా కొట్టి ఆమెను హత్యచేశారు. నల్లగొండ జిల్లా దేవరకొండకు చెందిన అనూష.. కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటూ ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. మోహన్ అనే యువకుడితో కొన్ని రోజుల కిందటే నిశ్చితార్థమైందని, హత్యలో అతని ప్రమేయం ఉండొచ్చని మృతురాలి కుటుంబీకులు అనుమానిస్తున్నారు. నిశ్చితార్థం తర్వాత నుంచి మోహన్ వేధిస్తున్నాడని, ఘటన జరిగిన రోజు నుంచి అతని మొబైల్ స్విచాఫ్ చేసి ఉందని అనూష సోదరులు మీడియాతో అన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సత్యాగ్రహం సక్సెస్ (మొదటిపేజీ తరువాయి)

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 13 జిల్లాల్లో సత్యాగ్రహం నిర్వహించారు. మరికొన్ని చోట్ల జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా ప్రదర్శనగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయా జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ల వద్ద కార్మికులు నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించారు. ప్రదర్శనలు, దీక్షలు జరిపేందుకు అనుమతి లేదని పోలీసులు ఆయా ప్రాంతాల్లో కార్మికులను అడ్డుకున్నారు. కలెక్టరేట్ల వద్ద భారీగా పోలీసు సిబ్బందిని మోహరించారు. ఎక్కడికక్కడ ర్యాలీలను నిలవరించి నిరసనకారులపై జులుం ప్రదర్శించారు. చాలా కర్కశంగా వ్యవహరిస్తూ నేతలు, కార్మికులను బలవంతంగా లాక్కెళ్లి వాహనాల్లో ఎక్కించి పోలీస్ స్టేషన్లకు తరలించారు. పోలీసు దమనకాండను నిరసిస్తూ కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసుల సహాయంతో ఉద్యమాలను కట్టడి చేయాలని, నీరుగార్చాలని చంద్రబాబు ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. పలు చోట్ల కార్మికులతో పోలీసులు వాగ్వాదాలకు దిగారు. విజయవాడలోని ధర్నాచౌక్‌లో జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు, సీఐటీయూ నేత వి ఉమామహేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు జరబన నాగేశ్వరరావు, సీహెచ్ కోటేశ్వరరావు, కృష్ణాజిల్లా పంచాయితీరాజ్ (ఆర్‌డబ్ల్యూఎస్) కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కె శేషయ్య, జి జమలయ్య, జి బోడియ్య, కృష్ణాజిల్లా పంచాయితీ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, జోజి, చిన్న తదితరులను అరెస్ట్ చేశారు. అలాగే గుంటూరులో రాష్ట్ర అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు, ఒంగోలులో ఉప ప్రధాన కార్యదర్శి రావులపల్లి రవీంద్ర నాథ్‌లను అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్లకు తరలించారు. అలాగే కాకినాడ కలెక్టరేట్ వద్ద చేపట్టిన సత్యాగ్రహంలో పాల్గొన్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కిర్ల కృష్ణారావు, అనంతపురంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మనోహర్ మాణిక్యం సహా ఆయా జిల్లాలకు చెందిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నేతలను అరెస్ట్ చేశారు.

కార్మికులకు అభినందనలు: పది కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సత్యాగ్రహాల్లో 13 జిల్లాల్లో వేలాది మందిగా పాల్గొన్న కార్మి కులకు ఏఐటీయూసీ రాష్ట్ర సమితి తరపున అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఉప ప్రధాన కార్యదర్శి చలసాని వెంకట రామారావు, జి.ఓబులేసు, రావులపల్లి రవీంద్ర నాథ్ అభినందనలు తెలిపారు. ఈమేరకు వారు సంయుక్తంగా ప్రకటన చేశారు. ఇప్పటికైనా కార్మికుల ఆగ్రహాన్ని గ్రహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంఘాలతో చర్చలు జరపాలన్నారు. కనీస వేతనం రూ. 18వేల రూపాయలతో సహా వివిధ కార్మిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వాలు తమ వైఖరిని మార్చుకోకపోతే దేశ వ్యాప్త నిరవధిక సార్వత్రిక సమ్మెకు కార్మికులు సిద్ధం కావాల్సి ఉంటుందన్నారు.

ఉమ్మడి కాష్టం

(మొదటిపేజీ తరువాయి)

సంచాలకులకు ఆదేశాలు అందాయి. ఇందుకు సంబంధించి దారితీసిన, గతంలో జరిగిన పరిణామాలను పరిశీలిస్తే..... 1998 నవంబరు నెలలో ఉమ్మడి సర్వీసు రూల్సు జీఓ 505, 538 ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి ప్రభుత్వం జారీ చేసింది. వీటిని అమలు జరపటంలో ఆనాడు మండల విద్యాశాఖాధికారులుగా పని చేసిన 650 మంది ప్రభుత్వ ఉపాధ్యాయుల్ని రివర్షన్‌లు ఇచ్చి ఉపాధ్యాయులుగా వెనక్కి పంపారు. ఉప విద్యాశాఖాధికారులుగా ప్రమోషన్ పొందవలసిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు అన్యాయం జరిగింది. దీనితో ప్రభుత్వ ఉపాధ్యాయులు 23 జిల్లాల నుండి ఉమ్మడి సర్వీసు రూల్సును సవాల్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ జీఓలను అంగీకరిస్తూ ప్రభుత్వ ఉపాధ్యాయులకు వ్యతిరేకంగా తీర్పు చెప్పింది. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించగా ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను 2003 సెప్టెంబరు 30న రద్దు పరుస్తూ ప్రభుత్వ ఉపాధ్యాయులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఆ ఉత్తర్వులు అమలు జరపనందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు హైకోర్టులో కోర్టు ధిక్కారం కేసువేశారు. దీనిపై సుప్రీంకోర్టులో పంచా యితీరాజ్ ఉపాధ్యాయులు, ప్రభుత్వం కల్సి "స్టే" తెచ్చాయి. మళ్లీ హైకోర్టు తీర్పును సంఘాలు , ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాల్ చేశాయి. 2015 సెప్టెంబరు 30న సుప్రీం కోర్టు ప్రభుత్వ ఉపాధ్యాయులకు అనుకూలంగా తీర్పు చెప్పింది. అయితే పంచాయితీరాజ్ ఉపాధ్యాయ సంఘాలు, ప్రభుత్వం తమకు అనుకూలంగా ప్రచారం చేసుకున్నాయి.

సుప్రీంకోర్టు ఏం చెప్పిందంటే

ప్రభుత్వ, పంచాయితీ రాజ్ ఉపాధ్యాయుల ఉమ్మడి సీనియారిటి రాజ్యాంగంలోని 371-డీ అధికరణ, పంచాయితీరాజ్ 73వ రాజ్యాంగ సవరణ చట్టాలకు వ్యతిరేకమని ఉమ్మడి సర్వీసురూల్స్‌ను కొట్టివేసిన హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టు సమర్థించింది. అయితే పంచాయితీ రాజ్ ఉపాధ్యాయుల కేడరు కూడా రాష్ట్రపతి ఉత్తర్వులు పరిధిలోనికి తీసుకునే అవకాశాలు పరిశీలించి ప్రతిపాదనలు పంపుకోవచ్చని సలహా ఇచ్చింది. అంతవరకు పంచాయితీరాజ్ ఉపాధ్యాయులకు వారి పరిధిలో ప్రమోషన్లు కల్పించవచ్చునని సూచన చేసింది. అంటే సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం జీఓ 505, 538లపై జరిపిన ప్రమోషన్లు , నియామకాలు సమీక్ష చేయాలని, ఆ జీఓల వల్ల నష్ట పోయిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు తగిన ప్రమోషన్లు కల్పించాలని ఆదేశాలు ఉండగా, పంచాయితీ రాజ్ ఉపాధ్యాయులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినట్లు తప్పుడు ప్రచారం జరిగిపోయినట్టు తెలుస్తోంది. సుప్రీం కోర్టు తీర్పు ఆధారంగా హైకోర్టు తీర్పును అమలు జరుపలేదని గతంలో (2004) వేసిన కోర్టు ధిక్కారణ కేసుపై వాదనలు జరుగుతుండగా 2017, జనవరి 30న పంచాయితీరాజ్ ఉపాధ్యాయులను మండల విద్యాశాఖాధికారులు (గ్రామీణ)గా, ప్రభుత్వ ఉపాధ్యాయులను మండల విద్యాశాఖాధికారులు (పట్టణ)గా నియమిస్తూ పదోన్నతుల జీఓ 10, 11లను 2017, మార్చిలో జారీ చేశారు. ఇప్పటికీ హైకోర్టు తీర్పు ధిక్కారణ కేసులు సీసీ 1400/2003, సీసీ1401/2003 పెండింగ్‌లో ఉండగా ప్రభుత్వ ఉపాధ్యాయులు మరో కోర్టు ధిక్కరణ కేసు 244/2017ను హైకోర్టులో దాఖలు చేశారు. పైమూడు కోర్టు ధిక్కరణకేసులు విచారించిన హైకోర్టు ప్రభుత్వం కోర్టుధిక్కరణకు పాల్పడిందని జీఓ 505, 538, 10,11 ల ఆధారంగా జరిగిన అన్ని పదోన్నతుల నియామకాలు సమీక్ష జరపాలని ,ప్రభుత్వ పోస్టులైన మండల విద్యాశాఖాధికారి, ఉపవిద్యాశాఖాధికారి, ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం పోస్టులలో నియమించిన పంచాయితీరాజ్ ఉపాధ్యాయులను మాతృసంస్థకు పంపాలని 2017 జూన్ 9న హైకోర్టు తీర్పు ఇస్తూ, జూలై 2017లో పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, కమిషనర్‌లు స్వయంగా కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది. అయితే జూలైలో హైకోర్టుకు హాజరైన అధికారులు త్వరలో రాష్ట్రపతి ఉత్తర్వులు రాబోతున్నాయని, అవి రాకపోతే అమలు జరుపుతామని హామి ఇచ్చి తప్పుకున్నారు. తప్పుడు సమాచారంతో రాష్ట్రపతి ఉత్తర్వులు గత ఏడాది ఆగస్టు నెలలో తీసుకొచ్చి 73, 74 ఉమ్మడి జీఓలు హడావిడిగా విడుదల చేశారని తెలుస్తోంది. పంచాయితీరాజ్ ఉపాధ్యాయులను రాష్ట్రపతి ఉత్తర్వుల పరిధిలోకి తీసుకుని రావాలంటే రాజ్యాంగ సవరణ జరగాలని తెలుస్తోంది. రాష్ట్రపతి పంచాయితీరాజ్ ఉపాధ్యాయుల్ని లోకల్ కేడరుగా వర్గోన్నతి చేయమని సూచన చేయాల్సి వుంది. రాష్ట్రపతి నేరుగా లోకల్ కేడరుగా ఆర్గనైజ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చే అధికారం లేదని తెలుస్తోంది. 371డి ఆర్టికల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినది. అయినా 73వ రాజ్యాంగ సవరణ పంచాయితీరాజ్ చట్టం ఒక్క ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే చెందదు. భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలో అమలులో ఉంది. ఆ చట్ట ప్రకారం పంచాయితీరాజ్ పాఠశాలలో పనిచేసే సిబ్బంది నియామక, పదోన్నతి అధికారం సంబంధిత పంచాయితీ రాజ్ సంస్థలకు మాత్రమే ఉంది. ఆ అధికారం తొలగించాలంటే రాజ్యాంగ సవరణ జరిగి తీరాలి. ఇన్ని సాంకేతిక అవరోధాలు ఎన్నో ఉన్నప్పటికీ ఎక్కువమంది పంచాయితీరాజ్ ఉపాధ్యాయులు ఉన్నారని, అల్ప సంఖ్యాకులైన ప్రభుత్వ ఉపాధ్యాయుల హక్కులు కాలరాయటం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ కారణంగానే వచ్చే నెల 9న స్వయంగా హై కోర్టుకు హాజరు కావాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి, సంచాలకులకు ఆదేశాలు జారీ అయ్యాయని తెలుస్తోంది. పంచాయితీ రాజ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు అడ్డుకోవడం తమ ధ్యేయంకాదని ప్రభుత్వ ఉపాధ్యాయులంటున్నారు.

ప్రత్యామ్నాయం: మండలం, డివిజన్ స్థాయిలో పాఠశాలల సంఖ్య, అభివృద్ధి కార్యక్రమాలు గరిష్ఠ స్థాయిలో ఉన్నాయి. వాటిని పర్యవేక్షించటానికి ప్రస్తుతం ఉన్న ఎంఈఓ, డీవైఈఓ పోస్టులు తగినన్ని లేవు. కాబట్టి ప్రతి మండలానికి ఒక ఎంఈఓ, ప్రతి డివిజన్‌కి డీవైఈఓ, పోస్టు లను కొత్తగా మంజూరు చేసి వాటిని పంచాయితీరాజ్ ఉపాధ్యాయులకు, ప్రస్తుతం ఉన్న ఎంఈఓ, డీవైఈఓ పోస్టులను ప్రభుత్వ ఉపాధ్యాయులకు కేటాయిస్తే న్యాయ పరమైన చిక్కులు రాకుండా ఉంటాయని ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు మద్దూరి సూర్యనారాయణ మూర్తి అభిప్రాయం వ్యక్తం చేశారు. మండల పరిధిలో ఒక స్కూల్ అసిస్టెంట్ (బీఈడీ ఉపాధ్యాయుడు), డివిజన్‌లో ఒక హెచ్ఎం పోస్టును ఎంఈఓ, డీవైఈఓ పోస్టులుగా వర్గోన్నతి చేయవచునని ఆయన అభిప్రాయపడుతున్నారు.

YALAMANCHILI MUNICIPALITY

E-TENDER

Tender Document Download Satrt Date : 31-01-2018 Time : 10-30 AM
Tender Document Download End Date : 17-02-2018 Time : 04-30 AM
E-Tender Website- http://tender. apeprocuement.gov.in
Note : Any addendum/ Corrigendum/ Bid Clarifications/ Time extension shall be issued on the website only.
Phone No's : 9618496952, 9618497571 &
Email : municipality.ylm@gmail.com

Sd/-V.Satyanarayana
Commissioner, Yelamanchili Municipality

Roc.No.521/2017-18/F1/Dt : 30-01-2018

వాండరర్స్‌పై ఐసీసీ అసంతృప్తి

జొహానెస్‌బర్గ్ : భారత-దక్షిణాఫ్రికా మధ్య వాండరర్స్ స్టేడియంలో జరిగిన మూడోటెస్టులో టీమిండియా 63 పరుగుల తేడాతో గెలుపొందిన విషయం తెలిసిందే. అయితే మ్యాచ్ జరుగుతున్న మూడోరోజు ఇరుజట్ల ఆటగాళ్లు పిచ్‌పై అంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఐసీసీ స్పందించింది. పిచ్ నాణ్యత అధ్వాన్నంగా ఉందనీ, ప్రామాణికాలకు అనుగుణంగా లేదంటూ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) మంగళవారం వ్యాఖ్యానించింది. వాండరర్స్ పిచ్‌కు మూడు అయోగ్యపరమైన పాయింట్లు ఇచ్చినట్టు ఐసీసీ తెలిపింది. ఈ పాయింట్ల కాలం ఐదేళ్ల వరకు ఉంటుందని పేర్కొంది. ఈ కాల పరిమితిలో పిచ్ అయోగ్యపరమైన పాయింట్లు 5కు చేరితే, అంతర్జాతీయ క్రికెట్ నుంచి సంవత్సరం పాటు సస్పెండుకు గురవుతుంది.



కామన్వెల్త్ గేమ్స్‌కు షూటర్ల జట్టు ఎంపిక







న్యూఢిల్లీ : రాబోయే కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొనే షూటర్ల జట్టును మంగళవారం ప్రకటించారు. ఈ జాబితాలో జితూ రాయ్, గగన్ నారంగ్, అపూర్వీ చండేలాతో పాటు మరో 27మంది ఉన్నారు. ఈ కామన్వెల్త్ గేమ్స్ ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో జరగనున్నాయి. 25మంది పురుషులు, 12మంది మహిళలు ఉన్న టీంను నేషనల్ రైఫిల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎన్ఆర్ఏఐ) ప్రకటించింది. ఆర్గనైజింగ్ కమిటీ సూచనల మేరకు ఈ జాబితాను 30 నుంచి 27కు కుదించారు. 2014 గ్లాస్గోలో జరిగిన కామెన్వెల్త్ గేమ్స్‌లో 30మంది సభ్యులతో వెళ్లిన షూటర్ల జట్టు 17 (4 స్వర్ణం, 9 వెండి, 4 రజత) పతకాలు సాధించింది. ఇక కామన్వెల్త్ గేమ్స్ జరిగే ఆస్ట్రేలియాలో ఆటలన్నీ గోల్డ్‌కోస్ట్ వేదికగా జరగనుండగా, షూటింగ్ మాత్రం బ్రిస్బేన్‌లోని బెల్‌మాంట్ వేదికగా ఏప్రిల్ 8 నుంచి 14వరకూ జరగనున్నాయి. రైఫిల్, పిస్టల్, షార్ట్‌గన్‌గా మూడు విభాగాల్లో జరిగే ఈ పోటీల్లో 9మంది పురుషులు, 8మంది మహిళలు పాల్గొంటారు. జీతూరాయ్, గగన్ నారంగ్‌లతో పాటు సంజీవ్‌రాజ్‌పుత్, మన్విత్ సింగ్ సంధు, మొహ్మద్ అసబ్ ఉన్నారు. అలాగే మహిళల్లో హీనా సిద్ధుతోపాటు మెహ్లి ఘోష్, మను భాకర్, చండేలా ఉన్నారు.

ప్రకాష్ పదుకొణెకు లైఫ్‌టైమ్ అవార్డు

ప్రదానం చేయనున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



న్యూఢిల్లీ : బ్యాడ్మింటన్ దిగ్గజం, 1983 వరల్డ్ చాంపియన్‌షిప్ పతకవిజేత ప్రకాష్ పదుకొణెకు బ్యాడింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు ప్రకటించింది. ఈ అవార్డును ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు ట్వీట్ చేశారు. ప్రకాష్ పదుకొణె లాంటి దిగ్గజాలు దేశానికి గౌరవాన్ని మాత్రమే కాదు, చాలామందికి మార్గనిర్దేశకులుగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రకాష్ పదుకొణె ఆటను ఆయన గుర్తు చేసుకున్నారు. 1980 దశకంలో దేశంలో క్రీడలకు అరకొర సౌకర్యాలున్నా ప్రకాష్ రాణించడాన్ని ఆయన కొనియాడారు. మైసూరులో పుట్టిన ప్రకాష్ పదుకొణె 1978 కామన్వెల్త్ గేమ్స్, 1980 ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించారు. ఇది ఆయన ప్రతిభకు తగిన పురస్కారమని ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

క్రికెట్టా..? బెట్టింగా..??

ఐపీఎల్‌పై బోంబే హైకోర్టు సంచలన వ్యాఖ్యలు



ముంబై: ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న.. దేశవాళీ క్రికెట్ సమరం ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) 11వ సీజన్ మరికొద్దిరోజుల్లో ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో బోంబే హైకోర్టు ఈ టోర్నీపై సంచలన వ్యాఖ్యలు చేసింది. ఐపీఎల్ క్రికెట్ ప్రజలకు ఆసక్తి పెంచకపోగా.. బెట్టింగ్, ఫిక్సింగ్ వంటి అంశాల్లో ఆసక్తి పెంచుతోందని కోర్టు వ్యాఖ్యానించింది. ఐపీఎల్ మాజీ చైర్మన్ లలిత్ మోడీ వేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ ఎస్‌సీ ధర్మాధికారి, భారతీ దాంగ్రేలతో కూడిన డివిజన్ బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసింది. సౌతాఫ్రికాలో జరిగిన 2009 ఐపీఎల్ సమయంలో లలిత్ మోడీ ఫారిన్ ఎక్స్ఛేంజ్ నిబంధనలు అతిక్రమించారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆయనపై కేసు నమోదు చేసింది. ఈ కేసును సవాల్ చేస్తూ మోడీ ఈడీపై కేసు పెట్టారు. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం.. "ఐపీఎల్ ఎన్నో నిబంధనల అతిక్రమణలకు మూలమైంది. పదేళ్లుగా టోర్నీ నిర్వహణతో మనం ఏం సాధించామని నిర్వాహకులు ఆలోచించేందుకు ఇది కీలక సమయం. ఎందుకంటే ఐపీఎల్ పూర్తిగా.. చట్ట ఉల్లంఘనలు, చట్టవిరుద్ధమైన చర్యలతో నిండి ఉంది" అని కోర్టు పేర్కొంది. "ప్రజల్లో బెట్టింగ్, ఫిక్సింగ్ అనే పదాలను ఐపీఎల్ పరిచయం చేసింది. ఇప్పుడు ఇక కేంద్రం, ఆర్‌బీఐ, నిర్వాహకులు అసలు ఐపీఎల్ నిర్వాహణ క్రీడల కోసమా.. లేక మరొకదాని కోసమా అని నిర్ణయించాల్సి ఉంది" అని కోర్టు తన సందేశంలో తెలిపింది. ఈ కేసులో సాక్ష్యులకు సంబంధింత అధికారులు వెంటనే సమన్లు జారీ చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను మార్చి 13కు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది.

సఫారీలకు షాక్



డర్బన్: టీం ఇండియాతో జరిగిన టెస్ట్ సిరీస్‌ను కైవసం చేసుకున్న దక్షిణాఫ్రికా జట్టుకు ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభకానున్న వన్డే సిరీస్‌కి ముందు భారీ షాక్ తగిలింది. కీలక ఆటగాడు ఏబీ డివిలియర్స్ గాయం కారణంగా తొలి మూడు వన్డేలు జట్టుకు దూరం కానున్నాడు. భారత్‌తో జరిగిన మూడో టెస్ట్‌లో డివిలియర్స్ వేలికి గాయమైంది. దీంతో ప్రస్తుతం క్రికెట్ సౌతాఫ్రికా నేతృత్వంలో అతను చికిత్స తీసుకుంటున్నాడు. డివిలియర్స్ పూర్తిగా కొలుకున్న తర్వాత ఫిబ్రవరి 10న జరిగే నాలుగో వన్డేలో అతను మళ్లీ జట్టులో ఆడనున్నాడు. అయితే డివిలియర్స్ స్థానంలో ఎవరు ఆడతారు అన్న విషయాన్ని ఇంకా వెల్లడించలేదు. కాగా ఫిబ్రవరి1నుంచి16 వరకూ భారత్-దక్షిణాఫ్రికాలు ఆరు వన్డేలు ఆడనున్నాయి.

'మాకు ద్రవిడ్ లేడు.. అందుకే ఓడాం'

న్యూఢిల్లీ : అండర్-19 ప్రపంచ కప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను యువ భారత్ చిత్తు చేసి ఫైనల్‌లోకి ప్రవేశించిన విషయం తెలిసిందే. సెమీస్‌లో పాక్‌పై టీమిండియా 203 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. ఈ టోర్నీలో భారత కుర్రాళ్ల ఆటతీరును, కోచ్ రాహుల్ ద్రవిడ్ శిక్షణను మెచ్చుకోనివారు లేరు. టీమిండియా ఆటతీరును మెచ్చుకుంటూ పలువురు ప్రముఖులు వరుస ట్వీట్లు పెడుతున్నారు. ఈ జాబితాలోకి ఇప్పుడు పాక్ అభిమానులు కూడా చేరిపోయారు. రాహుల్‌ను పొగుడుతూ ట్వీట్లు పెడుతున్నారు. 'భారత్ గెలవడానికి వారి వెనక రాహుల్ ద్రవిడ్ శిక్షణ ఉంది. మరి మా పాకిస్థాన్ జట్టు వెనక అలాంటి వారు ఎవరూ లేరు. అందుకే మేం ఓడాం.' అంటూ పాక్ అభిమానులు ట్విటర్‌లో పేర్కొంటున్నారు. పాక్ జట్టు ప్రధాన కోచ్‌గా ఉన్న మన్సూర్ రాణాకు ఎలాంటి అనుభవం లేదని తిట్టిపోస్తున్నారు.

దాయాదిపై యువ సత్తా..!

- 69 పరుగులకు పాక్ ఆలౌట్
- 203 పరుగుల తేడాతో ఘనవిజయం
- శుభమన్ గిల్ సెంచరీ
- 4/17తో రాణించిన పోరెల్



క్రైస్ట్ చర్చ్(న్యూజిలాండ్) : అండర్-19 ప్రపంచకప్‌లో యువ భారత్ సత్తా చాటింది. సెమీఫైనల్లో పాక్‌ను 203 పరుగులతో చిత్తుగా ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. 273 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన పాక్ కేవలం 69 పరుగులకే కుప్పకూలింది. ఈ టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్... శనివారం జరగనున్న తుదిపోరులో ఆస్ట్రేలియాతో తలపడనుంది. భారత్ ప్రపంచకప్ ఫైనల్‌కు చేరడం ఇది ఆరోసారి. చెరో మూడుసార్లు కప్ గెలుచుకుని సమవుజ్జీలుగా ఉన్న భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఫైనల్ జరగనుండటంతో తుదిపోరు మరింత ఆసక్తి కలిగించడం ఖాయం.

శుభ్‌మన్ శుభారంభం

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఓపెనర్లు శుభారంభం ఇచ్చారు. కెప్టెన్ పృథ్వీ షా, మన్‌జోత్ కల్రాతో కలిసి తొలి వికెట్‌కు 89పరుగులు జోడించారు. ధాటిగా ఆడే క్రమంలో షా 41 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రనౌట్‌గా వెనుదిరిగాడు. 17ఓవర్‌లోనే మరో ఓపెనర్ కల్రా అర్ధశతకానికి చేరువయ్యే క్రమంలో 47 పరుగులు వద్ద పెవిలియన్‌కు చేరాడు. దీంతో భారత్ 94 పరుగులకు రెండు వికెట్లు కోల్పోయింది. వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన శుభ్‌మన్ గిల్ మొదటి నుంచి దూకుడుగా ఆడటం ప్రారంభించాడు. మ్యాచ్ మొత్తానికి అతడి ఇన్నింగ్సే హైలెట్. 108 స్ట్రైక్‌రేటుతో 94బంతుల్లో 102 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచాడు. ఇందులో 7 ఫోర్లు ఉన్నాయి. గిల్‌కు అండగా నిలిచిన దేశాయ్ ఇన్నింగ్స్ నిలబెట్టే ప్రయత్నం చేశాడు. కానీ జట్టు స్కోరు 148 వద్ద ఔటయ్యాడు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన రాయ్ 45 బంతుల్లో 33 పరుగులు సాధించాడు. అర్ధశతకం దిశగా అడుగులు వేస్తున్న క్రమంలో మహమ్మద్ మూసా చేతికి చిక్కాడు. 45 ఓవర్లో రాయ్ అవుట్ కావడం, తర్వాత బ్యాట్స్‌మెన్ నుంచి సరైన సహకారం లేకపోవడంతో భారత్ స్కోరు 272/9కే పరిమితం కావాల్సి వచ్చింది. గిల్ సెంచరీ సాధించినా భారత్ భారీస్కోరు సాధించే అవకాశాలు కోల్పోయింది. పాక్ బౌలర్లలో మహమ్మద్ మూసా 4వికెట్లు, అర్షద్ ఇక్బాల్ 3వికెట్లు తీసి భారత్‌ను కట్టడి చేశారు.

పాక్ క్యూ..

273 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాక్‌కు మొదటి నుంచే కష్టాలు మొదలయ్యాయి. యువ బౌలర్ పోరెల్ ధాటికి పాక్ బ్యాట్స్‌మెన్ అల్లాడిపోయారు. జట్టు మొత్తం స్కోరు కనీసం వంద పరుగుల మార్కు కూడా దాటలేకపోయిందంటే భారత్ బౌలర్లు ఏవిధంగా చెలరేగిపోయారో అర్థం చేసుకోవచ్చు. పోరెల్ ఆరు ఓవర్లకు 17పరుగులిచ్చి నాలుగు వికెట్లు తీశాడు. ఓపెనర్లు ఇమ్రాన్ షా(2), మహమ్మద్ జైద్(7)లతో పాటు అలీ జర్‌యబ్ ఆసిఫ్(1) పోరెల్ ధాటికి ఐదు ఓవర్లకే పెవిలియన్ బాట పట్టారు. మరో బౌలర్ పరాగ్ కూడా చెలరేగి రోహైల్ నజీర్(18), హసన్ ఖాన్(1)ను వెంటవెంటనే పెవిలియన్ పంపాడు. ఓ క్రమంలో పాక్ 25 ఓవర్లు ముగిసేసరికి 8 వికెట్లు కోల్పోయి 48పరుగులు మాత్రమే చేసింది. దీంతో కనీసం 50పరుగులైనా సాధిస్తుందా అన్న అనుమానం కలిగింది. షాద్ ఖాన్(15) కాసేపు నిలబడే ప్రయత్నం చేసినా వికెట్ కీపర్ దేశాయ్ అతడిని స్టంపౌంట్ చేసి పాక్ ఓటమిని దాదాపు ఖాయం చేశాడు. అర్షద్ ఇక్బాల్‌ను అభిషేక్ శర్మ ఔట్ చేయడంతో పాక్ ఇన్నింగ్స్ 69 పరుగుల వద్ద ముగిసింది.

పాక్ కట్టుదిట్టమైన బౌలింగ్

మ్యాచ్ మొదట్లో పాక్ బౌలర్లు కూడా కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ఓ వైపు శుభ్‌మన్ గిల్ చెలరేగి ఆడుతున్నా.. అవతలి ఎండ్ బ్యాట్స్‌మెన్ వరుసపెట్టి పెవిలియన్‌కు పంపి భారత్ భారీస్కోరు సాధించకుండా అడ్డుకున్నారు. అయితే పాక్ బ్యాట్స్‌మెన్ మాత్రం అవకాశాన్ని సద్వినియోగించుకోలేకపోయారు. మహమ్మద్ మూసా ఏకంగా 4వికెట్లు, అర్షద్ ఇక్బాల్ 3వికెట్లు తీశారు. దీనికితోడు మిగతా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో భారత్ 272పరుగులకే పరిమితం కావాల్సి వచ్చింది.

భారత్ భవిష్యత్ సురక్షితం

యూ-19 కోచ్ రాహుల్ ద్రావిడ్



చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 203 పరుగుల తేడాతో యువ క్రికెట్ జట్టు సత్తా చాటడంపై టీం కోచ్ రాహుల్ ద్రావిడ్ ఆనందం వ్యక్తం చేశాడు. భారత్ భవిష్యత్ సురక్షితంగా ఉందని అభిప్రాయపడ్డాడు. ఈ సందర్భంగా మ్యాచ్‌ను నిలబెట్టిన ఇషాన్ పోరెల్, శుభ్‌మన్ గిల్‌ను అభినందించాడు. ఇదే స్ఫూర్తితో ఫైనల్‌లో ఆసిస్‌ను కూడా మట్టికరిపించి ప్రపంచకప్ సాధించాలని అభిలషించాడు.





సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్రబ్యూరో-గుంటూరు : నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం ఆల్‌ఇండియా సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్ టోర్నమెంట్ ప్రారంభమైంది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర క్రీడల, న్యాయశాఖ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని ప్రారంభించారు. ఈ పోటీలు మూడురోజులపాటు జరుగుతాయని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న సివిల్ సర్వీసెస్ అధికారులు పాల్గొన్నారన్నారు. క్రీడలకు అత్యధిక ప్రాధన్యత ఇస్తున్నామన్నారు. రూ.350కోట్లుతో ఇండోర్ స్టేడియం కలిగిన క్రీడామైదాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రాజధాని అమరావతి పరిధిలో ప్రపంచస్థాయి క్రీడామైదానాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నాగార్జున విశ్వవిద్యాలయంలో క్రీడల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం రూ.27కోట్లు మంజూరు చేసిందన్నారు. రాష్ట్రప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ త్రివేది మాట్లాడుతూ ఇరవై ఏళ్ల క్రితం ఉమ్మడి ఏపీలో ఆల్‌ఇండియా సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్ పోటీలు నిర్వహించామన్నారు. ఇప్పుడు నవ్యాంధ్రప్రదేశలో మరోసారి ఈపోటీలు నిర్వహించడం ఎంతోసంతోషంగా ఉందని తెలిపారు. తొలుత మంత్రి కొల్లు రవీంద్ర ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ జెండాను ఎగురవేసి క్రీడలను ప్రారంభించారు. టోర్నమెంట్‌లో దేశవ్యాప్తంగా ఉన్న 570 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఎండీ బంగారురాజు, క్రీడాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అందుకే గేల్‌ను తీసుకున్నాం : సెహ్వాగ్

బెంగళూరు: గేల్‌ను తమ జట్టు కొనుగోలు చేయడంపై కేఎక్స్ఐపీ మెంటర్ కమ్ డైరెక్టర్ వీరేంద్ర సెహ్వాగ్ వివరణ ఇచ్చారు. తాజాగా ఓ వెబ్‌సైట్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ..'గేల్ మన జట్టులో ఉండటం ఎంతో ముఖ్యం. ప్రత్యర్థులు ఎవరైనా ఓపెనింగ్ ఆటగాడిగా అతను రాణిస్తాడు" అని అన్నారు. ఈ ఏడాది కింగ్స్ పంజాబ్ జట్టు బ్యాటింగ్ పరంగా ఎంతో బలంగా ఉంది. జట్టులో గేల్, ఫించ్, మిల్లర్, యువరాజ్, కేఎల్ రాహుల్, స్టోనిస్ వంటి మంచి బ్యాట్స్‌మెన్లను కొనుగోలు చేశారు. అయితే గేల్ అన్ని ఆటల్లో జట్టులో కొనసాగే అవకాశం లేదని సెహ్వాగ్ సూచన ఇచ్చారు.

ధోనీలా సిక్స్‌లు కొడతా : మంజూర్ ధార్



ఐపీఎల్‌కు ఎంపికైన తొలి కాశ్మీరీ మంజూర్ ధార్

రూ.20 లక్షలకు తీసుకున్న కింగ్స్‌ఎలెవన్ పంజాబ్

బెంగళూరు: ఇండియన్ క్యాష్ రిచ్ లీగ్‌గా పేరొందిన ఐపీఎల్ అనామక క్రికెటర్ల జీవితాల్లో వెలుగు నింపుతోంది. ప్రతి సీజన్‌లో ఓ కొత్త క్రికెటర్ జీవితాన్ని కెరీర్ పరంగా.. ఆర్థికపరంగా వారు ఊహించనంతలా మార్చేస్తోంది. ఒకప్పుడు రూ.60 రోజు కూలి పొందిన కాశ్మీర్ యువ ఆటగాడు మంజూర్ ధార్ ఈసారి జరిగిన వేలంలో రూ.20లక్షలు పలికి కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టుకు ఎంపికయ్యాడు. దీంతో కాశ్మీర్ నుంచి ఐపీఎల్‌కు ఎంపికైన తొలి క్రికెటర్‌గా గుర్తింపు పొందాడు. ఈ ఎంపికతో కాశ్మీర్ వ్యాప్తంగా మంజూర్ ధార్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. ఇక అతని సొంత గ్రామ ప్రజలు నాట్యం చేస్తూ పండుగ చేసుకున్నారు.

రాత్రివేళ సెక్యూరిటీ గార్డ్.. పగలు క్రికెటర్

రెక్కాడితేగాని డొక్కాడని జీవితం మంజూర్ ధార్‌ది. నలుగురు చెల్లెల్లు, ముగ్గురు తమ్ముళ్లతో కుటుంబ బాధ్యత తనపై ఉన్నా ఆటపై ఉన్న మక్కువతో ఒకవైపు సెక్యూరిటీ గార్డ్‌గా రాత్రి వేళలో పనిచేస్తూ.. పగలు లోకల్ కోచ్ సాయంతో క్లబ్ క్రికెట్ ఆడేవాడు. 2008 నుంచి 2012 వరకు ఇలా క్లబ్ క్రికెట్ ఆడిన మంజూర్ రాష్ట్ర జట్టులో చోటు కోసం ప్రయత్నించాడు. అనంతరం 2017లో కాశ్మీర్ తరపున తొలి మ్యాచ్ ఆడాడు. సహజసిద్ధమైన ఆటతో అలవోకగా సిక్సులు బాదేవాడు. దీంతో ప్రత్యేక గుర్తింపు పొందాడు. ఈ ఏడాదిలో తన సొంత రాష్ట్రం తరపున 9 టీ20లు, నాలుగు లిస్ట్-ఏ మ్యాచ్‌లు ఆడాడు. ఇక భారత్‌కు ప్రాతినిథ్యం వహించిన పర్వేజ్ రసూల్, మంజూర్ ధార్‌లే కాశ్మీర్ తరపున వేలంలో పాల్గొనగా మంజూర్ ఎంపికవడం విశేషం. కోట్ల రూపాయలు పలకకపోయినా ఈ వేదిక అతని కెరీర్‌కు, కుటుంబానికి ఉపయోగపడుతుందని చెప్పొచ్చు.

ధోనిలా సిక్స్‌లు బాదడమంటే ఇష్టం..

ఈ ఎంపికపై ఆనందం వ్యక్తం చేసిన మంజూర్ ధోనిలా సిక్స్‌లు బాదడమే తనకిష్టమని చెప్పుకొచ్చాడు. తనపై నమ్మకం ఉంచిన పంజాబ్ యజమాని ప్రీతిజింతాకు ధన్యవాదాలు తెలిపాడు. 'నా జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంటూ వచ్చా.. ఇప్పుడు ఐపీఎల్ వేలంలో ఎంపికవడం సంతోషంగా ఉంది' అన్నాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.